
ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో అగ్నిప్రమాదం
నావికుడు గల్లంతు.. తీవ్రంగా దెబ్బతిన్న యుద్ధనౌక > 7

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మంగళవారం TUESDAY 23.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 48 | వెల (Price) రూ.6.50 | తదియ

మంగళవారం, సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-53. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం కృష్ణ పక్షం తిథి: పాడ్యమి ఉదయం 10-24 వరకు, తదుపరి తదియ. నక్షత్రం: ధనిష్ఠ రాత్రి 8-19 వరకు. వర్జ్యం: రాత్రి 2-54 నుంచి తెల్లవారుజామున 4-22 వరకు. రాహుకాలం: పగలు 3-36 నుంచి సాయంత్రం 5-13 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి ఉదయం 9-21 వరకు, పునః దుర్ముహూర్తం: రాత్రి 11-16 నుంచి రాత్రి 12-00 వరకు. అమృతకాలం: ఉదయం 10-48 నుంచి పగలు 12-16 వరకు.

• చిన్నబోయిన చదువుపై చిన్నారుల పోరాటం



అస్తవ్యస్తంగా జరిగిన ఉపాధ్యాయుల బదిలీల ఫలితంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు ప్రభుత్వ పాఠశాలలో నలుగురు టీచర్లే మిగిలారు. పదోతరగతి వరకు ఉన్నా.. పూర్తిస్థాయిలో టీచర్లు లేరు. దీంతో ఉపాధ్యాయులు కావాలంటూ విద్యార్థులు సోమవారం పాఠశాలకు తాళం వేసి, సూర్యాపేట-ఖమ్మం హైవేపై రాస్తారోకో చేపట్టారు. రెండ్రోజుల్లో టీచర్లను డిప్యూటేషన్‌పై నియమిస్తామని డీఈవో హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



సాగు భారమై అప్పు పెరిగింది. ఎవరెన్నిన్ని అన్నా రుణం తీరలేదు. అటో నడిపినా మిత్తికే సరిపోలేదు. దీంతో నిర్మల్ జిల్లా కుబీర్ మండలం సిర్పెల్లి (హెచ్)కి చెందిన రైతు జాదవ్ మారుతి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ తీగలను పట్టుకుని ప్రాణం తీసుకున్నాడు.

• మిషన్ భగీరథ నీళ్లు రాక.. భగీరథ ప్రయత్నం




కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం చంద్రపల్లి పంచాయతీ పరిధిలోని పీకలగుండం గ్రామస్తులు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి తండ్లాడుతున్నారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ఎర్రవాగును దాటి, మధ్యలో ఉన్న దీవికి వెళ్లి చెలిమెల నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. మహిళలు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి బిందెలతో నీరు తెచ్చుకుంటున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సభాపర్వం.. సమస్యల తోరణం



లక్షలోపు రుణమున్నా తమకు మాఫీ జరగలేదని ఆరోపిస్తూ సోమవారం నిర్మల్ జిల్లా పాన్పల్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ ఎదుట ఆందోళనకు దిగిన రైతులు

ఒకవైపు నిరుద్యోగుల ఆందోళనలు.. మరో వైపు రైతుల ఆత్మహత్యలు.. వాటికితోడు కరెంటు కోతలు, తాగునీటి వెతలు.. బదిలీల అక్రమాలపై రోడ్డెక్కుతున్న ఉద్యోగులు.. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగక ఆందోళనలో అన్నదాతలు.. ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు, నేతన్నల బలవన్మరణాలు.. రోజుకో సమస్య ముందుకొస్తున్న తరుణంలో నేటినుంచి రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.



నాలుగు అంచెల కంచెల నడుమ.. నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

పోలీసుల భారీ బందోబస్తు
25న పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్



మాఫీపై ఫిర్యాదుల వెల్లువ

ఏఈవోల వద్దకు రైతుల పరుగులు.. బ్యాంకుల వద్ద బారులు

డీసీసీబీ, ప్యాక్స్‌ల్లో సగం మందికే రుణమాఫీ

హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): రూ.లక్షలోపు రుణమాఫీ అమలవుతున్న తీరుపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తొలి జాబితాను చూసిన తరువాత రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రూ.లక్షలోపు రుణమే ఉన్నప్పటికీ తమ పేర్లు జాబితాలో కనిపించకపోవడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జాబితాలో పేర్లు ఉన్నవారికి కూడా సంపూర్ణంగా మాఫీ కాలేదని, అరకొరగానే మాఫీ అయిందని రైతులు చెప్తున్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఫిర్యాదు సెంటర్లకు, ఏఈవోలకు రైతుల నుంచి పెద్దసంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. తమకు రుణమాఫీ అయిందో, లేదో తెలుసుకునేందుకు బ్యాంకుల ముందు రైతులు బారులు తీరుతున్నారు. అక్కడ > 6వ పేజీలో



33 వేల మందికి మాఫీ కాలేదు

• ఖాతాలు, సాంకేతిక కారణాలతో ఇబ్బందులు
• సాధ్యమైనంత త్వరలో రెండో విడత : తుమ్మల > 6

గతి తప్పిన పాలన

మొద్దునిద్రలో ప్రభుత్వం.. అన్ని వర్గాలు రోడ్లపై



- 30-40 శాతం రైతులకు రుణమాఫీ రానేలేదు
- విద్యుత్తు వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది
- ఫస్ట్‌కే జీతాలిస్తామన్నారు.. నెలల కొద్దీ జీతాల్లేవు
- టీహబ్ బ్యాంక్ అన్నారు.. వాళ్లకే కీలక పదవులు
- 8 వేల మంది ఫీల్డ్‌అసిస్టెంట్లకు 2 నెలలుగా జీతాల్లేవ్
- దాదాపు లక్ష కల్యాణలక్ష్మి చెక్కులు పెండింగ్‌లోనే
- నెల దాటినా రైతు బీమా చెక్కులు అందడం లేదు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాజీమంత్రి హరీశ్

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదని, గవర్నెన్స్ రావడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు రోడ్డెక్కేలా ప్రభుత్వ పాలన తయారైందని విమర్శించారు. సోమవారం అసెంబ్లీలోని బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన ఆయన.. రుణమాఫీకి, రేషన్‌కార్డుకు సంబంధం లేదని సీఎం చెప్పినా.. రేషన్ కార్డు నిబంధననే అమలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ అధ్యయనం ప్రకారం క్షేత్రస్థాయిలో 30-40 శాతం రైతులకు రుణమాఫీ అమలు కాలేదని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ యోజనకు రుణమాఫీకి లింక్ పెడుతున్నారని > 6వ పేజీలో

మిత్తిపై తప్పుడు లెక్క

కట్టేది 2వేల కోట్లు.. చెప్పేది 7వేల కోట్లు

వడ్డీలపై లెక్క తప్పిన సీఎం.. అప్పులపై బీద అరుపులు



- గత ప్రభుత్వ అప్పులపైనా అదే తప్పుడు ప్రచారం
- పదేండ్ల ఆర్థిక వృద్ధి మరుగుపర్చుతున్న నిపుణులు
- రెండున్నర రెట్లు పెరిగిన తెలంగాణ తలసరి ఆదాయం, జీఎస్డీపీ, పన్ను రాబడి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): 'అబద్ధం అడితే అతికినట్టుండాలి' అన్నది పాతకాలం నాటి నానుడి. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఒక అబద్ధాన్ని పదేపదే వల్లెవేస్తూ.. అదే నిజమనే భావన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారని ఆర్థిక నిపుణులు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెలవారీగా చెల్లిస్తున్న మిత్తీలపై కాకిలెక్కలు చెప్తున్నారని ఆరోపిస్తున్నారు. 'గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు చేసింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెల రూ.7వేల కోట్ల మిత్తీలు కడుతున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి మొదటినుంచీ ఆరోపిస్తున్నారు. తాజాగా గురువారం రుణమాఫీ నిధులు విడుదల సందర్భంగా సైతం అవే వ్యాఖ్యలు చేశారు. పైగా 'ప్రతి సారి తిన్నా.. తినకపోయినా.. ఉపవాసం ఉండి అయినా ప్రతి నెల రూ.7వేల కోట్ల మిత్తీలు కడుతున్నాం' అంటూ సానుభూతి > 2వ పేజీలో

సర్కారు వైఫల్యాలపై సమరమే

అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ వ్యూహమిదే

- కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారెంటీల అమలుకు పట్టు
- నిరుద్యోగ సమస్యలపై నిలదీత.. రుణమాఫీపై రణం
- బడ్జెట్ సెషన్‌లో చర్చకు ఒత్తిడి తేనున్న ప్రధాన ప్రతిపక్షం
- నేడు బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం.. కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలు, నిరుద్యోగ సమస్యలు, రుణమాఫీ తదితర అంశాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని భారత రాష్ట్ర సమితి శాసనసభాపక్షం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చకు పెట్టాలని ప్రభుత్వం ముందు ఉంచనున్నది. దాదాపు 10 కీలకమైన అంశాలను చర్చించడానికి పట్టుబట్టాలని ఒత్తిడి తీసుకురానున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు చేసే దిశగా > 3వ పేజీలో

అగ్నిపథ్ స్కీమ్‌లో స్కామ్?

కటాఫ్ కంటే తక్కువ మార్కులు వచ్చినా అగ్నివీర్‌లుగా ఎంపిక
అందరి మార్కుల వెల్లడికి ఆర్మీకి హైకోర్టు ఆదేశం > 7
'ది వైర్'లో సంచలన కథనం

ఏసీబీకి చిక్కిన దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ > 5

ఇంజక్షన్ ఆర్డర్‌పై కౌంటర్ దాఖలుకు 50 వేలు డిమాండ్

సరైన జవాబేదో తేల్చండి


నీట్‌లో వివాదాస్పద ప్రశ్నపై ఢిల్లీ ఐఐటీని కోరిన సుప్రీంకోర్టు > 7

ధరల గాయం.. నగదు సాయం

పేదలకు ఫుడ్ కూపన్లు, నగదు బదిలీకి ఆర్థికసర్వే-2024 సూచన



- గతంతో పోల్చితే వృద్ధిరేటు అంచనా తగ్గింపు.. ఈసారి జీడీపీ 6.5-7 శాతమే
- చైనా ఎఫ్‌డీఐపై మోదీ సర్కారు ఆసక్తి.. జీసీసీల ఏర్పాటులో కేసీఆర్ సర్కారు భేష్
- ఉద్యోగులను మింగేస్తున్న ఏఐ.. అన్ని రంగాల కొలువులపై తీవ్రప్రభావం
- పెరుగుతున్న స్థూలకాయం.. అనారోగ్యకర ఆహారంతో 54% వ్యాధులు > 8
- రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు మరిన్ని నిధులు పెంచాలి: ఆర్థిక సర్వే-2024
- దేశ ఆర్థికాభివృద్ధిపై ఘన ప్రచారమంతా గాలిబుడగేనని మరోసారి తేటతెల్లం



మెరిసిన సిద్దిపేట స్టీల్ బ్యాంక్

ఆర్థిక సర్వేలో ప్రత్యేక ప్రస్తావన

సిద్దిపేట, జూలై 22: జాతీయ స్థాయిలో మరోసారి సిద్దిపేట పేరు మారుమోగింది. పార్లమెంట్‌కు సమర్పించిన ఆర్థిక సర్వేలో సిద్దిపేట స్టీల్ బ్యాంకుకు ప్రత్యేక గుర్తింపు లభించడం ఇందుకు తార్కాణం. ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చే లక్ష్యంతో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చేసిన వినూత్న ప్రయత్నానికి నేడు జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయి. సిద్దిపేట పట్టణంలో ప్లాస్టిక్ నివారించాలనే ఉద్దేశంతో 43 వార్డులకు గాను 34 వార్డుల్లో ప్రత్యేకంగా స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేశారు. ఎలాంటి > 6వ పేజీలో



నేడు కేంద్ర బడ్జెట్

- పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మల
- వరుసగా ఏడో బడ్జెట్‌తో మొరార్జీ రికార్డు బద్దలు
- ఈసారైనా ఆదాయం పన్ను ఉపశమనం దక్కేనా? > 7



మూసీ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

10 వేల కోట్లివ్వండి

- మూసీ ముగునీటి శుద్ధికి రూ.4వేల కోట్లు అందించండి
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ కోసం 6 వేల కోట్లివ్వండి
- ఓఎంసీలకు ముందుగానే గ్యాస్ సప్లైకి అవకాశమివ్వండి
- పౌర సరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి > 10
- కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్, మంత్రుల వినతులు

స్వశక్తి మహిళలకు సర్కారు ధోకా?

కుట్టు పైసల్లోనూ కత్తిరింపు!

- మాట తప్పిన రేవంత్‌రెడ్డి సర్కార్
- దుస్తుల కుట్టు కూలీ రూ. 50 చెల్లింపు
- రూ.75కు ధర పెంచుతూ జీవో
- ఎస్ఎస్ నిధులు మాత్రమే విడుదల
- అదనంగా రూ.25 చెల్లిస్తారా? లేదా?

సర్కార్ తీరుపై మహిళల ఆవేదన

కరీంనగర్, జూలై 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): విద్యార్థుల యూనిఫామ్ దుస్తుల కుట్టు కూలీ ఒక జతకు రూ. 50 నుంచి రూ. 75కు పెంచుతూ జీవో ఇచ్చినా.. ప్రభుత్వం డబ్బులు మాత్రం ఇంకా చెల్లించలేదు. దుస్తులు కుట్టించిన తర్వాత సమగ్ర శిక్ష ద్వారా కేంద్రం నుంచి వచ్చిన డబ్బులు మాత్రమే విడుదల చేసి, రేయింబవళ్లు కష్టపడ్డ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చేయిచ్చిందనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు పంపిణీ చేసే యూనిఫామ్ దుస్తుల కుట్టు పని > 2వ పేజీలో



సోమవారం సాయంత్రం భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను దాటి 49 అడుగులకు చేరిన గోదావరి ప్రవాహ ఉధృతి

ఉగ్ర గోదావరి

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- ప్రాణహిత వరదతో కాళేశ్వరం వద్ద ఉధృత ప్రవాహం
- జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద
- రాబోయే మూడు రోజులు విస్తారంగా వర్షాలు > 10

ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరల పెంపు



- 1,375 చికిత్సల రేట్లు సవరణ
- కొత్తగా 163 వ్యాధుల చేరిక
- 54 శాతం పెరగనున్న బడ్జెట్
- మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరలను సవరించినట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 1,375 చికిత్సలకు సగటున 25 శాతం వరకు ధరలు పెంచినట్టు పేర్కొన్నారు. దీంతోపాటు ఆరోగ్యశ్రీలోకి కొత్తగా 163 వ్యాధులను చేర్చుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 1,672 ప్యాకేజీలు ఉండగా, కొత్త వాటితో కలిపి 1,835కి పెరిగినట్టు చెప్పారు. ఇటీవలే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. వీటన్నింటి ఫలితంగా ఆరోగ్యశ్రీ బడ్జెట్ ఈ > 6వ పేజీలో

ఏడో వసంతంలోకి గ్రీన్ ఇండియా చాలెంజ్

- 3 మొక్కలతో మొదలైన మహా ఉద్యమం
- తెలంగాణకు హరితహారమే స్ఫూర్తి
- మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ తలపెట్టిన మహాకార్యం
- ఇప్పటిదాకా నాటిన మొక్కలు 265 కోట్లు
- గిన్నిస్, లిమ్కా బుక్ రికార్డ్స్
- భువనేశ్వర్‌లో ప్రారంభమైన ఏడో విడత వేడుక



భువనేశ్వర్‌లోని ఐతరస్ గ్రామంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో మొక్క నాటి గ్రీన్ ఇండియా చాలెంజ్ ఏడో విడతను ప్రారంభిస్తున్న స్పీకర్ సురమా పాఢి, సంతోష్‌కుమార్



సోమవారం ఖుర్దా జిల్లా పరిధి కైపాదర్‌లోని శ్రీజగన్నాథ్ కాలేజీలో మొక్కలతో సంతోష్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఇంతింతై వటుడింతై అన్నట్టు.. మూడు మొక్కలతో మొదలైన 'గ్రీన్ ఇండియా చాలెంజ్' (జీఐసీ) కార్యక్రమం ఇప్పుడు మహోద్యమంగా మారింది. బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ప్రారంభించిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమ స్ఫూర్తితో రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ 'గ్రీన్ ఇండియా చాలెంజ్'ను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బర్త్ డే సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ చాలెంజ్ కింద రిజర్వు ఫారెస్టులను దత్తత తీసుకున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ అటవీ ప్రాంతాన్ని సంరక్షించాలని గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు శ్రీకారం చుట్టారు. 2018 జూన్ 17న మొదలైన ఈ మహోత్తర కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 265 కోట్ల మొక్కలను నాటారు. ఈ మహాయజ్ఞంలో సామాన్యులతోపాటు అనేక మంది సెలబ్రిటీలు పాల్గొని మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రోగ్రాం 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నది. దేశంలో తలపెట్టిన మంచి కార్యక్రమాల్లో భాగంగా గ్రీన్ ఇండియా చాలెంజ్‌పై ఇండియా టుడే ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఐతరస్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సురమా పాఢి మొక్క నాటి గ్రీన్ ఇండియా చాలెంజ్ ఏడో విడత కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. 'హర హైతో భరా హై- గ్రీన్ ఇండియా చాలెంజ్' (భూమి పచ్చగా ఉంటే లోకం నిండుగా ఉంటుంది) అనే నినాదంతో మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టారు. రెండోరోజు సోమవారం ఖుర్దా జిల్లా పరిధిలోని కైపాదర్‌లోని జగన్నాథ్ కాలేజీలో కళాశాల విద్యార్థులు 1500కుపైగా పండ్ల మొక్కలను నాటారు. 2030 నాటికి ఒడిశాలో కోటి చెట్లను పెంచడమే లక్ష్యం. ఇగ్నైటింగ్ మైండ్స్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రేరణ ఇంటర్నేషనల్ అండ్ ఆరుణిటీస్ ట్రస్ట్ సహకారం అందించాయి. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్, ఇగ్నైటింగ్ మైండ్స్ సహ వ్యవస్థాపకులు ఎం కరుణాకర్ రెడ్డి, ఇగ్నైటింగ్ మైండ్స్ ఒడిశా నాయకుడు, ప్రొఫెసర్ ప్రఫుల్ల దల్, ట్రీమ్యాన్ ఆఫ్ ఒడిశా, గ్రీన్ ఆర్మీ ప్రెసిడెంట్ డాక్టర్ దిలీప్ శ్రీచందన్, రాఘవ సంకేపల్లి తదితరులు పాల్గొన్నారు.

జీఐసీలోని కీలకాంశాలు

- గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రేరణతో బాహుబలి స్టార్ ప్రభాస్ మేడ్చల్ జిల్లాలోని ఓఆర్‌ఆర్ సమీపంలోని 1,650 ఎకరాల కాజీపల్లి రిజర్వు ఫారెస్టును 2020 సెప్టెంబర్‌లో దత్తత తీసుకున్నారు.
- హెటిరో ఫార్మా మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని ముంబాపూర్-నల్లవెల్లి రిజర్వు ఫారెస్టు సుమారు 2,543 ఎకరాలను 2020 అక్టోబర్ 5న దత్తత తీసుకున్నది. ఇందుకోసం రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చారు.
- 2021జూలై 4న ఆదిలాబాద్‌లో అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న గంటలో 10 లక్ష మొక్కలు నాటారు.
- మహబూబ్‌నగర్ జిల్లా అంగన్‌వాడీ, మెప్మా, స్వయంసహాయక సంఘాల మహిళలు 10 రోజుల్లో 2.08 కోట్ల విత్తన బంతులను సిద్ధం చేశారు. దేశంలోనే అతిపెద్దదైన కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ (2,097 ఎకరాలు)లో డ్రోన్ల సాయంతో వాటిని నాటారు. ఇది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది.
- 2021 జూలై24న జీఐసీలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని దుర్గానగర్‌లో ఒక గంటలో 16,900 మంది 3,54,900 మొక్కలు నాటారు. ఇది లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నది.
- 2021 జూలై 24న కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా జీఐసీ ముక్కోటి వృక్షార్చన తలపెట్టింది. తెలంగాణవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో 3.30 కోట్ల మొక్కలు నాటించింది.
- 2021 జూలై 27న జీఐసీలో భాగంగా బిగ్ బీ అమితాబ్ బచ్చన్ రామోజీ ఫిలిం సిటీలో మొక్క నాటారు.
- 2022 ఫిబ్రవరి 9న ఢిల్లీ కరోల్‌బాగ్‌లోని నరైన్ ఇండస్ట్రియల్ ఏరియాలో లక్ష మొక్కలు నాటేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను జీఐసీ ప్రారంభించింది.
- 2022 ఫిబ్రవరి 17న అప్పటి సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున తన తండ్రి నాగేశ్వర్‌రావు జ్ఞాపకార్థం హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని చెంగిచెర్ల ఫారెస్ట్ బ్లాక్ (1,100 ఎకరాలు)ను అభివృద్ధి చేయడానికి దత్తత తీసుకున్నారు.
- 2022 జూన్ 16న సద్గురు జగ్గీ వాసుదేవ్ శంషాబాద్‌లో మొక్కనాటి జీఐసీ ఐదో విడతను ప్రారంభించారు.
- 2023 ఫిబ్రవరి 17న కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా జగిత్యాల జిల్లా కొండగట్టు ప్రాంతంలోని వెయ్యి ఎకరాలకుపైగా అటవీ భూమిని జీఐసీలో భాగంగా సంతోష్‌కుమార్ దత్తత తీసుకున్నారు.
- 2023 మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలపై చూపిన అదే ప్రేమతో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని మహిళాలోకానికి సంతోష్‌కుమార్ విజ్ఞప్తిచేశారు.
- గ్రీన్ రిబ్బన్ చాంపియన్ అవార్డును గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త సంతోష్‌కుమార్ పొందారు.
- అమీర్‌ఖాన్, సంజయ్‌దత్, సల్మాన్‌ఖాన్, అజయ్‌దేవగణ్, కంగనారనౌత్, ఆర్‌ఆర్‌ఆర్ బృందం సభ్యులు కూడా జీఐసీలో పాల్గొని మొక్కలు నాటారు.

గ్రీన్ చాలెంజ్‌లో ఎలా పాల్గొనాలంటే..

మీ ఇల్లు, పార్కు, బాల్కనీ లేదా మరేదైనా ప్రదేశంలో మూడు మొక్కలు నాటాలి. వాటితో సెల్ఫీ తీసుకొని ఆ ఫొటోలను 9000365000కు వాట్సాప్ చేయాలి. ఫొటోలను పంపిన వెంటనే మీకు యాప్ డౌన్‌లోడ్ చేసుకోమని ఒక మెసేజ్ వస్తుంది. దానిని మీరు డౌన్ చేసుకొని మీ సెల్ఫీలను అప్‌లోడ్ చేయాలి. అంతే..! ఆ ఫొటోలను గ్రీన్ ఇండియా చాలెంజ్ అధికారిక సోషల్ మీడియా పేజీల్లో పోస్టు చేస్తారు. ఇంతెందుకు ఆలస్యం.. రాబోయే తరాల కోసం ఇప్పుడే మొక్కలు నాటండి. వాటిని సంరక్షించండి. దీంతో పాటు మీ స్నేహితులు, బంధువులు, సన్నిహితులు కూడా మూడు మొక్కలు నాటాలని చాలెంజ్ విసరండి.

నాలుగు అంచెల కంచెల నడుమ..

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు.. పోలీసుల భారీ బందోబస్తు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభా సమావేశాలు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభంకానున్నాయి. సభ ప్రారంభం అనంతరం కంటోన్మెంట్ శాసనసభ్యురాలు లాస్యనందిత మృతికి సభ సంతాపం తెలపనున్నది. సభ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం జరుగనున్నది. ఈ నెల 25న రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజు ఉదయం 9గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో క్యాబినెట్ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనున్నది. శాసనమండలి సమావేశాలు ఈ నెల 24 బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభంకానున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా చర్చిస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆర్వోఆర్ కొత్త చట్టం తీసుకురానున్నారని సమాచారం. సమావేశాలకు పోలీసులు నాలుగు అంచెల కంచెల విధానాన్ని అమలు చేస్తున్నారు. పబ్లిక్ గార్డెన్ ఐస్‌ఫ్యాక్టరీ దగ్గర భారీ ఎత్తుతో కంచెలను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ లోపలికి వెళ్లే దగ్గర రెండు రకాల కంచెలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కంచెలను తొలగించామని ప్రకటించిన ప్రభుత్వం... అందుకు విరుద్ధంగా గతంలో కంటే ఎక్కువగా కంచెలను ఏర్పాటు చేసిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 2 లేదా 3వ తేదీతో ముగిసే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఈనెల 25న బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజున ఆనవాయితీ ప్రకారం 26న సెలవు ఇవ్వనున్నారు. ఆదివారం నగరంలో బోనాలు ఉండటంతో ఆ రోజు కూడా సెలవు ఇవ్వనున్నారని సమాచారం. ఈనెలాఖరు కల్లా బడ్జెట్‌ను ఉభయ సభలు ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించాల్సి ఉంటుంది. గతంలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఈనెలాఖరుతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో మొదట బడ్జెట్‌కు సభ ఆమోద తెలపాల్సి ఉంది.

రియల్' ఢమాల్!

- క్యూ-2లో దేశవ్యాప్తంగా భూముల అమ్మకాలు కుదేలు
- హైదరాబాద్‌లో విక్రయం ఒక్కటే
- ఎన్నికల ప్రభావంతో తగ్గిన భూం
- 'అనరాక్' సంస్థ నివేదిక వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం తిరోగమన దిశలో సాగుతున్నది. గత మూడు నెలలుగా అన్ని ప్రధాన మెట్రో నగరాల్లో భూముల క్రయవిక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయని, ఏప్రిల్-జూన్ త్రైమాసికం (క్యూ-2)లో మొత్తంగా 325 ఎకరాలకు సంబంధించిన 25 లావాదేవీలు మాత్రమే జరిగాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ 'అనరాక్' తన తాజా నివేదికలో వెల్లడించింది. ధరల పెరుగుదల, సార్వత్రిక ఎన్నికలే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొన్నది. నిజానికి ఇదే సమయంలో దేశవ్యాప్తంగా 721 ఎకరాలకు సంబంధించిన 29 లావాదేవీలు జరిగినట్టు తెలిపింది. ప్రస్తుతం లావాదేవీల సంఖ్యలో బెంగళూరు అగ్రగామిగా నిలిచిందని, ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య ఆ నగరంలో 114 ఎకరాలకు సంబంధించిన 9 వేర్వేరు లావాదేవీలు జరిగాయని 'అనరాక్' గ్రూప్ రీజనల్ డైరెక్టర్, రిసర్చ్ అండ్ అడ్వైజరీ హెడ్ ప్రశాంత్ ఠాకూర్ వెల్లడించారు. ఇదే సమయంలో గుర్గావ్‌లో 7 లావాదేవీల ద్వారా 77.5 ఎకరాలు, ముంబైలో 2 లావాదేవీల ద్వారా 4.52 ఎకరాలు, హైదరాబాద్‌లో 1 లావాదేవీ ద్వారా 48 ఎకరాలు, పుణెలో 2 లావాదేవీల ద్వారా 27.5 ఎకరాలు, చెన్నైలో 1 లావాదేవీ ద్వారా 27 ఎకరాలు, థానేలో 2 లావాదేవీల ద్వారా 24.95 ఎకరాలు, అహ్మదాబాద్‌లో 1 లావాదేవీ ద్వారా కేవలం 1.37 ఎకరాల విక్రయాలు జరిగినట్టు వివరించారు.

ఈ ఏడాది తొలి 6 నెలల్లో జరిగిన 'రియల్' డీల్స్

నగరం	లావాదేవీలు	ఎకరాలు
బెంగళూరు	15	216
గుర్గావ్	14	162
ముంబై	5	34
హైదరాబాద్	3	63.5
చెన్నై	3	48
ఘజియాబాద్	1	62.5
ఢిల్లీ	1	5
దేశవ్యాప్తంగా	54	1,045



తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకురాలు తుల ఉమ. చిత్రంలో గాదె ఇన్నయ్య, తెలంగాణ విఠల్, పాశం యాదగిరి తదితరులు

అక్కడ ఏ1.. ఇక్కడ ఏ2 పాలన

- తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేందుకు చంద్రబాబు కుట్ర
- 18 మందిని పొట్టనపెట్టుకున్న వ్యక్తికే జైకొట్టడం సిగ్గుచేటు
- 42వేల మంది చెరుకు రైతుల పొట్టగొట్టిన ఘనత ఆయనది
- రైతు రుణమాఫీకి డబ్బు లేవుగానీ లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళనా?
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్, జూలై 22: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు మరోసారి తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చే కుట్రలు పన్నుతున్నారని, అందుకు విభజన చట్టాన్ని సాకుగా తీసుకుంటున్నారని, రాష్ట్రం సిద్ధించి దశాబ్దమైనా ఇంకా పోరాడాల్సిన దుస్థితి వచ్చిందని, మళ్లీ కొట్లాడేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధం కావాల్సిన తరుణమిదని తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు విమర్శలు గుప్పించారు. తెలంగాణ విఠల్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రస్తుతం అక్కడ (ఆంధ్రప్రదేశ్)లో ఏ1.. ఇక్కడ (తెలంగాణ)లో ఏ2 పాలన సాగుతున్నారని, తెలంగాణ ఉద్యమాన్ని తూటాదెబ్బలతో అణచివేయాలని ప్రయత్నించిన వ్యక్తికి ఇక్కడి పాలకులు భజన చేయడం దురదృష్టకరమని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన బెల్లి లలిత, మారోజు వీరన్న తదితర 18 మందిని పొట్టన పెట్టుకున్న వ్యక్తికి జై కొట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ సామాజికవర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును మేధావి అని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశాడంటూ పొగడమేమిటని ప్రశ్నించారు. భువనగిరిలో 18 మంది ఎలా చనిపోయారో ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. రూ.169 కోట్లకు నిజాం షుగర్స్ భూములను అమ్మేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, 42వేల మంది చెరుకు రైతుల పొట్టగొట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో దొంగల పాలన కొనసాగుతున్నదని, అధిష్ఠానంలో ఉన్న సోనియాగాంధీ, రాహుల్, అధినాయకత్వం ధృతరాష్ట్ర పాత్ర పోషిస్తున్నారని దుయ్యబట్టారు. 'ఉద్యమకారులకు ఏమైనా చేయాలని కోరితే ఏమైనా చేసుంటున్నారా?' అని అడుగుతున్నరు. ఏం చేయాలి కావాలి? ఏమైనా ట్రీట్‌మెంట్ కావాల్నా?' అని పాశం ధ్వజమెత్తారు. నాడు చంద్రబాబు నాయుడు, వెంకయ్యనాయుడుతో కలిసి అర్ధరాత్రి పోలవరం ప్రాజెక్టు కోసం ఆర్డినెన్స్ తెచ్చుకున్నారని, ఏడు మండలాలను కోల్పోయి రెండు లక్షల మంది నిర్వాసితులయ్యారని, ఇప్పటికే పర్ణశాల, కల్యాణ కట్ట, నవగ్రహాల ఆలయం మునిగిపోయాయని, మరో పది అడుగులు కదిలితే రామదాసు ఆలయం, ఇంకో పది అడుగులు కదిలితే పూర్తిగా భద్రాచలం పట్టణం, గర్భాలయం కూడా మునిగిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రూ.లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన ఎలా చేస్తావని సీఎం రేవంత్‌రెడ్డిని పాశం యాదగిరి ప్రశ్నించారు.

ఎవడబ్బసొత్తని భూమి ఇస్తరు?: గాదె ఇన్నయ్య

ఢిల్లీ తరహాలో హైదరాబాద్‌లో ఏపీ భవనం కట్టుకోవడానికి భూమి ఇచ్చేందుకు సిద్ధమయ్యారని, ఎవడబ్బసొత్తని భూమి ఇస్తారని తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ప్రశ్నించారు. విభజన చట్టంలోని 9, 10వ షెడ్యూల్‌లు చదువుకుంటే వాస్తవాలు తెలుస్తాయని సూచించారు. పునర్విభజన చట్టంలోని అంశాలను తేల్చేందుకు కొత్తగా కమిటీలు వేశారని, కమిటీల పేరుతో కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు చేస్తారని ఎద్దేవాచేశారు.

స్థానిక ఎన్నికల్లో ఉద్యమకారులనే గెలిపించుకోవాలి : అరుణ

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు గ్రామీణ స్థాయి నుంచి మరోసారి ముందుకు రావాల్సిన అవసరం ఏర్పడిందని, పొంచి ఉన్న ముప్పు, జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ ప్రజలకు వివరించాలని తెలంగాణ ఉద్యమకారిణి అరుణ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులనే గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకురాలు సుశీలారెడ్డి మాట్లాడుతూ పదేండ్ల తర్వాత మళ్లీ ఇలాంటి పరిస్థితులు చూడాల్సి వస్తుందని అనుకోలేదని, పదేండ్ల పాటు ఇటు కన్నెత్తి చూడని చంద్రబాబు మళ్లీ ఈ ప్రాంతంపై దృష్టిపెట్టారని, ఇటీవల హైదరాబాద్ నగరం పసుపుమయంగా మారడం వెనుక ఆ ప్రమాదాన్ని గుర్తించాలని ఆందోళన వ్యక్తంచేశారు.

కృష్ణాజలాలపై నోరువిప్పని రేవంత్ : తెలంగాణ విఠల్

రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ విఠల్ మాట్లాడుతూ కృష్ణాజలాల్లో తెలంగాణ వాటాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు 75 శాతం పూర్తయిందని, ప్రభుత్వం మరో రూ.35వేల కోట్లు కేటాయిస్తే ప్రాజెక్టు సంపూర్ణమై 18 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుందని చెప్పారు. కానీ ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి రూ.1.50 లక్షల కోట్ల మూసీ ప్రక్షాళన అంశాన్ని తెరపైకి తెచ్చారని, మూసీతో ఎన్ని ఎకరాలు పండిస్తారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని విఠల్ ప్రశ్నించారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ కేవీ చంద్రశేఖర్, నిఖిల్, షహాబాజ్, కొండస్వామి, దయానందన్, షాహిద్, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై మళ్లీ వలసవాదుల కండ్లు : తుల ఉమ

తెలంగాణ వనరులను మనమే వాడుకోవాలన్న ఆకాంక్షతో సకలజనుల భాగస్వామ్యంతో ఉద్యమం చేసి స్వరాష్ట్రం సాధించుకున్నామని, అలాంటి తెలంగాణపై మరోసారి వలసవాదుల కండ్లు పడ్డాయని బీఆర్‌ఎస్ నాయకురాలు తుల ఉమ మండిపడ్డారు. చంద్రబాబు మళ్లీ ఇక్కడ పాగా వేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం రోజు ఆయన ప్రసంగంలో తెలంగాణ మాట, తెలంగాణ నినాదమే వినపడలేదని ఇందుకు తాను చాలా బాధపడ్డానని చెప్పారు. తెలంగాణ వచ్చిన, తెలంగాణ ఎలా వస్తుందో చూస్తానని తుపాకీ ఎక్కుపెట్టిన వ్యక్తి చేతిలో పాలన ఉంటే తెలంగాణ అస్తిత్వం ఎలా మనగలుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన పదేండ్లలో కనబడని చంద్రబాబు మళ్లీ ఈ ప్రాంతంపై దృష్టి పెట్టారని, ఇటీవల ఆయన పర్యటనలో హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా ఆయన బొమ్మలే కనిపించాయని చెప్పారు. ఆంధ్రా వ్యక్తులు ర్యాలీలు, గర్వాలు తిరుగుతూ మళ్లీ అడ్డా వేస్తామని నినదించడం దేనికి సంకేతమని? ప్రశ్నించారు. ఇందుకు దారిన ఇచ్చిన ఆ కమ్యూనిటీకే ఆ విషయం తెలియాలని చెప్పారు.

స్వశక్తి మహిళలకు సర్కారు ధోకా?

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. ఒక్కో జతకు 50 రూపాయలు చెల్లించడానికి ఒప్పందం చేసుకోగా, కుట్టుపనులకు అవసరమయ్యే ముడి సామగ్రికే ఆ మొత్తం సరిపోదని మహిళా సంఘాలు తెగేసిచెప్పాయి. మార్చి 12న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మహాలక్ష్మి మహిళా సమ్మేళనంలో కుట్టు కూలీ పెంచాలని కోరుతూ.. మహిళా సంఘాల సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆ మేరకు స్పందించిన సీఎం రేవంత్ కేంద్రం నుంచి విడుదలయ్యే కుట్టుకూలీకి అదనంగా మరో ₹25 రాష్ట్ర ప్రభుత్వం కలిపి జతకు ₹75 చెల్లిస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఆవెంటనే ఉత్తర్వులు జారీచేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచే పెంచిన చార్జీలను వర్తింపచేస్తామని, వెంటనే ఆ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని, జూన్7న జీవోనం 995 సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. ధరల పెంపుతో మహిళలంతా సంబురంగా పని పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 26,009 స్కూళ్లలోని 18,58,841 మంది విద్యార్థులకు ఒక్కో జత చొప్పున ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కుట్టి దుస్తులు అందించారు. వీరికి కుట్టు కూలీ కింద రూ.13,94,13,075 చెల్లించాల్సి ఉంది. అయితే, కుట్టు కూలీ కింద సమగ్రశిక్ష నుంచి విడుదలైన మొత్తంలో నుంచి జతకు ₹50 చొప్పున మాత్రమే డబ్బులు విడుదల చేసింది. ₹9,29,42,050 మాత్రమే చెల్లింపు చేస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా సమగ్ర శిక్ష నుంచి వచ్చిన ₹50కి మరో ₹25 జతచేసి ₹75 ఒకే సారి మొత్తాన్ని విడుదలచేయాల్సి ఉన్నది. కానీ, సమగ్ర శిక్ష నుంచి వచ్చిన నిధులను మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ₹4,64,71,025 పెండింగ్‌లో పెట్టడంపై దుస్తులు కుట్టిన మహిళలంతా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వాటా ఇప్పట్లో చెల్లిస్తుందా..? లేదా..? అన్న దానిపై ఏ అధికారి వద్ద స్పష్టమైన సమాచారం లేదు.

మిత్తీలపై తప్పుడు లెక్క

మొదటిపేజీ తరువాయి...

పొందే ప్రయత్నం చేశారు. అయితే ముఖ్యమంత్రి చెప్పింది పచ్చి అబద్ధమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు కాగ్ సమర్పించిన గణాంకాలనే సాక్ష్యంగా చూపుతున్నారు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మే నెల వరకు ఆరు నెలల్లో వడ్డీల కింద చెల్లించిన మొత్తం రూ.12,199 కోట్లు. అంటే సగటున నెలకు కట్టింది రూ.2,033 కోట్లు మాత్రమే. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అయితే నెలకు రూ.1865 కోట్లు మాత్రమే చెల్లించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే రూ.7వేల కోట్లు చెల్లిస్తున్నట్టు చెప్తున్నారని విమర్శిస్తున్నారు. ఒక్క రూపాయి కట్టి మూడున్నర రెట్లు కట్టినట్టు ప్రచారం చేస్తున్నారని మండిపడుతున్నారు.

అప్పులపైనా అదే ప్రచారం

గత ప్రభుత్వం చేసిన అప్పులపైనా సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే తప్పుడు ప్రచారం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నిజాలు డిసెంబర్‌లో అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేత పత్రం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ అన్ని రకాల అప్పులు కలిపి రూ.6.71 లక్షల కోట్లు. ఇందులో ఎఫ్‌ఆర్బీఎం రుణాలు రూ.3.89 లక్షల కోట్లు మాత్రమే. మిగతావి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు గ్యారెంటీగా ఉండి సమీకరించిన రుణాలు. వాస్తవానికి తెలంగాణ ఏర్పడేనాటికే వారసత్వంగా రూ.72,658 కోట్ల అప్పులు వచ్చాయి. అంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పులు రూ.6 లక్షల కోట్లు మాత్రమే. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష కోట్లు అదనంగా చేర్చి చెప్తున్నారని విమర్శిస్తున్నారు.

ఆర్థిక వృద్ధి సంగతేమిటి?

కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, కాంగ్రెస్ నేతలు పదేపదే విమర్శిస్తున్నారే తప్ప.. గత పదేండ్లలో జరిగిన ఆర్థిక ప్రగతిని ఎందుకు గుర్తించడంలేదని ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర బడ్జెట్, తలసరి ఆదాయం, జీఎస్డీపీ, పన్ను రాబడుల పరంగా తెలంగాణ గణనీయమైన వృద్ధిని సాధించిందని చెప్తున్నారు. జనాభాపరంగా దేశంలో 12వ స్థానం, విస్తీర్ణం పరంగా 11వ స్థానంలో ఉన్న తెలంగాణ ఆర్థిక వృద్ధిలో, అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానానికి ఎదిగిందని చెప్తున్నారు. కానీ ఈ వాస్తవాలను ప్రభుత్వం దాచిపెడుతున్నదని మండిపడుతున్నారు.

- 2014-15లో రూ.1,00,638 కోట్లుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్ 2023-24 నాటికి రూ.2,90,396 కోట్లకు చేరింది. అంటే.. దాదాపు మూడు రెట్లు పెరిగింది. రాష్ట్ర పన్ను ఏటా 12.69 శాతం వృద్ధి నమోదు చేసింది.
- రాష్ట్రంలో తలసరి ఆదాయం 2014-15లో రూ.1,24,104 ఉండగా, 2023-24 నాటికి రూ.3,17,117కు పెరిగింది. అంటే.. రెండున్నర రెట్ల పెరుగుదల నమోదైంది. 2014లో తలసరి ఆదాయంలో దేశంలో 10వ స్థానంలో ఉండగా, 2023 నాటికి అగ్రస్థానానికి చేరిందని నిపుణులు పేర్కొంటున్నారు.
- 2014లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.3.79 లక్షల కోట్లు ఉండగా.. 2023-24 నాటికి రెండున్నర రెట్లు పెరిగి రూ.13.28 లక్షల కోట్లకు చేరింది.
- 2014లో తలసరి ఆదాయం రూ.93,151గా ఉంటే, 2023 నాటికి రూ.3,12,398 చేరుకున్నది. అంటే 235 శాతం పెరిగింది.
- రాష్ట్ర రెవెన్యూ రాబడులు 2014-15లో రూ.51,042 కోట్లు మాత్రమే. ఇది 2023-24 నాటికి రూ.2,16,567 కోట్లకు చేరాయి. అంటే దాదాపు నాలుగున్నర రెట్లు పెరిగాయి.
- రాష్ట్ర సొంత రాబడులను గమనిస్తే.. 2015-16లో రూ.39,974 కోట్లుగా ఉండగా 2023-24 నాటికి రూ.1.31 లక్షల కోట్లకు చేరుకున్నది. తొమ్మిదేండ్లలో 227 శాతం పెరుగుదల కనిపించింది. సగటున లెక్కించినప్పుడు ఏటా రికార్డు స్థాయిలో 18.97 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది.
- తెలంగాణ చిన్న రాష్ట్రమైనా.. దేశ జీడీపీ వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నదని మాజీ సీఎం కేసీఆర్ పదేపదే చెప్పేవారు. దీనికి తగ్గట్టే దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రతి సంవత్సరం పెరుగుతూనే వచ్చింది. దేశ జనాభాలో తెలంగాణ జనాభా 2.7 శాతం మాత్రమే అయినా.. 2014-15లో దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.1% కాగా, పదేండ్లలో 4.9 శాతానికి పెరిగింది.

రాష్ట్ర అప్పుల గురించి మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. తెలంగాణ సాధించిన ఈ ఆర్థిక విజయాలను ఎందుకు ప్రస్తావించడం లేదని ఆర్థిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర పరపతిపై దెబ్బ?

ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి పదేపదే లేని అప్పులు చూపిస్తే రాష్ట్ర పరపతి దెబ్బతినే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతి వేదికపై మాట్లాడటం వల్ల కార్పొరేట్ సంస్థలకు రాష్ట్రంపై ఉన్న అభిప్రాయం పోతుందని చెప్తున్నారు. దీనికితోడు నెలకు రూ.7వేల కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పడం ద్వారా అప్పును మూడు రెట్లు అధికంగా చూపుతున్నట్లైనని.. తద్వారా రాష్ట్రం దివాలా అంచున ఉన్నదనే భావన కలిగిస్తున్నారని అంటున్నారు. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునేవారు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారని అంటున్నారు. ఇప్పటికైనా సీఎం తన వ్యవహారశైలిని మార్చుకోవాలని సూచిస్తున్నారు.



తెలంగాణ ధిక్కారస్వరం దాశరథి

- తెలంగాణ పోరాటంలో దాశరథి స్ఫూర్తి
- దాశరథి శతజయంతి సందర్భంగా కేసీఆర్

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ తన కవిత్వం ద్వారా తెలంగాణ గరిమను ప్రపంచానికి చాటి, తన సాహిత్యం ద్వారా తిమిరంతో సమరం చేస్తూ, నాటి నైజాంగులో చారిత్రకానికి వ్యతిరేకంగా సాయుధ పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి దాశరథి అని బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కొనియాడారు. తెలంగాణ సాధనకోసం తాను సాగించిన పోరాట పంథాలో దాశరథి అందించిన స్ఫూర్తి ఇమిడి ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కారస్వరం, అభ్యుదయ కవి రచయిత, దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తిని స్మరించుకున్నారు. మహోన్నతమైన దాశరథి గొప్పతనాన్ని గుర్తించి, ఆయన స్ఫూర్తి కొనసాగే దిశగా, వారి జయంతి రోజున, తెలంగాణ సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులకు ప్రతియేటా అందించేందుకు 'దాశరథి కృష్ణమాచార్య అవార్డు'ను తమ ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అత్యున్నత శిఖరాల మీద నిలబెట్టే దాశరథి కవిత్వం, సాహిత్యం తెలంగాణ భవిష్యత్తు తరాలకు నిత్యస్ఫూర్తిదాయకమని కేసీఆర్ పేర్కొన్నారు.



తెలంగాణ భవన్‌లో దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, తదితరులు



రవీంద్రభారతిలో ప్రముఖ కవి జూకంటి జగన్నాథంకు దాశరథి కృష్ణమాచార్య అవార్డును ప్రదానం చేసి సత్కరిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, తదితరులు

తెలంగాణ ఉద్యమానికి దాశరథి స్ఫూర్తి

- నిజాం ప్రభుత్వంపై తిరగబడిన గొప్ప కవి
- దాశరథి శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభలో దేశపతి
- మహాకవికి ఘన నివాళులర్పించిన ప్రముఖులు



మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో దాశరథి శత జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్. చిత్రంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ తదితరులు

మహబూబాబాద్/చిన్నగూడూరు, జూలై 22(నమస్తే తెలంగాణ): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి దాశరథి స్ఫూర్తినిచ్చారని, నిజాం కాలంలో ప్రజలు అనుభవించిన కష్టాలు, రైతుల బాధలను తన కవిత్వంలో ప్రతిబింబించేలా చేయడమే కాకుండా నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసేలా చైతన్యపరచిన అక్షర పోరాటయోధుడు దాశరథి అని ప్రముఖ కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన దాశరథి శతజయంతి ప్రారంభ సభను ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. అంతకుముందు చిన్నగూడూరు మండల కేంద్రంలో దాశరథి సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, కవి, రచయిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీతోపాటు కవులు, కళాకారులు, రాజకీయ ప్రముఖులు, ఉద్యమకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. దాశరథి సోదరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాశరథి చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కళాకారులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. మహనీయుడి స్వగ్రామం చిన్నగూడూరును సందర్శించి వేడుకల్లో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఉద్యమ శక్తిగా, వేదాల అనువాదకుడిగా, సినీగేయ రచయితగా దాశరథి కీర్తి హిమాలయ శిఖరమంత ఎత్తుకు ఎదిగిందని గుర్తు చేశారు. అనంతరం చిన్నగూడూరు నుంచి బైక్ ర్యాలీగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'తెలంగాణ అంటే దాశరథి.. దాశరథి అంటే తెలంగాణ' అనేలా కృషి చేశారని గుర్తు చేశారు. ఉద్యమమైన పద్యాలు, పాటలు, కవితలతో సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. 'ఈ నేల, ఈ గాలి కాదు ఈ దేశం రైతుదేనని' అని ఎలుగెత్తి చాటారని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనపై వ్యతిరేకంగా ఒంటరి పోరాటం చేసిన దాశరథి కృష్ణమాచార్య చరిత్ర భావితరాలకు తెలిసేలా కృషి చేయాలని కోరారు. చిన్నగూడూరు మండలానికి దాశరథి మండలంగా నామకరణం చేయడంతోపాటు దాశరథి పేరిట లైబ్రరీ, కాంస్య విగ్రహం, స్మృతివనం ఏర్పాటు, ఏటా దీపాలు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణకు ఎమ్మెల్సీ రవీందర్‌రావు ముందుకు వచ్చారని, ప్రభుత్వ సహాయంతో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో దాశరథి సేవలు భావితరాలకు గుర్తుండిపోయేలా చేస్తాననడం అభినందనీయమని ఎమ్మెల్సీని కొనియాడారు. ప్రజలను బానిసలుగా చూడడం, చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం, రైతు, రైతుకూలీల కష్టనష్టాలను వేయి కన్నులతో పరిశీలించి వారి కన్నీటిని కలం గుండెల్లో నింపుకొని కవితలు రాశాడని గుర్తు చేశారు.


రెండు రాష్ట్రాల్లో ఉత్సవాలు నిర్వహించాలి



దాశరథి కేవలం తెలంగాణకే చెందిన కవి కాదు.. ఉభయ రాష్ట్రాలకు చెందిన ప్రజాకవి. ఆయన శతజయంత్యుత్సవాలను రెండు రాష్ట్రాల్లో నిర్వహించేలా ఆయా ప్రభుత్వాలు కృషి చేయాలి. నిజాం దాష్టీకాలను చూసి చలించిన దాశరథి తన పద్యాల రూపంలో ఆయనపై నిప్పులు చెరిగేవారు. చిన్నగూడూరుకు చెందిన ఒక దొర దాశరథిని చంపాలని చూస్తే వెళ్లి గార్డులో ఉన్నారు. అక్కడ కూడా వారి అరాచకాలపై గర్జించిన సింహం దాశరథి. దాశరథి ప్రజల కోసం పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆయన ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచించే గొప్ప వ్యక్తి.

\- నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు

భావితరాలకు తెలిసేలా కార్యాచరణ



నిజాం నిరంకుశ పాలనపై అవిశ్రాంత పోరాటం చేసి తన రచనలతో ప్రజలను చైతన్యపరిచిన దాశరథి కృష్ణమాచార్యుల చరిత్రను దేశవ్యాప్తం చేయాలి. భూస్వాములు పెత్తందార్లకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి పద్యాన్ని ఆయుధంగా ప్రయోగించిన మనుడు దాశరథి. ఈ గడ్డపై అణువణువు దాశరథి జ్ఞాపకాలు నిండుకుని ఉన్నాయి. తొలి తెలంగాణ ఉద్యమంలో ఆయన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం. ఆ మహనీయుడి శతజయంతి వేడుకలను సంవత్సరమంతా నిర్వహిస్తాం. ఆయన పుట్టిన ఈ గడ్డను దాశరథి చిన్నగూడూరుగా నామకరణం చేసేందుకు, గ్రంథాలయం, దాశరథి స్మృతివనం ఏర్పాటుకు గ్రామస్తులు ఆసక్తిగా ఉన్నారు.

\- రవీందర్‌రావు, ఎమ్మెల్సీ, దాశరథి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

పోరాట కవియోధుడు దాశరథి

ఎక్స్‌వేదికగా కొనియాడిన కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు, సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నివాళులర్పించారు. పద్యాన్ని ఆయుధంగా మలిచి పీడిత ప్రజలపక్షాన పోరాడిన యోధుడు దాశరథి అని ఎక్స్‌వేదికగా కేటీఆర్, హరీశ్‌రావు కొనియాడారు. ప్రజల గొంతుకగా నిలిచి తెలంగాణ బిడ్డల్లో ఉద్యమస్ఫూర్తిని నింపిన మహాకవి దాశరథి అని పేర్కొన్నారు. సాహితీ రంగంలో విశేష కృషి చేసిన వారికి దాశరథి సాహితీ పురస్కారాన్ని కేసీఆర్ అందజేయడం ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రతి ఏడాది దాశరథి జయంతిని అధికారికంగా నిర్వహించామని తెలిపారు. ప్రముఖ మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతిని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన వారికి స్ఫూర్తి నింపడంలో ఆయన రచించిన 'అగ్నిధార' కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని దాశరథి అన్నట్టుగా తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ చేశారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాకుంటే తెలంగాణ కవులను గుర్తించే వారు కాదని శ్రీనివాస్‌గౌడ్ వాపోయారు. తెలంగాణ సాధనలో దాశరథి స్ఫూర్తి కనపడుతుందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు అభిషేక్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకురాళ్లు తుల ఉమ, ముఠ్ఠవరం సుశీలారెడ్డి పాల్గొన్నారు.

నూతన న్యాయ చట్టాలపై మీ వైఖరేంటి?

- వీటితో ప్రాథమిక హక్కులకు విఘాతం
- కొన్ని రాష్ట్రాల్లా సవరణలు కోరుతారా?
- లేదంటే యథాతథంగా అమలు చేస్తారా?
- అదే జరిగితే నిరంకుశ పాలన అవుతుంది
- ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ



హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): కేంద్రం తెచ్చిన నూతన న్యాయ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన మూడు చట్టాలపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతున్నదని పేర్కొన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ) స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్‌ఏ) చట్టాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఉద్యమాల అడ్డాగా ఉన్న తెలంగాణ ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉక్కు పిడికిళ్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక సహా పలు రాష్ట్రాలు ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నాయని, కాబట్టి తెలంగాణ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బహిరంగ లేఖ విడుదల చేశారు.

వ్యక్తి స్వేచ్ఛను హరించేలా చట్టాలు

నూతన చట్టాలు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని హక్కుల సంఘాలు చేస్తున్న నిరసనను ఈ సందర్భంగా కేటీఆర్ ఉదహరించారు. నూతన చట్టాలతో పౌరుల హక్కులకు హాని కలిగించే అంశాలను ఆయన లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం కొత్త చట్టాల ప్రకారం నేరమని, ఇది అత్యంత దుర్మార్గమైన ప్రయత్నమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీని 90 రోజులకు పెంచడం, వ్యవస్థీకృత నేరాల విషయంలో వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయడానికి దర్యాప్తు సంస్థలకు విచక్షణ అధికారాలను కొత్త చట్టం అనుమతిస్తున్నదని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పౌరహక్కుల విషయంలో నూతన చట్టాలు అత్యంత దారుణంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా? లేదా? అనే విషయాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. ఈ చట్టాల్లోని నియంతృత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రభుత్వాన్ని నిరంకుశ, ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా ప్రజలు పరిగణిస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు.

కేటీఆర్ విడుదల చేసిన బహిరంగ లేఖ పూర్తి పాఠం... ఎడిటోరియల్ పేజీలో..

రుణమాఫీ కంటే డంబాచారానికి ఎక్కువ ఖర్చు

- అదొక మిస్టరీలా మారింది
- మేడిగడ్డ నీటిని విడుదల చేయాలి
- ఈసారి కూడా పొలాలు ఎండబెడితే సహించం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, జూలై 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పెద్ద మిస్టరీలా మారిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటివరకు చేసిన రుణమాఫీ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్వర్టైజ్‌మెంట్లు, క్షీరాభిషేకాలు, సంబురాల వంటి డంబాచారాలకే ఎక్కువ ఖర్చు పెట్టినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ.. లక్షలోపు రుణమాఫీ 20% మందికి కూడా పూర్తికాలేదని దుయ్యబట్టారు.

బటన్ నొక్కితే కాళేశ్వరం జలాలు వస్తాయి

వ్యవసాయం, సాగునీటిపై సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ సర్కారులో ఎవరికీ అవగాహన లేదని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. గత యాసంగిలో మేడిగడ్డ ప్రాజెక్టు కొట్టుకుపోతుందంటూ విష్పప్రచారం చేసి రైతులకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు మేడిగడ్డ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నా ప్రాజెక్టు చెక్కు చెదరకుండా ఉన్నదని, అయినా ఒక్క బటన్ నొక్కి వ్యవసాయానికి నీటిని వదలాలనే ఆలోచన చేయడం లేదని పేర్కొన్నారు. ఇది రైతులను నట్టేట ముంచే కుట్రగా కనిపిస్తున్నదని మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు యాసంగి మాదిరిగా ఈసారి కూడా వ్యవసాయాన్ని ఎండబెడితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. గోదావరి జలాలను వృథాగా పోనీయకుండా కాళేశ్వరం వద్ద మోటర్ల బటన్ నొక్కి నీటిని పంపింగ్ చేసి తక్షణమే సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

సర్కారు వైఫల్యాలపై సమరమే

> మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వంపై ఒత్తిడి తేవడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నది. ప్రతిపక్షంలో ఉండగా అమా పథకాలు మభ్యపెట్టి, అధికారంలోకి రాగానే అన్నింటినీ అమలు చేస్తామని అలవిగాని హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తున్న కాంగ్రెస్‌పై తీరును ఎండగట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 200 రోజులు దాటింది. 100 రోజుల్లోనే 6 గ్యారెంటీలు, 13 హామీలను అమలు చేస్తామని ప్రకటించింది. అయితే ఇవేవీ అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం మాత్రం అన్నింటినీ అమలు చేశామని చెప్తున్నది. రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి చెప్తున్న దానికి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న దానికి ఎక్కడా పొంతన కుదరడం లేదని, వాస్తవాలు వేరేలా ఉంటే రైతులను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని, అర్హులైన రైతులను తగ్గించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, అనేక షరతులు విధిస్తున్నదని ఆరోపిస్తున్నది. నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి వాటిలో ఒక్కటి కూడా అమలుచేయడం లేదని, వారి డిమాండ్ల కోసం నిరసన తెలిపితే పోలీసులతో లాఠీచార్జీలు చేయిస్తున్నారని మండిపడింది.



వీటన్నింటినీ సభలో చర్చకు వచ్చేలా చేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది.

అసెంబ్లీలో బీఆర్‌ఎస్ లేవనెత్తే ప్రధాన అంశాలు

1) నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలెండర్ విడుదల కోరుతూ ఉద్యమించిన ఉద్యోగార్థులపై ప్రభుత్వ దమనకాండ
2) శాంతిభద్రతల నిర్వహణలో వైఫల్యం
3) చేనేత కార్మికుల ఆత్మహత్యలు.. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి
4) ఆరు గ్యారెంటీల అమలు.. శాసనసభలో చట్టబద్ధత
5) రైతు రుణమాఫీ అమలులో ఆంక్షలు-నష్టపోతున్న రైతాంగం
6) పంటల మద్దతు ధరకు అదనంగా బోనస్ చెల్లింపుపై ప్రభుత్వ వైఫల్యం-రైతు భరోసా చెల్లింపులో జాప్యం వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు
7) గ్రామాలు, పట్టణాలకు నిధుల విడుదలలో అలసత్వం - పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక కుంటుపడుతున్న ప్రజారోగ్యం
8) ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో జాప్యం ఫలితంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు

నేడు బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం

మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగుతుంది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చిస్తారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు, పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేస్తారు.



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఉదారత

- అగ్నిప్రమాద బాధితులకు జీతంలో నుంచి ఆర్థికసాయం
- 31 మందికి రూ.3.10 లక్షలు

హుజూరాబాద్, జూలై 22 : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఉదారత చాటుకున్నారు. ఈ నెల 15న హుజూరాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన చిరు వ్యాపారులకు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదస్థలమైన పాపారావు బొంద వద్ద 31మంది బాధితులకు రూ.10 వేల చొప్పున రూ.3.10లక్షల చెక్కులను జీతంలోంచి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఒక్కో బాధితుడికి రూ.లక్ష పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి వీణవంక మండలం మామిడాలపల్లి అనుబంధ గ్రామం గొల్లపల్లిలోని బ్రిడ్జ్ పూర్తిగా పాడైందని, మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం.. గంజాయికి గుమ్మం!

- గుట్టుచప్పుడు కాకుండా ఈ జిల్లా గుండా తరలింపు
- ఏపీ, ఒడిశా నుంచే అత్యధిక శాతం అక్రమ రవాణా
- ఐదేండ్లలో ఖమ్మంలోనే 8,622 కేజీల పట్టివేత



మే 27న డీసీఎం వాహనంలో తరలిస్తున్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని చూపిస్తున్న కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు (ఫైల్)

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా ఏటేటా పెరుగుతున్నది. ఏ సరిహద్దు చెక్‌పోస్టు చూసినా గంజాయి వాసన గుప్పుమంటున్నది. ఇన్నాళ్లు గోదావరి పరివాహ, పచ్చని అభయారణ్యాలు, బొగ్గు గనుల కేంద్రంగా, గ్రానైట్ మాగాణిగా పేరున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా.. ఇప్పుడు గంజాయి అక్రమ రవాణాకు ముఖ ద్వారంగా మారింది. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు కలిగిన ఖమ్మం.. గంజాయి అక్రమ రవాణాలో కీలకంగా మారింది. ఏవోబీ(ఆంధ్రా ఒడిశా బార్డర్)లో సాగవుతున్న గంజాయిని ఖమ్మం ద్వారానే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత ఐదేండ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 8,622 కేజీల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారంటే అక్రమ రవాణా ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒడిశా, ఏపీ సరిహద్దుల్లో ఎకరానికి రూ.లక్ష చొప్పున పెట్టుబడి పెట్టి కొందరు అక్రమార్కులు గంజాయి సాగు చేస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులే చెబుతున్నారు.

8,622 కేజీల పట్టివేత

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ సిబ్బంది 2020లో 7 కేసుల్లో 43 కేజీలు, 2021లో 28 కేసుల్లో 472 కేజీలు, 2022లో 161 కేసుల్లో 2999.73 కేజీలు, 2023లో 204 కేసుల్లో 3574.46 కేజీలు, 2024లో జూన్ నాటికి 100 కేసుల్లో 1533.268 కేజీల చొప్పున మొత్తం ఐదేండ్లలో 498 కేసుల్లో 8,622.508 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక తెలంగాణ వ్యాప్తంగా 2022లో 4,556 కేజీలు, 2023లో 6,355 కేజీలు, 2024(జూన్ వరకు)2,283 కేజీల గంజాయిని పట్టుకున్నట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు.

సరిహద్దుల్లో గట్టి నిఘా

గంజాయిని అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టాం. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మంపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి వినియోగం, రవాణా, అమ్మకాలపై కఠినంగా వ్యవహరించాలనే ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నది. గంజాయి అక్రమ రవాణా గురించి ఎవరికైనా తెలిస్తే ఎక్సైజ్ టోల్‌ఫ్రీ నంబర్ 18004252523కు ఫిర్యాదు చేయండి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

\- వీబీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

రేపు బీఆర్‌ఎస్ రక్తదాన శిబిరాలు

కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాల పిలుపు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం (ఈనెల 24న) రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పార్టీ విద్యార్థి, యువజన విభాగాలు తెలిపాయి. ఈ మేరకు విద్యార్థి, యువజన విభాగాల రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు తెలంగాణభవన్‌లో నిర్వహించే మెగారక్తదాన శిబిరంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మొక్కలు నాటాలని, రక్తదానం చేయాలని, దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని సూచించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, పదేండ్లపాటు మంత్రిగా కేటీఆర్ అందించిన సేవలను గుర్తుచేశారు. రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికే వన్నెతెచ్చిన నేతగా కేటీఆర్ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారని పేర్కొన్నారు.

ఫార్మా ఉత్పత్తుల్లో తెలంగాణ వాటా 30%

ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ) : భారతదేశ ఫార్మా ఉత్పత్తుల్లో 30శాతం వాటా తెలంగాణ నుంచే ఉన్నట్టు స్వాత్రిక్ భారత ప్రభుత్వం విడుదల చేసిన ఎకనామిక్ సర్వే చెబుతున్నదని బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ సోమవారం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో లైఫ్ సైన్సెస్‌కు తెలంగాణ కేరాఫ్‌గా ఉన్నదని, నాడు 1000 లైఫ్ సైన్సెస్ కంపెనీలు వచ్చాయని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీని ప్రారంభిస్తే దాన్ని మూసివేసేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. తన వ్యాఖ్యలకు భారత ప్రభుత్వం విడుదల చేసిన ఎకానమిక్ సర్వే రిపోర్టును జత చేశారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అపరాధిగా ఇజ్రాయెల్

'దశాబ్దాలుగా పాలస్తీనా భూభాగాలను ఇజ్రాయెల్ ఆక్రమించుకుని ఉండటం చట్ట విరుద్ధం.. వీలైనంత త్వరలో దీన్ని చక్కదిద్దాల్సి ఉంది' అంటూ అంతర్జాతీయ న్యాయస్థానం జూలై 19న వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైనది. 15 మంది సభ్యుల ధర్మాసనం జారీ చేసిన ఈ ఉత్తర్వుల్లో ఇజ్రాయెల్‌ను అభిశంసిస్తూ వర్ణవివక్షాపూరిత దమననీతి వంటి తీవ్రమైన పలు నేరనిర్ధారణలున్నాయి. అయితే ఇది ఐరాస అభ్యర్థన మేరకు వెలువరించిన సలహా సంప్రదింపుల్లో భాగమే తప్ప అమలుకు ఉద్దేశించింది కాదని గుర్తుంచుకోవాలి. ఓ వైపు ప్రపంచ దేశాల్లో ఏకాకి అవుతున్న ఇజ్రాయెల్ మరో వైపు ఆక్రమిత ప్రాంతాల్లో అమానుష విధానాలను యథేచ్ఛగా అమలుచేస్తున్నది. గాజాలో నరమేధం సాగిస్తున్నది. ఇప్పటివరకు అక్కడ ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో మరణాల సంఖ్య 37 వేలు దాటింది. మృతుల్లో అత్యధికులు స్త్రీలు, పిల్లలే కావడం మానవత్వానికే సిగ్గుచేటు. హమాస్ దాడికి ప్రతీకారంగా గాజాను ఇజ్రాయెల్ బూడిద చేస్తున్నది. ఇది అత్యంత హేయమైన విషయం.

ఈ ఊచకోతపై దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానంలో వేసిన మరో కేసు ప్రస్తుతం విచారణలో ఉన్నది. గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న ఊచకోత యుద్ధనేరం కిందకు వస్తుందని, దీనిపై విచారించి శిక్ష విధించాలని కోరుతూ దక్షిణాఫ్రికా దాఖలు చేసిన కేసు నిజానికి అమలు చేయాల్సిన తీర్పు జారీకి ఉద్దేశించింది. ఈ కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం ఈ సరికే కొన్ని కీలక ఉత్తర్వులు జారీచేసింది. దక్షిణ గాజాలోని రఫాలో నిరాశ్రయులు తలదాచుకున్నందున ఆ నగరంపై సైనిక దాడులు ఆపాలని ఇజ్రాయెల్‌ను ఆదేశించింది. కానీ, ఇజ్రాయెల్ ఏ మాత్రం ఖాతరు చేయకుండా దాడులు కొనసాగించి అంతర్జాతీయ చట్టాలు, న్యాయాలూ తనకు పట్టవని మరోసారి చాటిచెప్పింది. అయితే పశ్చిమదేశాల తిరుగులేని మద్దతు కారణంగా ఇజ్రాయెల్ నిజానికి ఇలాంటివి పెద్దగా పట్టించుకోదనేది తెలిసిందే. కాకపోతే ప్రజాభిప్రాయాన్ని పాలస్తీనాకు అనుకూలంగా సమీకరించేందుకు ఇవి తోడ్పడతాయి. గాజాలో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని అగ్రరాజ్యం అమెరికా పరోక్షంగా సమర్థిస్తున్న సంగతి తెలిసిందే. అయితే అదే అమెరికాలో యూనివర్సిటీ క్యాంపస్‌లు ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలతో దద్దరిల్లడం గమనించవచ్చు.

తమకు నిలువ నీడలేదని, తమకంటూ ఓ దేశం కావాలని ఇజ్రాయెలీలు పంతం పట్టి కూర్చున్నారు. పాలస్తీనాలో ఓ భూభాగాన్ని సొంతం చేసుకున్నారు. అందుకు ఐరాసను వేదికగా వాడుకున్నది. కానీ, ఇప్పుడు అదే ఇజ్రాయెల్ పాలస్తీనీయులకు నిలువ నీడ లేకుండా తరిమి కొడుతున్నది. ఇప్పుడు ఐరాసనే బేఖాతరు చేస్తుండటం విచిత్రం. అంతర్జాతీయ న్యాయస్థానాన్నే తోసిరాజంటుండటం గర్హనీయం. మానవతావాదానికి తామే పరిరక్షకులమని చెప్పుకొనే పశ్చిమ దేశాలు పాలస్తీనా ప్రజలను ఆదుకునేందుకు ముందుకురావాల్సిన అవసరం ఉన్నది. అదే సమయంలో అంతర్జాతీయ సంస్థలను పటిష్ఠపరిచేందుకు పాలస్తీనా సమస్య ఒక్కటే అవకాశాన్ని కల్పిస్తున్నది. సంకుచిత ప్రయోజనాలను పక్కనపెట్టి దేశాలన్నీ ఒక్కతాటి మీదకు వస్తే కానీ ఇది సాధ్యపడదు.

కేంద్రంలోని నరేంద్ర మోదీ 3.0 ప్రభుత్వం 2024-25కు సంబంధించి నేడు ప్రవేశ పెట్టనున్న పూర్తి స్థాయి బడ్జెట్ కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తున్నది. ఈ సారి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులుంటాయి? పేద, మధ్య తరగతికి దక్కే ఊరట ఏమిటి? ఉద్యోగులకు ఆదాయపు పన్ను, పాత పింఛన్ విధానంపై శుభవార్తలుంటాయా? ధరలు, పన్నుల భారం తగ్గుతుందా? పారిశ్రామిక రంగాలకు ఏయే ప్రోత్సాహకాలుంటాయి? దేశ ప్రజలు ఇలా ఎన్నో ఎంతో ఆశిస్తున్న నేపథ్యంలో ఈ రోజు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కేంద్రానికి ఒక సవాలు వంటిది. దేశంలో మునుపెన్నడూ లేనివిధంగా జీఎస్టీ వసూళ్లు సుమారు లక్షకోట్లకు పైగా చేరడం, అలాగే ఆర్బీఐ నుంచి రూ.2,11,000 కోట్లు డివిడెండ్ కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరడం వంటివి బడ్జెట్‌పై ఉన్న ఆసక్తిని మరింతగా రేపుతున్నాయి. అయితే ఈ అదనపు ఆదాయం సంక్షేమ పథకాలకు మళ్లిస్తారా? లేక 5.6 శాతం నుంచి 4.7 శాతం వరకు ద్రవ్యలోటును తగ్గిస్తారా? అనేది వేచి చూడాలి. అయితే కేంద్రం ఈసారి కొన్ని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకొని బడ్జెట్‌ను రూపొందించాల్సి ఉన్నది.

కేంద్ర బడ్జెట్‌తో ఎవరికి మేలు?



డాక్టర్ రామకృష్ణ బండారు
79057 51940



ముఖ్యంగా, దేశంలో వినియోగదారుల వినిమయ శక్తిని మరింతగా పెంచాలి. అందుకోసం ఐటీ చెల్లింపులలో మార్పులు తీసుకురావాలి. స్లాబ్‌లలో మార్పుల కోసం దేశంలో ఐటీ చెల్లించే 9.37 కోట్ల మంది ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత పన్ను చెల్లింపులకు సంబంధించి ఉన్న రెండు విధానాలతో పన్ను పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు, అలాగే రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెంపును ఆశిస్తున్నారు. అలాగే ఆదాయపు పన్ను స్టాండర్డ్ డిడక్షన్‌ను సుమారు లక్ష రూపాయల వరకు పెంచాలి. వాస్తవ ఖర్చులను దృష్టిలో ఉంచుకొని, సెక్షన్ 80 సీ పరిమితిని రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు పెంచాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా గృహ రుణాలకు సంబంధించిన వడ్డీ చెల్లింపులపై సెక్షన్ 24 బీ కింద వడ్డీ మినహాయింపును రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలి. కారణం భూములు, ముడిసరుకుల ధరలు పెరగడమే. అలాగే సెక్షన్ 80 ఈఈఏని పునరుద్ధరించి ఆ పరిమితిని లక్ష రూపాయల వరకు పెంచాలని కోరుకుంటున్నారు. గత కొన్నేండ్లుగా కార్పొరేట్ టాక్స్ 32 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన ప్రభుత్వం ఈసారి తమ పన్నుల భారాన్ని తగ్గించి తమ పొదుపును పెంచేవిధంగా నిర్ణయాలు తీసుకోవాలని సగటు ఉద్యోగి కోరుకుంటున్నారు. అటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సైతం 8వ వేతన కమిషన్, పాత పింఛన్ విధానంపై ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో అమలుచేస్తున్న పథకాల కేటాయింపులను పెంచి వాటిని బలోపేతం చేయాలి. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కోసం కేటాయింపులు ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాలకు ఇచ్చే సబ్సిడీని పెంచాలి. దాంతో పాటు ప్రజారోగ్యంపైనా దృష్టిపెట్టాలి. ఆరోగ్య భద్రతపై చేస్తున్న మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వ వ్యయం 1.9% కాగా మొత్తం జీడీపీలో అది 0.28%. ఆరోగ్య కుటుంబ సంక్షేమ లెక్కల ప్రకారం మొత్తం ఆరోగ్య భద్రతకు దేశ ప్రజలు చేస్తున్న వ్యయంలో సుమారు 47 శాతం స్వయంగా తమ ఆదాయం నుంచి భరిస్తున్నారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం కింద ప్రస్తుతం సుమారు 12 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల వరకున్న ఆరోగ్య బీమాను 10 లక్షలకు పెంచాలి. అలాగే, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన పెరిగేలా కొన్ని పథకాలను రూపకల్పన చేయాలి.

ఇకపోతే నిరుద్యోగం, ద్రవ్యోల్బణాన్ని తగ్గించే నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో కీలకమైనవి. సీఎంఐఈ తాజా నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగిత రేటు 9.2 శాతం. భద్రత, మంచి వేతనం కల్పించే తయారీ, సేవారంగానికి సంబంధించిన పెట్టుబడులను ఆకర్షించేలా నిర్ణయాలుండాలి. అటు ద్రవ్యోల్బణం విషయానికి వస్తే ప్రభుత్వ అంచనాల ప్రకారం జూన్‌లో ధరల ద్రవ్యోల్బణం సుమారు 9.4 శాతం, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 5.1 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 9.4 శాతానికి పెరిగాయి. వీటిని కట్టడి చేసే నిర్ణయాలు అవసరం. అలాగే విద్యారంగంలో ముఖ్యంగా ప్రాథమిక విద్యారంగం బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయాలుండాలి.

మౌలిక సదుపాయాలు డిజిటల్ విద్య, విద్యారుణాల సబ్సిడీపై నిర్ణయాలు ఆశిస్తున్నారు. ఇక తయారీ రంగంపై కూడా బడ్జెట్‌లో కీలకమైన అంశాలుండాలి. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్, ఇతర హరిత సాంకేతికతలలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు టాక్స్ సబ్సిడీలు కల్పించాలి. టెక్నాలజీకి నరేంద్ర మోదీ సర్కార్ తొలి నుంచి పెద్దపీట వేస్తున్నది. దీనికి తగ్గట్టు ఆటోమొబైల్ రంగంలో సంస్కరణలకు గత బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలకు మన దేశంలో డిమాండ్ పెరుగుతున్నది. అందుకే గత బడ్జెట్‌లో 'ఫేమ్' పథకం ప్రవేశపెట్టారు. హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాలకు టాక్స్ తగ్గించడంతో పాటు, పెద్దఎత్తున రీచార్జ్ సెంటర్లను నెలకొల్పేవిధంగా నిర్ణయాలుండాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊతం ఇచ్చేలాగా బడ్జెట్ ఉండాలని ఆయా రంగ నిపుణులు సైతం కోరుకుంటున్నారు. కరోనా మహమ్మారి అనంతరం ఈ రంగం ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతున్నది. అలాగే, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఆకర్షించే విధంగా బడ్జెట్ ఉండాలి. ఇక ఇన్సూరెన్స్ రంగంలో కొన్ని సంస్కరణలు తేవడం ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా లైఫ్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకునే అవకాశం కలుగుతుంది. కంపోజిట్ లైసెన్స్, మూలధన నిబంధనలను మార్చేవిధంగా నిర్ణయాలు ఉండాలి. అటు రియల్ ఎస్టేట్ రంగం కూడా ఈ బడ్జెట్‌పై భారీగానే ఆశలు పెట్టుకున్నది. క్రెడిట్ ఆధారిత రాయితీ పథకం తిరిగి పునరుద్ధరించాలని కోరుతున్నది రంగం. ఇక అందుబాటులోని ఇళ్లపై ఉన్న పరిమితిని రూ.75 లక్షలకు పెంచి జీఎస్టీని 1 శాతానికి పరిమితం చేయాలని కోరుకుంటున్నారు.

రైతులు, రైతు సంఘాలు సైతం వ్యవసాయరంగానికి ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరుతున్నారు. రైతుల ఆదాయం పెంచేవిధంగా, వ్యవసాయ పరిశోధనలు, ఎరువుల రాయితీలు మౌలిక సదుపాయాల అభివృద్ధి వాటిపై నిధులు పెంచాలని రైతులు ఆశిస్తున్నారు. మూలధన పెట్టుబడుల కోసం గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.11.11 లక్షల కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో అది మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. ఇటు రక్షణ రంగంలో ఆధునీకరణ, గ్రామీణాభివృద్ధి వంటి వాటికి కూడా కేటాయింపులు పెరగవచ్చు. బీజేపీ గత ఎన్నికల్లో వయోవృద్ధులకు ఉచిత ఆరోగ్య బీమా పథకం, పైప్‌ల ద్వారా వంట గ్యాస్ సరఫరా అలాగే, వచ్చే ఐదేండ్ల పాటు ఉచిత రేషన్ వంటి హామీలకు నిధులు కేటాయిస్తూనే, సంస్కరణలకు పెద్దపీట వేయవచ్చు. ద్రవ్యోల్బణం కట్టడి, అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం, వృద్ధికి ఊతమివ్వడం వంటి అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వాలి.

> రైతుల ఆదాయం పెంచేవిధంగా, వ్యవసాయ పరిశోధనలు, ఎరువుల రాయితీలు మౌలిక సదుపాయాల అభివృద్ధి వాటిపై నిధులు పెంచాలని రైతులు ఆశిస్తున్నారు. మూలధన పెట్టుబడుల కోసం గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.11.11 లక్షల కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో అది మరింతగా పెరిగే అవకాశం ఉన్నది... ద్రవ్యోల్బణం కట్టడి, అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకం, వృద్ధికి ఊతమివ్వడం వంటి అంశాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలి.

(వ్యాసకర్త: అసిస్టెంట్ ప్రొఫెసర్-కామర్స్ విభాగం, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ)

వీల్‌చైర్ పన్ను విధించడం వివక్షే!

మీరు వాకింగ్‌కు వెళ్లిన ప్రతిసారి, డాక్యుమెంట్‌ను ప్రింట్ తీయించుకున్న ప్రతిసారి లేదా సాదాసీదాగా చెప్పాలంటే.. మీ శరీరాంగాలు సజావుగా కలిగి ఉన్నందుకు మీపై పన్ను విధిస్తే మీకు ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. లక్షలాది మంది వికలాంగ భారతీయులు నిత్యం ఎదుర్కొంటున్న స్పష్టమైన అన్యాయం ఇది. అన్యాయంగా, అసంబద్ధంగా అనిపించినప్పటికీ జీఎస్టీ వల్ల జరుగుతున్న దుష్పరిణామమిది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఏడేండ్లుగా కృత్రిమ అవయవాలు, బ్రెయిలర్లు, వీల్‌చెయిర్లు కలిగిన వికలాంగులు తమకు సాయమందిస్తున్న పరికరాలపై అదనంగా 5 శాతం పన్ను చెల్లిస్తున్నారు.



జై అనంత్ దేహద్రాయ్

దేశంలోని పన్ను విధాన రూపకర్తలు ఇలాంటి పాలసీని రూపొందించారు. ఇది వికలాంగుల పట్ల వివక్ష చూపడమే కాకుండా, వారిపై జరిమానా విధించడం కూడా. వికలాంగుల పట్ల ప్రధాని మోదీకి ఉన్న శ్రద్ధను చూసి ఆశ్చర్యం కలుగుతున్నది. వికలాంగులను 'దివ్యాంగ్' అని పిలుస్తారు. దివ్యాంగ్ అంటే హిందీలో దైవ అంశ అని అర్థం. నడక, నేర్చుకోవడంపై ప్రభావం చూపుతున్న ఈ విధానం ఆర్టికల్ 14 ప్రకారం.. రాజ్యాంగం ముందు నిలబడదు. ఎలాంటి సంక్లిష్టమైన, చట్టపరమైన సూత్రాలను తెలుసుకోకుండానే సామాన్యులు సైతం ఈ విధానం వెనకున్న అన్యాయం ఏమిటో అర్థం చేసుకోగలరు.

రూ.లక్ష విలువ చేసే వీల్‌చైర్‌పై ఐదు శాతం పన్ను చెల్లిస్తున్న వ్యవహారాన్ని తీసుకుందాం. ఒకవేళ వీల్‌చైర్ జీవితకాలం 500 కిలోమీటర్లు అనుకుందాం. అంటే.. సదరు దివ్యాంగుడు ఒక్కో కిలోమీటర్‌పై రూ.10 పన్ను చెల్లించాల్సి వస్తున్నది. అలాగే బ్రెయిలీ పత్రికలు వాడే అంధుడు దానిపై పన్ను చెల్లించక తప్పదు. సదరు వ్యక్తి అంధుడు అయినందుకు అతనిపై విధిస్తున్న అదనపు లెవీ ఇది. దివ్యాంగులు నడిచేందుకు, జ్ఞానాన్ని పొందేందుకు వినియోగించే ఇలాంటి పరికరాలపై పన్ను విధించడం స్పష్టమైన వివక్షే.



ప్రభుత్వాలు విధించే పన్నుల రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు పరీక్షించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సకాల్ పేపర్స్ (1961), ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (1984), అశోక్ స్మార్ట్ పిక్స్ (2007) కేసులు ఈ కోవకు చెందినవే. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఎలాంటి పన్ను, సెస్సు లేదా డ్యూటీలకైనా మన న్యాయమూర్తులు అడ్డుకట్ట వేయగలరు. సకాల్ పేపర్స్ కేసునే తీసుకుందాం.. ప్రకటనలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రకటనలపై ఆంక్షల వల్ల పత్రిక సర్క్యులేషన్ తగ్గిపోతుందని, దానివల్ల ఆర్టికల్ 19(1)(a) ప్రకారం.. పౌరుల ప్రాథమిక హక్కు అయిన వాక్ స్వాతంత్య్రంపై ప్రభావం పడుతుందని సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొంది. అదేవిధంగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కేసులో న్యూస్ ప్రింట్‌పై విధించిన కస్టమ్స్ డ్యూటీని కొట్టివేసింది. 2007లో ఏపీ ప్రభుత్వం తెలుగేతర సినిమాపై విధించిన పన్నును సుప్రీంకోర్టు రద్దు చేసింది. తెలుగేతర సినిమాపై పన్ను విధించడాన్ని సామాజిక వివక్షగా న్యాయస్థానం అభివర్ణించింది.

దివ్యాంగులు వినియోగించే పరికరాలపై విధించిన పన్ను అందుకు భిన్నమైనదేమీ కాదు. ఈ పన్ను దివ్యాంగులకు వ్యతిరేకంగా మూస పద్ధతులను కొనసాగించే ప్రభావాన్ని కలిగి ఉంది. వారి ప్రాథమిక విధులైన నడవడం, చదవడంపై పన్ను విధించడమంటే స్పష్టంగా వారి వైకల్యంపై జరిమానా విధించడమే. 2024లో ఇలాంటి పన్ను పుస్తకాల్లో ఉండకూడదు. జన్మస్థలం (ప్లేస్ ఆఫ్ బర్త్) ఆధారంగా వివక్షను నిరోధించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ముందు పరీక్షకు ఇది నిలవదు. ఈ ఆర్టికల్‌లోని 'ప్లేస్ ఆఫ్ బర్త్' అనే నిబంధనకు సమగ్రమైన వివరణ ఇవ్వాలి. అంతేకాదు, దివ్యాంగులను అందులో చేర్చాలి. ఈ పన్నును కచ్చితంగా రద్దు చేయాలి. వాస్తవానికి 2016లో దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. అందులోని సెక్షన్ 3 దివ్యాంగుల పట్ల వివక్షను నిషేధిస్తుంది. 2021లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ లెఫ్టినెంట్ కల్నల్ నితీషాకు సంబంధించిన కేసు విషయంలో వివక్షపై కీలక తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా సమానత్వ భావనకు పరోక్ష వివక్షను గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

దివ్యాంగుల పరికరాలపై పన్నులు వేస్తున్న జీఎస్టీ చాలా తక్కువ మొత్తంలో వస్తున్నదే. ఇది వారి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. వారి ప్రాథమిక హక్కులైన నడక, చదవడంపై పన్ను విధించడం ద్వారా వారికి సాధికారతపై కాకుండా, ఆత్మగౌరవంపై సందేశం ఇచ్చినట్టు అవుతుంది.

(ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)

కొత్త చట్టాలపై మీ వైఖరేంటి?

దేశంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త న్యాయ చట్టాలపై వివిధ వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టాల్లో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నదని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ యథాతథంగా..

తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ. ఉద్యమాలకు అడ్డా. పౌరహక్కుల పరిరక్షణ కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడే స్వభావం ఉన్న నేల ఇది. ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉక్కు పిడికిళ్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. అలాంటి తెలంగాణ రాష్ట్రంలోనూ ఇటీవల కేంద్రం తెచ్చిన చట్టాలతో ఆందోళన రేకెత్తుతున్నది. దేశంలో అమల్లోకి వచ్చిన నూతన న్యాయచట్టాలపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న పాత చట్టాల స్థానాల్లో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలు జూలై 1 సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్‌ఏ) అమల్లోకి వచ్చాయి. అయితే, పలు వర్గాల నుంచి నూతన చట్టాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.



ఈ చట్టాల్లో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని హక్కుల సంఘాల ప్రజా మేధావులు అభిప్రాయపడుతున్నారు! న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరసనలు.. ఉద్యమాలు చేసే ప్రజలకు ప్రతికూలంగా కొత్త చట్టాలు ఉన్నాయని.. పోలీసులకు, ప్రభుత్వానికి మితిమీరిన అధికారాన్ని కట్టబెడుతున్నాయని సామాజిక ఉద్యమకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు! ప్రజా స్వామికవాదులు, న్యాయ నిపుణులు మాత్రమే కాదు, పలు రాష్ట్రాలు సైతం ఈ నూతన చట్టాలను వ్యతిరేకిస్తున్నాయి!. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు! కానీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరి ఏమిటో స్పష్టంగా చెప్పలేదు! రేవంత్ రెడ్డి ఈ అంశంలో తన వైఖరిని స్పష్టం చేయాలి!

> **న్యాయకోవిదులు.. అనుభవజ్ఞులైన క్రిమినల్ లాయర్లు, ధర్మాసనాలు, న్యాయమూర్తులు, సాధారణ పౌరులతో విస్తృత స్థాయిలో సంప్రదించి వారి అభిప్రాయాలను సేకరించకుండానే ఈ చట్టాలను తొందరపాటుతో తీసుకువచ్చారు. లోక్ సభ, రాజ్యసభ నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి, ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించిన చట్టాల అమలు నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే పలు పిటిషన్లు దాఖలయ్యాయి. మా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ ఈ చట్టాల అమలు నిలిపివేయాలని సుప్రీం కోర్టులో కేసు వేశారు.**

ఈ చట్టాల్లో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు అత్యంత దారుణంగా ప్రజల హక్కులను, స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారం నిందితులకు బెయిలిచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి. పోలీసులకు, ప్రభుత్వానికి విపరీతమైన అధికారాలు సంక్రమిస్తాయి. ఇందులో పౌరుల హక్కులకు హాని కలిగించే కొన్ని ముఖ్యమైన అంశాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

ఈ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం నేరం. ఇది అత్యంత దురదృష్టకరం. ఈ చట్టం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసే పౌరులకు ప్రమాదకారిగా మారుతుంది. గతంలో ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీ ఇప్పుడు 90 రోజులకు పెరిగింది. ఈ గడువును ఉపయోగించుకొని ఎన్నిసార్లయినా కస్టడీలోకి తీసుకునే అవకాశం కల్పిస్తుంది. ఈ కస్టడీని ఒకే దఫాలో కానీ, పలు దఫాల్లో కానీ ఉపయోగించవచ్చు. తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. క్రిమినల్ కేసులో ఉన్న నిందితుల ఆస్తులను జప్తు చేయడానికి కోర్టు అనుమతి అవసరం ఉండేది. అయితే, కొత్త చట్టంలో పోలీసులకు పూర్తి అనుమతి లభించింది.

> **వ్యవస్థీకృత నేరాలకు వ్యక్తులను బాధ్యుల్ని చేయడానికి చట్టాన్ని సంస్థలకు విస్తరిస్తూ, విచక్షణ అధికారాలను కొత్త చట్టం అనుమతిస్తుంది. జాతీయ భావాలను ప్రభావితం చేసే నేరాలకు మూడేండ్ల జైలుశిక్ష, జరిమానా, సైబర్ నేరాలు, హ్యాకింగ్, ఆర్థిక నేరాలు, గోప్యత, సాంకేతికత ద్వారా విధ్వంసం వంటి వాటి కోసం రూపొందించిన ప్రత్యేక అధ్యాయంలో అనేక అస్పష్టతలున్నాయి. కొత్త చట్టాల అమలుకు ముందు (జూలై 1, 2024కి ముందు) జరిగిన నేరాలను ఐపీసీ తదితర పాత చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. తర్వాత నమోదయ్యే కేసులను నూతన చట్టాల ప్రకారం విచారణ చేయాల్సి వస్తుంది. ఇది అందరినీ అయోమయంలోకి నెడుతున్నది.**

'స్వాతంత్య్రోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైల్లో పెట్టడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఉపయోగించిన 'రాజద్రోహ' చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి 'రాజద్రోహం' చట్టాన్ని 'దేశద్రోహం' పేరుతో తీసుకువచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడానికి ప్రజలకున్న హక్కును కాలరాసేందుకే ఈ చట్టం ఉపయోగపడుతుందన్న విమర్శలున్నాయి. నూతన చట్టాలపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల మాదిరి రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంలో తన వైఖరిని స్పష్టం చేయాలి. ప్రజా ఉద్యమాలకు చిరునామాగా ఉన్న తెలంగాణ గడ్డపై నిరంకుశ నియంతృత్వ నూతన క్రిమినల్ చట్టాలను ఇక్కడ యథాతథంగా అమలు చేయడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమా? లేక ఇతర రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా? అనే విషయాన్ని ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలి.

> **నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీసు రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నది. గత ఏడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, సోషల్‌మీడియా కార్యకర్తలను ఎక్కడికక్కడ అణచివేసేందుకు పోలీసులను విస్తృతంగా వినియోగిస్తున్నది. నూతన చట్టాల నేపథ్యంలో ఈ పరిణామాలు రాష్ట్రంలో మరింత దుర్మార్గమైన వాతావరణాన్ని సృష్టించే ప్రమాదం పొంచి ఉన్నది.**

> **జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రమాదకర కొత్త చట్టాలపై తన వ్యతిరేకతను ఇప్పటికే తెలియజేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ అంశంలో ఇప్పటిదాకా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వపూరిత సెక్షన్లను సవరించాలని కేంద్రానికి లేఖ రాయాలి.**

ప్రజా పాలన అంటూ చెప్పుకొని ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ నూతన చట్టాలపై తన వైఖరిని తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రమాదకర చట్టాలపై తన వ్యతిరేకతను ఇప్పటికే తెలియజేసింది. అయితే ఈ అంశంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటిదాకా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ అంశంలో ఇప్పటికైనా రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వపూరిత సెక్షన్లను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలి. దీంతో పాటు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రం తరఫున ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేస్తున్నాను. ప్రజలను, పౌరులను అణిచివేసే చట్టాలపైన, అందులోని సెక్షన్లపై రాష్ట్ర చట్టపరమైన పరిధి మేరకు ఒక కమిటీని వెంటనే నియమించి ఈ చట్టాల మీద తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలి. లేకుంటే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నిరంకుశ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా పరిగణిస్తారని గుర్తుంచుకోవాలని తెలియజేస్తున్నాను.

- కల్వకుంట్ల తారకరామారావు
(మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్)



ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

ఇదేనా ప్రజాపాలన?

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఆశ కార్యకర్తల నిరసన • సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ల వద్ద ధర్నా

నమస్తే నెట్‌వర్క్, జూలై 22: ఇదేనా ప్రజా పాలన అంటూ.. కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆశ కార్యకర్తలు సోమవారం ఆయా జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజాపాలన పేరు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.18 వేలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్ ఆఫీసుల ఎదుట కదం తొక్కారు. కరీంనగర్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు. జోగులాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రాన్ని కలెక్టర్ బీఎం సంతోష్‌కు అందజేశారు. నల్లగొండ, భువనగిరి కలెక్టరేట్ల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

• వస్త్ర పరిశ్రమకు ఉచిత విద్యుత్తు అందించాలి



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఉచిత విద్యుత్తు అందించాలని పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల సమాఖ్య(జేఏసీ) నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేదాకా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నిరాహార దీక్షకు మద్దతుగా మంగళవారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో, 24న సిరిసిల్ల పట్టణ బంద్, 26న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మూషం రమేశ్ తెలిపారు. నేతన్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు రవీందర్, డయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

- సిరిసిల్ల టౌన్, జూలై 22



• మత్స్యకార్మికుల ఆందోళన

సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మత్స్యకార్మిక సంఘం నాయకులు సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మత్స్యకార్మిక సంఘం నేత శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపునకు మార్చి మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అల్లోజీ పాల్గొన్నారు.

- కోడేరు, జూలై 22



• బురద రోడ్డుపై నాట్లేసి నిరసన

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ప్రధాన రహదారి బురదమయంగా మారింది. వివిధ పాఠశాలలకు వెళ్లే మార్గం ఇదే కావడంతో నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డంతా చిత్తడిగా మారింది. రహదారి ఇలా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని సోమవారం స్థానిక బీజేపీ నాయకులు బురదలో వరి నాట్లు వేసి నిరసన తెలియజేశారు. వెంటనే మరమ్మతులు చేయడంతోపాటు సీసీగా మార్చాలని డిమాండ్ చేశారు.

- కల్వకుర్తి, జూలై 22

• షరతుల్లేకుండా జీవనభృతి ఇవ్వాలి

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా బోధన్‌లో బీడీ కార్మికులు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎలాంటి షరతుల్లేకుండా అమలు చేయాలని, జీవనభృతిని రూ.4 వేలకు పెంచుతామన్న మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జీవనభృతి మొత్తాన్ని పెంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

- శక్కర్‌నగర్, జూలై 22



• 'డబుల్' ఇండ్ల లబ్ధిదారుల ధర్నా



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని డబుల్ బెడ్రూం ఇండ్లు అప్పగించాలని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని యూటీఎఫ్ భవనం నుంచి పాలమూరు రోడ్డు చౌరస్తా మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్ల వరకు ర్యాలీ చేపట్టి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ కల్వకుర్తి శివారులోని సర్వేనంబర్ 990లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 220 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిందన్నారు. ప్రభుత్వం మారడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో ఏపీ మల్లయ్య, బాలిరెడ్డి, కిశోర్ పాల్గొన్నారు.

- కల్వకుర్తి రూరల్, జూలై 22



• వడ్డెరులను ఎస్టీలో చేర్చాలి

ఎన్నికల హామీ మేరకు వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వడ్డెర సంఘం, వారియర్ ట్రస్ట్ అధ్యక్షుడు శివరాత్రి ఆంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే అసెంబ్లీ, సీఎం కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఒక్క రోజు నిరాహారదీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్, వైస్ ప్రెసిడెంట్ దేవరాజ్ ఉన్నారు.

-చిక్కడపల్లి, జూలై 22

• ఫీజు బకాయిలు విడుదల చేయాలి

భువనగిరి అర్బన్, జూలై 22 : ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ భువనగిరిలో సోమవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రిన్స్ చౌరస్తా వరకు ర్యాలీ తీసి, రాస్తారోకో చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోతీరాందేవ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో కొఠారి కమిషన్ చెప్పినట్లు విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో సూర్యాపేట, హుజూర్‌నగర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ తీసి నిరసన తెలిపారు. మిర్యాలగూడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- ట్రాన్స్‌ఫార్మర్ తీగలు పట్టుకుని మృతి
- నిర్మల్ జిల్లా పల్సి తండా వద్ద ఘటన

కుబీర్, జూలై 22: కూతురు పెండ్లి, ఇల్లు కట్టడానికి చేసిన అప్పులు ఎకరన్నర భూమి అమ్మినా తీరలేదని ట్రాన్స్‌ఫార్మర్ తీగలు పట్టుకుని రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా కుబీర్ మండలం సిర్పెల్లి(హెచ్)లో చోటు చేసుకున్నది. కుబీర్ ఎస్సై శివయ్య తెలిపిన ప్రకారం.. సిర్పెల్లి(హెచ్) గ్రామానికి చెందిన జాదవ్ మారుతి(45) ఐదున్నరెకరాల భూమిని సాగు చేసుకుంటూ, ఆటో నడుపుతున్నాడు. రెండేళ్ల క్రితం కూతురి పెండ్లికి రూ.10 లక్షలు, ఇల్లు కట్టడానికి రూ.12 లక్షల అప్పు చేశాడు. వడ్డీతో కలుపుకొని రూ.25 లక్షల వరకు అప్పు అయింది. తనకున్న ఐదున్నరెకరాల్లో ఎకరంనర భూమి అమ్మగా వచ్చిన రూ.12 లక్షలతో కొంత అప్పు తీర్చాడు. రూ.13 లక్షల అప్పు తీర్చడానికి మిగిలిన నాలుగెకరాలు అమ్మితే కొడుకుకు భూమి ఎలా అని మదనపడి సోమవారం పల్సి తండాకు వెళ్తున్నానని ఇంట్లో భార్యకు చెప్పి ఆటో తీసుకుని వెళ్లాడు. పల్సి తండా సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలను పట్టుకుని మృతిచెందాడు. చేలలో పని చేస్తున్న రైతులు గమనించి మారుతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. భార్య జాదవ్ లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్

- ఇంజక్షన్ ఆర్డర్‌పై కౌంటర్ దాఖలుకు డబ్బుల డిమాండ్

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 22 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ కమిషనర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... దాయరకు చెందిన సుదర్శన్‌కు మున్సిపాలిటీ పరిధిలోని బండ్లగూడలో ఉన్న రైస్ మిల్ స్థలం ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిలో పక్కన ఉన్న వ్యక్తి ప్రహరీని నిర్మించారు. ఆ ప్రహరీని గతంలో అధికారులు కూల్చివేశారు. అయితే ప్రహరీని నిర్మించిన వ్యక్తి కోర్టు నుంచి అనుమతి తెచ్చుకొని, ప్రహరీని మళ్లీ నిర్మించారు. కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేసేందుకు మున్సిపాలిటీ తరఫున కౌంటర్ దాఖలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను సుదర్శన్ కలిశారు. ఇందుకు రూ.50వేలు చెల్లించాలని కమిషనర్ సుదర్శన్‌ను డిమాండ్ చేశారు. ఇరువురి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు మొదట ఆయన కమిషనర్‌కు రూ.20వేలు ముట్టజెప్పాడు. మిగతా రూ.30వేలు కూడా ఇస్తేనే కౌంటర్ దాఖలు చేస్తానని డిమాండ్‌కు దిగారు. దీంతో సుదర్శన్ రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచన మేరకు సోమవారం రసాయనాలు వినియోగించిన రూ.500 నోట్లను సుదర్శన్ కమిషనర్‌కు అందజేశారు. ఆ వెంటనే ఏసీబీ అధికారులు రంగ ప్రవేశం చేసి, కమిషనర్‌ను పట్టుకున్నారు. అతడి చేతులకు రసాయనిక పరీక్షలు నిర్వహించి, లంచం డబ్బులు తీసుకున్నట్టు తేలింది. డబ్బులను రికవరీ చేసి, నాంపల్లిలోని ఏసీబీ కేసులను విచారించే కోర్టు అడిషనల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన దమ్మాయిగూడ మున్సిపాలిటీ కమిషనర్ రాజమల్లయ్య



• స్కాలర్‌షిప్స్ విడుదలకు ఎస్ఎఫ్ఐ ధర్నా

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రూ.7300కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక చెట్ల కింద చదువులు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు చరణ్, శివ, శ్రీకాంత్, తరుణ్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, సంధ్య, స్టాలిన్, అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

- రంగారెడ్డి, జూలై 22(నమస్తే తెలంగాణ):

• విద్యాబోధనకూ ఇక్కట్లే..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఉర్దూ మీడియం)లో 485 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి గదులు సరిపోక వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని తరగతులకు కలిపి కేవలం ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే బోధనందిస్తున్నారు. ప్రార్థనా సమయంలో స్థలం లేక, సగం మంది వరండాలో, సగం మంది చిన్నపాటి మైదానంలో నిల్చుంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



పెండింగ్ డీఏ చెల్లించాలి: ఎస్టీయూ

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఆరు నెలలకోసారి చెల్లించే కరువు భత్యం (డీఏ) రెండున్నరేండ్లుగా అమలు కావడంలేదని, తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వతరెడ్డి, ప్రధానకార్యదర్శి జి సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏతోపాటు పీఆర్సీపై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు.

మా భూమిని మాకు ఇప్పించండి

- సూర్యాపేట కలెక్టరేట్‌లో మహిళల ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట, జూలై 22: కబ్జాకు గురైన భూమిని తిరిగి ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఇద్దరు మహిళలు సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేశారు. బాధితులు లక్ష్మి, అరుణ వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన మేడం ముత్తయ్యకు సర్వే నంబర్ 190లో 2 ఎకరాల 50 సెంట్ల భూమి ఉండగా.. ఆయన కుటుంబ సభ్యులు మేడం చిట్టయ్య, మేడం వెంకటేశ్వర్లు, మేడం బాజరమ్మకు వారసత్వంగా వచ్చింది. వారు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసి వారి పేరు మీద పట్టా చేయించుకున్నారు. సమస్య పరిష్కారం అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని, కలెక్టరేట్‌కు మూడుసార్లు వచ్చినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు లక్ష్మి, అరుణ సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌కు పెట్రోల్ బాటిల్‌తో వచ్చి ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు గమనించి పెట్రోల్ బాటిల్‌ను తీసుకుని నచ్చజెప్పారు. కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్‌పవార్ వారితో మాట్లాడారు. ఆర్డీవో, తహసీల్దార్‌తో విచారణ చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో ఆత్మహత్యాయత్నం చేస్తున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

జీవో 317 సమస్యలను పరిష్కరించాలి

- క్యాబినెట్ సబ్ కమిటీకి పీఆర్టీయూటీఎస్ వినతి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): జీవో నంబర్ 317 అమలులో ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు దామోదర రాజనర్సింహా, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను పీఆర్టీయూ టీఎస్ విజ్ఞప్తిచేసింది. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి మంత్రులకు వినతిపత్రం అందజేశారు. వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలని, స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను సొంత జిల్లాకు బదిలీ చేయాలని, సీనియారిటీకి రక్షణ కల్పిస్తూ పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. క్యాడర్ స్ట్రెంత్ సరిచేయాలని, మెడికల్, వితంతు ప్రాధాన్యతలను గుర్తించాలని కోరారు. అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ అంశాలను ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి సమర్పించి, ఉత్తర్వులు విడుదల చేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్టు నేతలు తెలిపారు.



షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

రుణమాఫీ రాని రైతుల పక్షాన కలెక్టర్‌కు ఎమ్మెల్సీ వివేకానంద ఫిర్యాదు

మేడ్చల్, జూలై 22(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ పథకాన్ని ఎటువంటి షరతులు లేకుండా అమలుచేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. రుణమాఫీ రాని రైతుల పక్షాన ఎమ్మెల్యే కేపీ వివేకానంద, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతున్నదని విమర్శించారు. రుణమాఫీ కాని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదోవ పట్టించిందని, ఆ నిధులను రుణమాఫీకి వినియోగించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మే, జూన్ నెలల్లోనే రైతుబంధును అందించి వ్యవసాయదారులను ప్రోత్సహించిందని చెప్పారు. రైతుబంధు కింద మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం రూ.39 కోట్లు అందిస్తే, సీఎం రేవంత్‌రెడ్డి అది ఇవ్వకుండా, రుణమాఫీ పేరుతో రూ.11 కోట్లు మాత్రమే ఇచ్చారని వివరించారు. రుణమాఫీ అంశంపై అసెంబ్లీలో ఎండగడతామని చెప్పారు.

మాఫీపై ఫిర్యాదుల వెల్లువ

> మొదటిపేజీ తరువాయి...

అధికారుల నుంచి సరైన సమాచారం లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డీసీసీబీల్లో రుణమాఫీ సమస్య మరింత ఎక్కువగా ఉన్నదని రైతులు చెప్తున్నారు. రూ.లక్ష వరకు రుణమాఫీ కావాల్సిన వారిలో సగం మందికి కూడా మాఫీ కావడం లేదని, భారీ సంఖ్యలో రైతుల పేర్లు గల్లంతవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రుణమాఫీలో చిత్రవిచిత్రాలు

రుణమాఫీలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. తొలి జాబితాలో రుణం మాఫీ అయిన రైతులకు కూడా మొత్తం రుణం నిధులు ఖాతాలో జమ కావడం లేదు. ఉదాహరణకు ఒక రైతుకు అసలు, వడ్డీతో కలిసి రూ.70 వేల రుణం ఉంటే.. మొత్తం రూ.70 వేలు మాఫీ కింద రైతు ఖాతాలో జమ కావాలి. కానీ విచిత్రంగా ఆ రైతు ఖాతాల్లో రూ. 20 వేలే జమవుతున్నాయి. చాలా బ్యాంకుల్లో ఇలాంటి సమస్య ఉత్పన్నమవుతున్నది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖల్లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ బ్యాంకుల్లో చాలామంది రైతులకు మాఫీ మొత్తంతో పోల్చితే తక్కువ నిధులు ఖాతాలో జమవుతున్నాయి. అయితే దీనికి కారణం అధికారులు కూడా చెప్పకపోవడం గమనార్హం. ఇలాంటివి బ్యాంకుల తప్పిదాల వల్లే జరిగాయని, నిధులు జమ చేయడంలో ఎలాంటి పొరపాటు లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు.

- నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామంలో గల బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.లక్ష వరకు రుణం మాఫీ కావాల్సి ఉన్న రైతుల ఖాతాల్లో రూ.30 వేలు, రూ.40 వేలు, రూ.60 వేలు మాత్రమే జమయ్యాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం గానుగపాడు సొసైటీలో రూ.లక్ష వరకు రుణమాఫీ కావాల్సిన రైతులు 2,500 మంది ఉంటే 500 మందికే మాత్రమే మాఫీ అయింది. గుంపెన సొసైటీలో 1,800 మంది రైతులకుగాను 300 మందికే మాత్రమే రుణ మాఫీ అయింది.
- జనగామలో తిరుపతి అనే రైతుకు వడ్డీతో కలిపి రూ.86 వేల రుణం ఉంటే ఆ రైతు ఖాతాలో రూ.13,497 మాత్రమే జమయ్యాయి.
- రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 34 వేల వరకు ఉన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 11,700 మంది పేర్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన 22 వేల మంది రైతుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

రుణమాఫీ తీరుపై నిరసనాస్త్రం

బ్యాంకుల ఎదుట రైతుల ఆందోళన.. లక్షలోపు రుణాలు పూర్తిగా మాఫీ కాలేదని ఆవేదన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్ అర్బన్, జూలై 22: తొలి విడతలో రూ.లక్ష లోపు రుణం మాఫీ కాని రైతులు పోరుబాట పడుతున్నారు. సోమవారం నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదుట రైతులు నిరసన వ్యక్తంచేశారు. లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు మాత్రమే మాఫీ అయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. లక్షలోపు తీసుకున్న రుణాలను మాఫీ చేయకుండా ఎందుకు ఆపారో తెలపాలంటూ బ్యాంకు ఎదుట నిరసన చేపట్టారు. దీంతో బ్యాంకు అధికారులు బయటకొచ్చి రైతులతో మాట్లాడారు. హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారమే చేశామని తెలిపారు. ఏదైనా సాంకేతిక సమస్యలతో పొరపాటు జరిగి ఉండొచ్చని, పైఅధికారులతో చర్చించి మూడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు శాంతించారు.

రంగారెడ్డి డీసీసీబీలో 22 వేల మందికి మొండిచెయ్యి

తొలి విడతలో 11,700 మందికే మాఫీ

రంగారెడ్డి, జూలై 22 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 34 వేల వరకు ఉన్నారు. అయితే, ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 11,700 మంది రైతుల పేర్లు మాత్రమే ఉన్నాయి. మిగిలిన 22 వేల మంది రైతులకు మొండిచెయ్యి చూపిస్తారేమో? అన్న భావన రైతుల్లో కలుగుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, భార్యాభర్తలిద్దరినీ కుటుంబసభ్యులుగా పరిగణించాలని, వేరుగా ఉంటున్న కుమారులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు. కొద్ది మందికే మాఫీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

70 వేలకు 13 వేలే మాఫీ



ఎస్‌బీఐ జనగామ బ్రాంచ్‌లో రూ.70 వేలపైగా రుణం తీసుకున్న. వడ్డీతో కలిపి రూ.86 వేలు కావచ్చు. రూ.లక్ష లోపు రుణమాఫీకి అర్హుడినైన నాకు రూ.13,497 మాఫీ అయినట్టు నెల 18న మెసేజ్ వచ్చింది. పూర్తిగా రుణమాఫీ కాలేదు. వ్యవసాయ అధికారికి చెప్తే బ్యాంకుకు వెళ్లి తెలుసుకో అన్నడు. గతంలో నేను తీసుకున్న రుణం పూర్తిగా మాఫీ అయ్యింది. ఇప్పుడేమో ఇట్లయ్యింది.

-చరిగె తిరుపతి, రైతు, గానుగుపహాడ్

కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలి

గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నిరసన

చండ్రుగొండ, జూలై 22: కొర్రీలు, షరతులు పెట్టకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మరుపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. గానుగపాడు సొసైటీలో 2,500 మంది రైతులు ఉంటే.. 500 మందికి, గుంపెన సొసైటీలో 1,800 మందికిగాను 300 మంది రైతులకు మాత్రమే రుణం మాఫీ చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సొసైటీ వైస్ చైర్మన్ చెవుల చందర్‌రావు, సీఈవో లంక నర్సింహారావుకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు భూపతి రమేశ్, కన్నయ్య, తుపాకుల రాజా, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

33 వేల మందికి రుణమాఫీ కాలేదు

- సాంకేతిక కారణాలతో ఇబ్బందులు
- త్వరలో రెండో విడత: మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): తొలి విడత జాబితాలో 33,658 మంది రైతులకు రుణమాఫీ కాలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖాతాల్లో ఇబ్బందులు, సాంకేతిక కారణాలతో జమ కాలేదని చెప్పారు. ఆ నిధులు వెనక్కి రాగానే తిరిగి వెళ్లిస్తామని పేర్కొన్నారు. రెండో విడత రుణమాఫీని సాధ్యమైనంత త్వరగా అమలుచేస్తామని చెప్పారు. తొలి విడతలో 11.50 లక్షల కుటుంబాలకు రూ.6,098.94 కోట్లు విడుదలచేసినట్టు తెలిపారు. ఆర్‌బీఐ నుంచి అందిన వివరాల ప్రకారం 11.32 లక్షల కుటుంబాల ఖాతాల్లో రూ.6,014 కోట్లు జమైనట్టు తెలిపారు. కొన్ని కారణాలతో పలు కమర్షియల్ బ్యాంకుల్లోని 17,877 మంది రైతుల ఖాతాల్లో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించి 15,781 మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదని వివరించారు. ప్యాక్స్ సంబంధించి 15,781 రుణఖాతాల తనిఖీ పూర్తయిన వెంటనే నిధులు విడుదలచేస్తామని తెలిపారు. సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రమావత్ రాంచందర్, వైస్ చైర్‌పర్సన్‌గా బుస్స్యగారి ఆశోక్ రెడ్డిని, భూపాలపల్లి చైర్‌పర్సన్‌గా గండ్రోజు కిష్టయ్య, వైస్ చైర్‌పర్సన్‌గా దేపాక రాజేందర్‌ని, దిబ్బాల చైర్‌పర్సన్‌గా గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా ఎండీ రఫీని నియమించినట్టు మంత్రి తెలిపారు.



ఢోకా లేదు.. నిశ్చింతగా వుండు!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	30.0°c	25.0°c
వరంగల్	29.5°c	22.5°c
హైదరాబాద్	29.5°c	23.1°c
ఆదిలాబాద్	29.2°c	23.5°c
నల్లగొండ	29.0°c	22.0°c
కరీంనగర్	29.0°c	25.0°c
నిజామాబాద్	27.1°c	23.0°c
రంగారెడ్డి	26.6°c	22.1°c
మహబూబ్‌నగర్	26.5°c	23.2°c
మెదక్	26.0°c	22.3°c

మరో మూడు రోజుల పాటు వర్షాలు

జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండండి: సీఎస్

హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. వరదలు, వర్షాల ప్రభావంపై సోమవారం డీజీపీ జితేందర్, ప్రజారోగ్య ముఖ్యకార్యదర్శి సందీప్‌సుల్తానియాతో కలిసి ఆమె కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలపై సీఎం నిరంతరం సమీక్షిస్తున్నారని, జిల్లాల్లో ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, ఎస్డీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్ తదితర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, వర్షాల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాల్లో వర్ష, వరదల తీవ్రత దృష్ట్యా పూర్తి అప్రమత్తంగా ఉన్నామని, తగు చర్యలు తీసుకుంటున్నామని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల కలెక్టర్లు తెలిపారు.

ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. సోమవారం భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీచేశారు.

పాలకమండలిని ఏర్పాటు చేయండి

- సీఎంకు శ్రీవైష్ణవ సేవా సమితి విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయాలని, బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.100 కోట్ల నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ బ్రాహ్మణ శ్రీవైష్ణవ సేవా సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సేవా సమితి అధ్యక్షుడు కొండూరి నరేందర్‌ఆచార్య, అఖిల భారత బ్రాహ్మణ, అర్చక సేవా సమాఖ్య అధ్యక్షుడు రాహుల్ దేశ్‌పాండే సోమవారం సచివాలయంలో సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వివేకానంద విదేశీ విద్యా పథకం లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆలయాల్లో అర్చక, వేద పండితుల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై ఆగస్టు 5న విచారణ

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన అదనపు చార్జిషీట్ సరిగా లేదని డిఫాల్ట్ బెయిల్ కోసం కవిత దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణను ఆగస్టు 5కు వాయిదా వేస్తున్నట్టు రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి భవేజా సోమవారం ప్రకటించారు. సీబీఐ అదనపు చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు వెల్లడిస్తూ.. దీనిపై ఈ నెల 26న విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఆ రోజు కవితను వర్చువల్‌గా హాజరుపర్చాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు అనారోగ్యం బాగాలేని కవిత మంగళవారం మరింత అస్వస్థతకు గురికావడంతో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రైవేటుకు తీసుకెళ్లాలన్న న్యాయవాది విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఎయిమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించారు.

24న లాసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): న్యాయ విద్యా కాలేజీల్లో (మూడు/ ఐదేండ్ల) 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలను ఆగస్టు 5 నుంచి ప్రారంభించాలని అడ్మిషన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. 24న లాసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్, ఆగస్టు 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆన్‌లైన్ పేమెంట్‌తో పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ స్లాటింగ్ నిర్వహిస్తారు. 21న అర్హుల జాబితా ప్రకటిస్తారు. వివరాలకు http://lawcetadm.tsche.ac.in/ సంప్రదించాలి.

గతి తప్పిన పాలన

> మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. 'పీఎం కిసాన్ యోజనలో 18 ఏండ్లు దాటిన వారిని యాజమానితో సంబంధం లేకుండా లబ్ధిదారుడిగా పరిగణిస్తారు. కానీ రుణమాఫీలో అలా చేయటం లేదు. ప్రభుత్వం రైతును గుర్తించాలి తప్ప కుటుంబంతో పనేమిటి? రుణమాఫీపై రైతులు అయోమయానికి గురవుతున్నారు. పనులు వదులుకొని అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. రేషన్‌కార్డు నిబంధన లేదని ఉత్తగా చెబితే కాదు.. కొత్త ఉత్తర్వులు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

స్థానిక సంస్థలకు రాష్ట్రం వాటా ఏది?

స్థానిక సంస్థలకు కేంద్రం నిధులు విడుదల చేసినా, రాష్ట్రం మాత్రం నిధులివ్వటం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. పంచాయతీలో పారిశుద్ధ్యం గురించి తాను చేవెళ్లకే కార్మికులకు జీతాలు అందాయని.. జీతాలివ్వనా, పంచాయతీలకు నిధులు ఇవ్వలేదని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో ప్రతి నెల పంచాయతీలకు రూ.275 కోట్లు ఠంచనుగా విడుదల చేసేవాళ్లమని, మార్చి కన్నా ముందే కేంద్రం రూ.500 కోట్లు విడుదల చేసినా, వాటిని రాష్ట్రం విడుదల చేయటం లేదని విమర్శించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు పెట్టకపోవటం వల్ల మరో రూ.750 కోట్లు కేంద్రం విడుదల చేయలేదని వివరించారు. అమ్మ పెట్టదు అడుక్కు తిననివ్వదు అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. ఉపాధి హామీ కింద రూ.2,500 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధి హామీకి కేంద్రం రూ.800 కోట్లు విడుదల చేసినా రాష్ట్రం తన వాటాగా రూ.350 కోట్లు ఇవ్వటం లేదని వెల్లడించారు. కేంద్ర నిధులు 15 రోజుల్లో ఖర్చు చేయకపోతే వడ్డీ వసూలు చేస్తారని తెలిపారు. బిల్లులు రాక చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలలుగా జీతాలు రావటం లేదని వివరించారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్లు ఇవ్వటం లేదని, తాను నిలదీశాకే ఒక నెల పింఛను ఇచ్చారని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి జీతాలు కూడా రావటం లేదన్నారు.



రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగులపై బీహార్ బ్యాచ్ అని మాట్లాడారు. మరిప్పుడు ఆయన చేస్తున్నదేమిటి? అర్హత గల తెలంగాణ బిడ్డలు శివధర్‌రెడ్డి, నాగిరెడ్డి, కొత్తకోట శ్రీనివాసరెడ్డి, సీవీ ఆనంద్‌ను డీజీపీగా నియమించే అర్హత ఉన్నా పంజాబ్, బీహార్ బ్యాచ్ అయిన జితేందర్‌ను ఎందుకు నియమించారు?

ఆదిలాబాద్‌లోని తాంసీ మండలంలో విమల అనే మహిళకు రూ.59 వేల అప్పు ఉంటే రూ.3,434 రుణం మాఫీ అయినట్టు మెసేజ్ వచ్చింది. ఇదేం లెక్క? ఇలాంటి తప్పులు చాలా ఉన్నాయి.

- మాజీమంత్రి హరీశ్‌రావు

తాము ప్రభుత్వం దృష్టికి తెచ్చాకే చలనం వచ్చిందని చెప్పారు. మన ఊరు మన బడి బిల్లులు ఇవ్వకపోవటంతో బాత్ రూములు కూడా తెరవని పరిస్థితి ఉన్నదని వెల్లడించారు. కార్యదర్శులు సొంత డబ్బులు ఖర్చు చేశారని, ఇప్పుడు వారిని బదిలీ చేశారని, ఆ డబ్బులు ఎవరివ్వాలని ప్రశ్నించారు.

సంక్షోభంలో విద్యుత్తు రంగం

పరిపాలన వైఫల్యంతో విద్యుత్తు శాఖను తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. కరెంటు కోతలకు విచిత్ర కారణాలు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. తొండలు, బల్లుల వల్లే కాదు.. హరీశ్‌రావు చెప్తే కరెంటు తీసేస్తున్నారని అసంబద్ధ కారణాలు చెప్తున్నారని విమర్శించారు. గతానికి, ఇప్పటికి విద్యుత్తు వినియోగంలో తేడా లేకపోయినా విద్యుత్తు అంతరాయాలు, కోతలు ఉంటున్నాయని వెల్లడించారు. 'రైతులు డీడీలు కట్టినా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వటం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో పంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు కరెంటు బిల్లులు కట్టడం లేదు. గృహజ్యోతి పథకం నిధులను ప్రభుత్వం ట్రాన్స్‌కోకు విడుదల చేయకపోవటంతో సంస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. 91 లక్షల మందికి తెల్లరేషన్ కార్డులు ఉంటే కేవలం సంఖ్యలో కూడా పథకం అమలు కావటం లేదు. పోలీసులకు పెట్రోల్, డీజిల్ డబ్బులు కూడా ఇవ్వటం లేదు. హోం గార్డులకు జీతాలు సరిగా రావటం లేదు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు తులం బంగారం ఇవ్వటం లేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. సిద్దిపేటలోనే 3 వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. రైతుబీమా చెక్కులు నెల దాటినా రావటం లేదు. కేసీఆర్ హయాంలో వారంలో రూ.5 లక్షల బీమా చెక్కు వచ్చేది. సంక్షేమ హాస్టళ్లలో పనిచేసే వారికి 8 నెలలుగా వేతనాలు రావటం లేదు' అని వివరించారు.

ప్రతి వర్గం రోడ్డెక్కింది


కాంగ్రెస్ పాలనలో కంచెలు తీసేస్తామని చెప్పి, కొత్త కంచెలు తెచ్చారని హరీశ్‌రావు విమర్శించారు. 'అసెంబ్లీ చుట్టూ కంచెలు పెంచారు. నాలుగు అంచెల కంచెలు తీసుకొచ్చారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లకు అత్యవసర పనుల కోసం గతంలో నెలకు రూ.40 లక్షలు ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి 7 నెలలుగా బంద్ అయ్యాయి. నగరంలో చాలా డివిజన్లు చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం పనితీరు అస్తవ్యస్తంగా మారింది. గ్రేటర్‌లో 130 శాతం దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. చాలా మంది సిబ్బందికి 1న జీతాలు రావటం లేదు. ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. దవాఖానల్లో డాక్టర్ల బదిలీలు అస్తవ్యస్తంగా మారాయి. బదిలీల్లో పారదర్శకత లేదు. కనీస సౌకర్యాలు లేని దవాఖానలకు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లను నియమించారు. వారిని అక్కడ నియమించటం వల్ల రోగులకే నష్టం, ఇబ్బంది తప్ప, డాక్టర్లకు ఎలాంటి నష్టం ఉండదు. సీనియర్లు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల సేవలను సరైన విధంగా ఉపయోగించి రోగులకు సేవలు అందించాలి. రాష్ట్రంలో ప్రతి వర్గం రోడ్డెక్కేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉన్నది. రోడ్డెక్కని వర్గమే లేదు. 2 వేల పడకల దవాఖానలకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన వారిని వంద పడకల దవాఖానలకు పంపారు' అని మండిపడ్డారు.

- **నాడు బీహారీ బ్యాచ్ అని..**

'ఐఏఎస్, ఐపీఎస్‌లకు పోస్టింగుల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా బీహార్ బ్యాచ్ అని మాట్లాడారు. ఆనాడు మాట్లాడింది ఏమిటి? ఇప్పుడు రేవంత్ చేస్తున్నదేమిటి?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తాను బీహార్, పంజాబ్, ఇతర రాష్ట్రాల అధికారులకు వ్యతిరేకం కాదని, రేవంత్ అన్న మాటలనే గుర్తుచేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ అధికారుల గురించి రేవంత్ నాడు ఏమన్నారో అన్నీ బయటపెడతానని ప్రకటించారు. బీహారీలంటే దోపిడీదారులని నాడు రేవంత్‌రెడ్డి అన్నారని, అప్పుడు వద్దన్న వారు.. ఇప్పుడు ముద్దు ఎలా అయ్యారని నిలదీశారు. ఆనాడు తెలంగాణకు చెందిన మహేందర్‌రెడ్డిని డీజీపీగా నియమిస్తే, ఆయనపై రేవంత్‌రెడ్డి ఎన్నో ఆరోపణలు చేశారని, ఇప్పుడు ఆయనను టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించారని గుర్తుచేశారు. సందీప్‌కుమార్ సుల్తానియాపై ఆరోపణలు చేసి ఇప్పుడు ఆయనకు అత్యంత కీలక శాఖలు అప్పగించారని తెలిపారు. సర్వీస్‌లో దివ్యాంగులు పనికిరారని స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవించనని అభిప్రాయపడ్డారు. సిద్దిపేటలో అమలు చేసిన కొన్ని వినూత్న కార్యక్రమాలకు కేంద్ర ఆర్థిక సర్వేలో చోటు లభించడం సంతోషం అని అన్నారు. స్టేట్ బ్యాంకు కాన్సెప్ట్‌ను ఆర్థిక సర్వేలో ప్రత్యేకంగా ప్రస్తావించారని పేర్కొన్నారు.

భారీ అవినీతి కుంభకోణంలో మంత్రి పొంగులేటి

- నకిలీ డాక్యుమెంట్లతో వేల కోట్ల కాంట్రాక్టులు
- ప్రభుత్వం సీబీఐతో విచారణ చేయించాలి
- బిల్లులు రాక ఇబ్బందుల్లో మాజీ సర్పంచ్‌లు
- మరోవైపు పొంగులేటికి కోట్లలో చెల్లింపులు
- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దేశంలోనే భారీ అవినీతి కుంభకోణానికి పాల్పడ్డారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రిజర్వ్‌బ్యాంక్ మార్గదర్శకాలకు విరుద్ధంగా, తప్పుడు డాక్యుమెంట్లతో దేశ చట్టాలతో సంబంధంలేని యూరో ఎగ్జిమ్ బ్యాంకు, అదేవిధంగా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకుల గ్యారెంటీలను చూపి వేల కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు పనులను దక్కించుకున్నారని విమర్శించారు. అలాంటి కుంభకోణంలో ఉన్న పొంగులేటి మంత్రి పదవికి అనర్హుడని పేర్కొన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్పంచ్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రావడం లేదని, కానీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన వందల కోట్ల బిల్లులు మాత్రం క్లియర్ అవుతున్నాయని విమర్శించారు. ఫేక్ డాక్యుమెంట్లతో వేల కోట్ల కాంట్రాక్టులు తీసుకుని, ప్రభుత్వాన్ని, చట్టాలను మోసం చేస్తున్నారని, వాటిపై న్యాయ విచారణతోపాటు సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే విచారణ కోసం సీబీఐని కోరాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మహిళలు, విద్యార్థులు, రైతులు, ప్రజాసమస్యలను లేవనెత్తుతామని వెల్లడించారు.


ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరల పెంపు

> మొదటిపేజీ తరువాయి...

సంవత్సరం 54 శాతం పెరిగినట్టు వివరించారు. ప్రభుత్వంపై అదనంగా రూ.800 కోట్ల వరకు భారం పడుతున్నట్టు వివరించారు.

కొత్తగా 163 కొత్త వ్యాధులు


ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రస్తుతం ఉన్న వ్యాధులకు అదనంగా మరో 163 కొత్త ప్రొసీజర్లను చేర్చారు. ఈ మేరకు మరో ఉత్తర్వు విడుదల చేశారు. వీటితో కలిపి మొత్తం ప్రొసీజర్ల సంఖ్య 1,835కి పెరిగినట్టు మంత్రి తెలిపారు. లబ్ధిదారులకు గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలను అందజేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కొత్త ప్రొసీజర్స్‌తో లక్షల్లో కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 79 లక్షల కుటుంబాలకు చికిత్స అందుతున్నట్టు పేర్కొన్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ప్రైవేట్ దవాఖానల్లోని మెడికల్, సర్జికల్ విభాగాలకు చెందిన నిపుణులను సంప్రదించిన తర్వాత ధరలు పెంచినట్టు వెల్లడించారు.



మధుమేహ రోగులకు ఊరట

ఆరోగ్యశ్రీలో కొత్తగా 163 ప్రొసీజర్లను జత చేస్తూ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్‌చోంగ్తు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో మధుమేహ రోగులకు ఊరట కల్పిస్తూ ఇన్సులిన్ పంప్స్‌ను జతచేశారు. ఏడాదికి ఒక రోగికి రూ. 2 లక్షల వరకు ప్యాకేజీ ఉన్నది. గుండెకు సంబంధించి అదనంగా 12 ప్రొసీజర్లను చేర్చారు. పెడియాట్రిక్‌లో 2, ఎండోక్రైనాలజీలో 7, జనరల్ మెడిసిన్‌లో 3, జనరల్ సర్జరీలో 15, జెరియాట్రిక్ మెడిసిన్‌లో ఒకటి, ఇంటర్వెన్షనల్ రేడియాలజీలో 17, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీలో 9, నెఫ్రాలజీలో 16, న్యూరాలజీలో 8, న్యూరో సర్జరీలో 18, న్యూక్లియర్ మెడిసిన్‌లో మూడు, ప్లాస్టిక్ సర్జరీలో 9, పల్మనాలజీలో 3, రేడియేషన్ అంకాలజీలో 3, రుమటాలజీలో 7, సర్జికల్ అంకాలజీలో 9, యూరాలజీలో 11, వాస్క్యులర్ సర్జరీలో 6 జత చేశారు.

'పోరుబందర్'కు బోయినపల్లి



హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): జాతిపిత మహాత్మాగాంధీ జన్మస్థలం పోరుబందర్‌ను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సోమవారం సందర్శించారు. తన సతీమణి మాధవితో కలిసి గుజరాత్‌లోని ద్వారక, సోమనాథ్ ఆలయాలను సైతం సందర్శించారు. తన పుట్టినరోజున గాంధీజీ స్వస్థలమైన పోరుబందర్‌ను సందర్శించటం అదృష్టంగా భావిస్తున్నానని వినోద్‌కుమార్ పేర్కొన్నారు.



ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో మంటలు

- నావికుడు గల్లంతు
- తీవ్రంగా దెబ్బతిన్న యుద్ధ నౌక

ముంబై, జూలై 22: ముంబై నావల్ డాక్ యార్డ్‌లో మరమ్మత్తులు జరుపుకుంటున్న యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ బ్రహ్మపుత్ర'లో ఆదివారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. డాక్‌యార్డ్‌లో ఇతరుల సాయంతో అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటలపాటు శ్రమించి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చినట్టు భారత నౌకాదళం సోమవారం తెలిపింది. ఈ ఘటనలో ఓ నావికుడు గల్లంతయ్యాడని, యుద్ధ నౌకలోని ఓ వైపు భాగం దెబ్బతిన్నదని వెల్లడించింది. గల్లంతైన నావికుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు పేర్కొన్నది. యుద్ధ నౌకలో మంటలు అదుపులోకి వచ్చినా, యుద్ధనౌక నిటారుగా నిలువలేక.. ఓ వైపునకు ఒరిగిపోయింది. సిబ్బంది ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. యుద్ధ నౌక తిరిగి పూర్వపు స్థితికి రాలేకపోయింది. ఘటనపై భారత నౌకాదళం విచారణకు ఆదేశించింది.



'ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీ' ప్రయోగం సక్సెస్

- రెండోసారి విజయవంతంగా పరీక్షించిన ఇస్రో

బెంగళూరు, జూలై 22: 'ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీ'ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరోసారి విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన 'ఆర్‌హెచ్-560' రాకెట్‌లో జతచేసిన 'ప్రొపల్షన్ సిస్టం'ను అమర్చినట్టు ఇస్రో సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంధనాన్ని మండించేందుకు కావాల్సిన ఆక్సిజన్‌ను వాతావరణంలో నుంచి రాకెట్ తీసుకోవటమే 'ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్' టెక్నాలజీ. దీనివల్ల.. రాకెట్లు ప్రత్యేకంగా ఆక్సిజన్ సిలిండర్లను మోసుకెళ్లాల్సిన అవసరముండదు. ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్‌తో ఆకాశంలోకి దూసుకెళ్లిన 'ఆర్‌హెచ్-560' రాకెట్ పనితీరును 110 రకాలుగా పరిశీలించినట్టు ఇస్రో తెలిపింది. రాకెట్ ధ్వని, ఇగ్నిషన్ వ్యవస్థల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసింది.

నేడు కేంద్ర బడ్జెట్

ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం నేపథ్యంలో ప్రాధాన్యం



న్యూఢిల్లీ, జూలై 22: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టనున్నది. దీంతో వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలువనున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ మిత్రపక్షాలపై ఆధారపడి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ దఫా బడ్జెట్‌కు ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఏయే కొత్త సంక్షేమ పథకాలు ప్రకటిస్తారు? మధ్యతరగతికి ఆదాయ పన్ను ఉపశమనం ఉంటుందా? జనాకర్షక స్కీములు ఏముంటాయి? అనే అంశాలపై చర్చ నడుస్తున్నది. మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ, గత రెండు పర్యాయాలతో పోలిస్తే లోక్‌సభలో బీజేపీ ఎంపీ సీట్ల సంఖ్య తగ్గిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిత్రపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఉంటాయా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కొత్త పన్నుల్లో వృద్ధికి ఊతమిచ్చేవే కాకుండా ఉద్యోగాల కల్పన దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నిర్మలకు వరుసగా ఏడో బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఇది వరుసగా ఏడో బడ్జెట్. తద్వారా ఆరు సార్లు వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ రికార్డును ఆమె అధిగమించనున్నారు. మొత్తంగా ఎక్కువసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరుపై ఉన్నది. ప్రధానులుగా నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి హయాంలలో ఆయన 10 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2019లో కేంద్రంలో బీజేపీ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మలను ఆర్థిక మంత్రిగా నియమించారు.

రైతుల సమస్యకు పరిష్కారం ఇచ్చేనా?

కొత్త బడ్జెట్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు కనీస మద్దతు ధరల సమస్యను పరిష్కరించే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటుందా? అని దేశ రైతులు ఎదురుచూస్తున్నారు. పంటలకు కనీస మద్దతు ధరలు పెంచాలని, ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలని రైతులు ఉద్యమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరలు పెరగాలని రైతులు ఆశిస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం పెంపుపైనా ఆశలు పెట్టుకొన్నారు.

ఆదాయ పన్ను ఉపశమనం దక్కేనా?

మరోవైపు నిత్యావసరాలతో సహా అన్ని ధరలు పెరగడంతో గత కొన్నేండ్లుగా ప్రజల జీవన వ్యయాలు గణనీయంగా పెరిగాయి. అందుకు తగ్గట్టుగా వేతన జీవులకు ఆదాయ పన్ను విషయంలో ఉపశమనం మాత్రం దక్కడం లేదు. ఈసారైనా కేంద్రం ఊరటనిస్తుందా? అని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రూ.10 లక్షల లోపు ఆదాయమున్న మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు కొత్త బడ్జెట్‌లో కొంత ఉపశమనం ఉంటుందని అంచనాలు వినిపిస్తున్నాయి.

నీట్‌పై పార్లమెంట్‌లో రగడ

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై తొలిరోజే లోక్‌సభ దద్దరిల్లింది. అధికార, విపక్ష పార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. నీట్ మాత్రమే కాదు.. దేశ మొత్తం పరీక్షా వ్యవస్థలోనే తీవ్రమైన సమస్య ఉన్నదని విపక్షాలు ఆరోపించాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి బాధ్యత తీసుకోవడం లేదని విమర్శించాయి. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడుతూ దేశంలోని మొత్తం పరీక్షా వ్యవస్థ మోసపూరితమని విద్యార్థులు భావిస్తున్నారని అన్నారు. విద్యా శాఖ మంత్రి ప్రధాన్ తనపై తప్పు ఇతరులపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. ఈ వ్యవస్థాగత సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారని ప్రశ్నించారు. దీనిపై ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ రాహుల్ గాంధీ, ఆయన పార్టీ మనుషులు అరుస్తున్నారని అన్నారు. గత ఏడేండ్లలో 70 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయన్న విపక్షాల ఆరోపణలపై మాట్లాడుతూ గత ఏడేండ్లలో పేపర్ లీకేజీలు జరిగినట్టు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పుకొచ్చారు. సమాజ్‌వాదీ ఎంపీ అఖిలేశ్ మాట్లాడుతూ పేపర్ లీకేజీల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తున్నదని ఎద్దేవా చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించిన పరీక్షా కేంద్రాల వివరాలను వెల్లడించాలన్నారు.

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేం

- ఆ ప్రతిపాదనేమీ లేదన్న కేంద్రం
- మిత్రపక్ష జేడీయూకు గట్టి షాక్
- నితీశ్ రాజీనామా చేయాలి
- ప్రతిపక్ష ఆర్జేడీ డిమాండ్

న్యూఢిల్లీ: మిత్రపక్షం జేడీయూకి కేంద్రంలోని అధికార బీజేపీ గట్టి షాక్ ఇచ్చింది. బీహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అంశంపై ప్రతిపాదనలు, ప్రణాళికలేమీ లేవని స్పష్టం చేసింది. ఆర్థిక వృద్ధి, పారిశ్రామికీకరణను ప్రోత్సహించేందుకు బీహార్, ఇతర వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రణాళిక ఏమైనా ఉందా? అని జేడీయూ ఎంపీ రామ్‌ప్రీత్ మండల్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం స్పందనపై ఆర్జేడీ మండిపడింది. జేడీయూను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించింది. 'కేంద్రంలో అధికారంలో భాగస్వామ్యమైన నితీశ్ కుమార్, ఇతర జేడీయూ నేతలు.. ఆ ఫలితాలను అనుభవించండి. బీహార్‌కు ప్రత్యేక హోదాపై వారి డ్రామా రాజకీయాలు కొనసాగించాలి' అని ఆర్జేడీ ఎక్స్ పోస్టులో ఎద్దేవా చేసింది. సీఎం నితీశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

కర్ణాటకలో ఈడీ అధికారులపై కేసు

బెంగళూరు, జూలై 22: కర్ణాటకలో 'వాల్మీకి' స్కామ్‌పై జరుగుతున్న దర్యాప్తు అనూహ్య మలుపు తీసుకుంది. స్కామ్‌ను దర్యాప్తు చేస్తున్న ఇద్దరు ఈడీ అధికారులకు వ్యతిరేకంగా బెంగళూరులోని విల్సన్ గార్డెన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం సిద్ధరామయ్య, మాజీ మంత్రి బీ నాగేంద్ర, ఆర్థిక శాఖ పేర్లు చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారిని ఈడీ అధికారులు ఒత్తిడి చేశారని ఆరోపిస్తూ ఈ కేసు నమోదైంది. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల కుంభకోణంపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. జూలై 16న సోషల్ వెల్ఫేర్ అదనపు డైరెక్టర్ కల్లేశ్‌ను కొన్ని గంటలపాటు ఈడీ ప్రశ్నించింది. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య, మాజీ మంత్రి బీ నాగేంద్ర, ఆర్థిక శాఖ పేర్లు చెప్పాలంటూ ఈడీ అధికారులు తనను బెదిరించారని కల్లేశ్ బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీట్ రద్దుకు కర్ణాటక బిల్లు

బెంగళూరు: కర్ణాటకలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)ను రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు రాష్ట్ర క్యాబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. నీట్‌కు బదులుగా వేరొక మెడికల్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను నిర్వహించాలని, లేదంటే, దీనిని రాష్ట్రంలోని కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌తో కలపాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. పన్నెండో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్స్ కల్పించేందుకు రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలని కోరింది. నీట్-యూజీ 2024 పరీక్షల్లో పేపర్ లీక్, తదితర అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును శాసన సభలో ప్రవేశపెడతారు.

ఆ ప్రశ్నకు సరైన సమాధానం తేల్చండి

- నీట్‌లో వివాదాస్పద ప్రశ్నపై ఢిల్లీ ఐఐటీని కోరిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, జూలై 22: నీట్ యూజీ-2024లో అడిగిన ఓ ప్రశ్నకు సరైన సమాధానాన్ని తేల్చాలని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ ఐఐటీ డైరెక్టర్‌ను కోరింది. ఇందు కోసం ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని, సరైన సమాధానంపై మంగళవారం మధ్యాహ్నంలోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. నీట్ యూజీ పరీక్షలో 'అణువు' దాని లక్షణాలకు సంబంధించి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, ఆ రెండింటిలో ఒక నిర్దిష్ట సమాధానం ఇచ్చిన వాళ్లకే నాలుగు మార్కులు ఇచ్చారంటూ పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఇది తుది మెరిట్ జాబితాపై తీవ్ర ప్రభావం చూపిందని సీజేఐ ధర్మాసనానికి తెలిపారు. అంతకుముందు నీట్ యూజీ-2024 పరీక్షను రద్దు చేయాలన్న పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం.. పరీక్ష నిర్వహణలో వ్యవస్థాగత వైఫల్యం జరిగిందనే దానికి, దేశవ్యాప్తంగా విస్తృతంగా పేపర్ లీకేజీ అయిందనే దానికి తగిన డాటా చూపించాలని పిటిషనర్లకు సూచించింది. విస్తృతంగా లీకేజీ అయిందన్న దానికి ఆధారాలు లేవని, కేవలం పాట్నా, హజారీబాగ్ వంటి చోట్ల మాత్రమే అక్రమాలు జరిగాయని తెలిపింది.

ఎన్‌టీఏ ఏర్పడ్డ తర్వాత 16 పరీక్షలు వాయిదా

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాటైన నాటి (2018లో) నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో 16 పరీక్షలు వాయిదా పడ్డాయని, ఆ సంస్థ 240 పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించిందని లోక్‌సభలో కేంద్రం వెల్లడించింది. కొవిడ్-19 సంక్షోభం, సాంకేతిక, పాలనాపరమైన సమస్యలు, పరీక్ష పేపర్ రవాణాలో ఆటంకాలు తదితర కారణాలతో పరీక్షలు వాయిదా పడ్డాయని కేంద్ర సహాయమంత్రి సుకాంత మజుందార్ సోమవారం పార్లమెంట్‌లో వెల్లడించారు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై గవర్నర్ జరిమానా రూ.500

- బెంగాల్‌లో కొనసాగుతున్న 'ప్రమాణ స్వీకార' రగడ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఉప ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు టీఎంసీ ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారంపై రగడ కొనసాగుతున్నది. స్పీకర్ వారి చేత ప్రమాణం చేయించడం, తాజాగా సోమవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ రాజ్‌భవన్ ఆ ఇద్దరు శాసనసభ్యులపై రూ.500 చొప్పున జరిమానా విధించింది. ఈ మేరకు గవర్నర్ సీవీ ఆనంద బోస్ కార్యాలయం నుంచి తమకు మెయిల్స్ వచ్చాయని ఎమ్మెల్యేలు హసన్ సర్కార్, శయంతికా బెనర్జీ సోమవారం వెల్లడించారు. ప్రమాణ స్వీకార ప్రక్రియ చట్టబద్ధతను ప్రశ్నించిన రాజ్‌భవన్.. రూ.500 జరిమానా చెల్లించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఈనెల 5న ఇద్దరు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార ప్రక్రియను గవర్నర్ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీకి అప్పగించగా.. వారిద్దరి చేత స్పీకర్ బిమన్ బెనర్జీ ప్రమాణం చేయించారు. దీనిపై తాము స్పీకర్‌ను కలిశామని శయంతికా బెనర్జీ తెలిపారు. ఈ అంశాన్ని స్పీకర్ కార్యాలయం చూసుకుంటుందని ఆయన చెప్పారని పేర్కొన్నారు. తాము జరిమానా చెల్లించేదీ లేదని స్పష్టం చేశారు.

మంత్రి అల్లుడి కోసం కొత్త పోస్టు!

- కర్ణాటక అసెంబ్లీలో 'సెక్రటరీ-2' సృష్టి
- ఆర్థిక విభాగం ఆమోదానికి స్పీకర్ లేఖ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల ధ్వజం



మునియప్ప

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడి కోసం అసెంబ్లీలో ఒక కొత్త పోస్టును సృష్టించడం రాజకీయ దుమారం రేపింది. విధానసభలో 'అసెంబ్లీ కార్యదర్శి' అనే ఒక పోస్టు ఇప్పటికే ఉండగా.. దానికి అదనంగా 'సెక్రటరీ-2' అనే పోస్టును సృష్టించి, దాన్ని అమాత్యుడి అల్లుడికి కేటాయించేందుకు ప్రభుత్వం పావులు కదపడంపై విపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. కొత్త పోస్టు సృష్టికి సంబంధించి అసెంబ్లీ స్పీకర్ అసెంబ్లీ ఆర్థిక విభాగానికి లేఖ రాసిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడు శివరాజ్ కోసం ఈ కొత్త పోస్టును ఏర్పాటు జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సెక్రటరీ అవకాశం లేకపోవడంతో.. కొత్త పోస్టును సృష్టించడాన్ని కర్ణాటక విధాన సభ ఉద్యోగుల సంఘం వ్యతిరేకించింది. శివరాజ్ సెక్రటరీ పోస్టు వచ్చే అవకాశం లేకపోవడంతోనే 'సెక్రటరీ-2' అనే పోస్టును ఏర్పాటు చేయిందారని అసెంబ్లీ కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నది. మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ మండిపడింది. ఎమ్మెల్యేల తిరుగుబాటు ప్రయత్నాలను చల్లార్చేందుకు రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘిస్తూ 90 క్యాబినెట్ గ్రేడ్ స్థాయి హోదాలను ఏర్పాటు చేశారని, ఇప్పుడు మంత్రి అల్లుడి కోసం కొత్త పోస్టును సృష్టించారని అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత ఆర్ అశోక్ విమర్శించారు.

ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మల దహనం

15న దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీ • ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కేఎంఎం

న్యూఢిల్లీ: రైతు డిమాండ్లు నెరవేర్చాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం-నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాయి. దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తామని, ఆగస్టు 15న ట్రాక్టర్ ర్యాలీ చేపడతామని ప్రకటించాయి. ఈ ఆందోళనల్లో రైతులు, రైతు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరాయి. ఈ మేరకు సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. న్యూఢిల్లీలో కేఎంఎం నాయకుడు సర్వన్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ, 'రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్ ఆగస్టు 31నాటికి 200 రోజులు పూర్తిచేసుకుంటుంది. ఖానౌరి, శంభు వద్దకు రావాల్సిందిగా రైతులందర్నీ కోరుతున్నాం' అని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యక్రమాల్లో పాల్గొనొచ్చు

- నిషేధం ఎత్తివేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 22: రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆరెస్సెస్) కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనటంపై ఉన్న నిషేధాన్ని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎత్తివేసింది. 58 ఏండ్లుగా కొనసాగుతున్న ఈ నిషేధానికి స్వస్తి పలుకుతూ ఆదేశాలు జారీ చేసింది. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో గాంధీ హత్య సహా పలు కారణాలతో ఆరెస్సెస్ నిషేధాన్ని ఎదుర్కొన్నది. దీంతో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్‌లో చేరటాన్ని నిషేధించింది. దాన్ని ఇప్పుడు కేంద్రం ఎత్తివేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆరెస్సెస్, బీజేపీ స్వాగతించాయి. ఈ నిర్ణయంతో ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్ఠం అవుతుందని ఆరెస్సెస్ వ్యాఖ్యానించింది. కాగా, నిషేధం ఎత్తివేతపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది.





అగ్నిపథ్ స్కీమ్‌లో స్కామ్!

- అగ్నివీర్ నియామకాల్లో అక్రమాలు
- కటాఫ్ కంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులు ఎంపిక
- హైకోర్టుకు పలువురు అభ్యర్థులు
- అభ్యర్థులందరి మార్కుల వివరాలు వెల్లడించాలని ఆర్మీకి ఆదేశం
- 'ది వైర్'లో సంచలన కథనం

గ్వాలియర్: దేశంలో ఇప్పటికే నీట్, నెట్ పేపర్ లీక్‌లపై తీవ్ర దుమారం రేగుతున్న వేళ.. సాయుధ బలగాల్లో నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2022, సెప్టెంబర్-నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. కటాఫ్ కంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థుల పేర్లు మెరిట్ జాబితాలో కనిపించాయని కొంత మంది అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ సందర్భంగా ఎంపిక చేసిన అభ్యర్థులందరి మార్కుల వివరాలు వెల్లడించాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల ఆర్మీకి ఆదేశాలు జారీచేసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇన్వెస్టిగేషన్ చేసిన 'ది వైర్' తాజా కథనంలో కీలక విషయాలను వెల్లడించింది.

10 మార్కులు తక్కువ వచ్చినా సెలెక్ట్

ఫలితాలపై తీరుపై పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. తమకు వచ్చిన మార్కులు, కటాఫ్ స్కోర్, ఇతర అభ్యర్థులకు వచ్చిన మార్కుల వివరాలు తెలియజేయాలని కోరుతూ ఆర్మీకి ఆర్టీఐ కింద దరఖాస్తు చేశారు. 169గా నిర్ణయించిన కటాఫ్ కంటే తక్కువ స్కోర్ 159 వచ్చిన నితీశ్ కుమార్ అనే అభ్యర్థి పేరు ఎంపికైన వారి జాబితాలో కనిపించింది. ఆర్మీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన సెలెక్ట్ అయిన అభ్యర్థుల లిస్టులో అతని రోల్ నంబర్ కనిపించింది. పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో నితీశ్ కుమార్ పేరును లిస్టు నుంచి తర్వాత తొలగించారని పేర్కొన్నారు.



ఆటో డ్రైవర్‌గా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!

బెంగళూరు: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒకరితొకరు మాట్లాడుకోవడమే గగనంగా మారింది. ఉన్నత చదువులు చదివి, నగరాల్లో ఉద్యోగాలు చేస్తూ, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండేవారు ఒంటరితనంతో సతమతమవుతున్నారు. నలుగురితో కలివిడిగా మాట్లాడాలన్న కోరికతో ఇటువంటివారు రకరకాల వ్యాపకాలు చేపడుతున్నారు. తాజాగా ఓ నెటిజన్ ఇటువంటి సంఘటనను వెలుగులోకి తీసుకొచ్చారు. కోరమంగళలో తాను ఓ ఆటోను బుక్ చేసుకున్నానని, ఆ ఆటో డ్రైవర్ మైక్రోసాఫ్ట్ లోగో ఉన్న హుడీని ధరించడంతో ఆశ్చర్యపోయానని చెప్పారు. ఆయనతో మాటలు కలిపినపుడు తాను మైక్రోసాఫ్ట్ ఇంజినీర్‌నని, ఒంటరితనాన్ని భరించలేక, నలుగురితో మాట్లాడే అవకాశం కోసం వారాంతాల్లో ఆటో నడుపుతున్నట్టు చెప్పారని తెలిపారు. గతంలో ఓ మహిళ ఇచ్చిన పోస్ట్‌లో, తాను బుక్ చేసుకున్న ర్యాపిడో డ్రైవర్ ఓ ప్రముఖ కార్పొరేట్ సంస్థలో మేనేజర్ అని తెలుసుకుని ఆశ్చర్యపోయానని చెప్పిన సంగతి తెలిసిందే. బెంగళూరు నగరంలో ఇటీవల ఇటువంటి సంఘటనలు తరచూ కనిపిస్తున్నాయి.

పెండ్లి అయిన మూడు నిమిషాల్లోనే విడాకులు

న్యూఢిల్లీ: కువైట్‌లో నవ దంపతులు రికార్డు సృష్టించారు. వివిధ్దరూ భార్యాభర్తలు అని కోర్టులో జడ్జి ప్రకటించిన మూడు నిమిషాల్లోనే విడాకులు తీసుకున్నారు. 2019లో జరిగిన ఈ వివాహం, విడాకులు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం, యువతి, యువకుడు కోర్టులో వివాహ రిజిస్ట్రేషన్ కోసం వెళ్లారు. జడ్జి నిబంధనల ప్రకారం ఆ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వీరిద్దరూ భార్యాభర్తలని ప్రకటించారు. అనంతరం ఇద్దరూ కలిసి కోర్టు నుంచి బయటకు వెళ్తుండగా, యువతి కాలు జారి పడిపోయింది. ఆ యువకుడు ఆమెను 'స్టుపిడ్' అన్నాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన యువతి వెంటనే జడ్జి వద్దకు వెళ్లి, తమ వివాహాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరింది. జడ్జి అందుకు అంగీకరించి, వీరి వివాహాన్ని రద్దు చేశారు.

ఊబకాయంపై వర్రీ

- దేశంలో ఒబెసిటీ సమస్య
- 54 శాతం వ్యాధుల భారానికి అనారోగ్యకర ఆహారమే కారణం
- ఆర్థిక సర్వే 2023-24లో వెల్లడి



న్యూఢిల్లీ: మన దేశంలో మొత్తం వ్యాధుల భారంలో 54 శాతానికి కారణం అనారోగ్యకర ఆహారమేనని ఆర్థిక సర్వే 2023-24 తెలిపింది. దేశంలో పెరుగుతున్న ఊబకాయ సమస్యపై ఆందోళన వ్యక్తం చేసింది. కొవ్వు, చక్కెరలతో ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం విపరీతంగా పెరగడంపై అప్రమత్తత అవసరమని పేర్కొన్నది. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పింది. మన దేశ వయోజనుల్లో ఇది తీవ్ర సమస్యగా పరిణమిస్తున్నదని హెచ్చరించింది. పని చేయగలిగే సామర్థ్యం గల జనాభా వల్ల సత్ఫలితాలను సాధించాలంటే, ప్రజలు సమతుల, వైవిధ్య భరితమైన ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యమని ఈ నివేదిక స్పష్టం చేసింది. భారత వైద్య పరిశోధన మండలి నివేదికను ఉటంకిస్తూ, కొవ్వు, చక్కెరలతో కూడిన హైలీ ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం పెరుగుతుండటం, దానితోపాటు శారీరక శ్రమ తగ్గిపోవడం ఊబకాయం సమస్యలకు దారితీస్తున్నట్టు వివరించింది.

పట్టణాల్లోనే అధికం

మన దేశంలో వయోజనుల్లో ఊబకాయం రేటు మూడు రెట్లు కన్నా ఎక్కువకు పెరిగిందని నివేదిక తెలిపింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో కన్నా పట్టణాల్లో ఊబకాయం సమస్య తీవ్రంగా ఉందని వెల్లడించింది.

'స్మార్ట్' మట్టి!

- 40 శాతం తక్కువ నీటి వినియోగం
- 138% అధికంగా పంట ఎదుగుదల
- టెక్సాస్ యూనివర్సిటీ ఆవిష్కరణ



వాషింగ్టన్, జూలై 22: నేటి టెక్ యుగంలో అన్నీ స్మార్ట్‌గా మారిపోతున్నాయ్. చివరికి మట్టి కూడా స్మార్ట్ అయిపోతున్నది. మీరు విన్నది నిజమే. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ పరిశోధకులు స్మార్ట్ మట్టిని ఆవిష్కరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తి జరుగడం లేదు. నీటి కొరత, ఎరువుల వినియోగం.. వ్యవసాయ రంగంలో అతిపెద్ద సవాల్‌గా మారాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు టెక్సాస్ వర్సిటీ పరిశోధకులు ప్రత్యేకంగా తయారుచేసిన 'హైడ్రోజెల్'ను మట్టిలో కలిపి 'స్మార్ట్ మట్టి'ని రూపొందించారు.

ప్రయోజనాలేంటి?

తక్కువ నీటితో పంట వేగంగా ఎదిగేలా చేయడమే ఈ స్మార్ట్ మట్టి ప్రత్యేకత. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో 'స్మార్ట్ మట్టి'లో పంటల సాగు ఆక్కడి జనాభా ఆహార అవసరాలను తీర్చుతుందని అధ్యయనం పేర్కొన్నది. హైడ్రోజెల్‌తో తయారుచేసిన 'స్మార్ట్ మట్టి'లో మొక్కలకు నీరు, పోషకాలు ఓ క్రమ పద్ధతిలో అందుతాయి. ల్యాబ్‌లో చేపట్టిన ప్రయోగాల్లో, నీటి వినియోగం 40 శాతం తగ్గింది. పంట ఎదుగుదలను 138శాతం పెంచింది. విస్తారమైన వ్యవసాయ క్షేత్రాల్లో ఈ కొత్త టెక్నాలజీతో ప్రయోగాలు చేయడానికి సైంటిస్టులు సిద్ధమవుతున్నారు.

పగటి నిద్రతో 'డిమెన్షియా' దూరం!



న్యూఢిల్లీ, జూలై 22: మధ్యాహ్నం వేళ ఓ కునుకు తీయటం కొంతమందికి అలవాటు! ఆఫీసుల్లోనూ మధ్యాహ్నం భోజనం తర్వాత.. డెస్క్‌లపై నిద్రపోయేవాళ్లు ఉంటారు. అయితే ఇలా పగటిపూట నిద్రపోవటం.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, అద్భుత ఫలితాలు వస్తాయంటూ 'యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూ' ప్రొఫెసర్ మొహమద్ ఇమ్రాన్ తన పుస్తకంలో పేర్కొన్నారు. పగటి నిద్రతో 'డిమెన్షియా' (మతిమరుపు) బారినపడే అవకాశం ఉండదన్న సంగతి సైన్స్ పరిశోధనలు కూడా చెబుతున్నాయని అన్నారు. జ్ఞాపకశక్తిని 'రీసెట్' చేస్తుందన్నారు. ఆయన రాసిన 'ఇమేజిన్: ఆర్టిఫిషియల్, రియల్ ఇంటెలిజెన్స్' పుస్తకం ప్రకారం, మెదడుకు సరైన పని చేయిస్తూ, కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడ్డా.. డిమెన్షియా బారినపడే ప్రమాదముందన్నారు. ప్రతి ఒక్కరూ తమ భౌతిక, శారీరక, ఆధ్యాత్మిక ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని సూచించారు. మెదడుకు ఒక క్రమపద్ధతిలో పని చెప్పటం.. దాని ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. మెదడు చురుగ్గా ఉండాలంటే దానికి కొంత విశ్రాంతి అవసరమని, అది నిద్ర ద్వారా లభిస్తుందని చెప్పారు. 'మన మెదడు నిరంతరం పనిచేయలేదు. దానికి కొంత సమయం నిద్ర ద్వారా విశ్రాంతి ఇవ్వాలి. అందునా పగటి నిద్రతో మెదడు పునరుత్తేజం పొందుతుంది. శారీరక, మానసిక వికాసంతో 'డిమెన్షియా' బారినపడే రిస్కును తగ్గిస్తుంది' అని ఇమ్రాన్ వివరించారు.



వృద్ధిరేటు డౌన్

ఈసారి జీడీపీ 6.5-7 శాతమే • ఆర్థిక సర్వే అంచనా

గతంలో కంటే దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనం

ధరల సెగ నేపథ్యంలో పేదలకు ఫుడ్ కూపన్లు, నగదు బదిలీ యోచన

చైనా ఎఫ్‌డీఐపట్ల మోదీ సర్కారు ఆసక్తి



చైనా నుంచి ఎఫ్‌డీఐలకు సంబంధించి ఆమోదయోగ్యమని కేంద్ర ప్రభుత్వం మరోసారి పరిశీలించాలని కోరుతున్నా. ... ఇప్పటికే చైనాతో భారత్ వాణిజ్యం ఎక్కువగా ఉన్నది. ... ఆర్థిక సర్వే సూచించినట్టు చైనా ఎఫ్‌డీఐలను అనుమతించాలి.

-వీ అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

చైనా నుంచి భారత్‌లోకి పెట్టుబడులు స్వల్ప కాలానికి ప్రయోజనం చేకూర్చినా.. దీర్ఘకాలంలో నష్టాలే మిగులుస్తాయి. ... చైనా సరఫరా వ్యవస్థ ...

-అజయ్ శ్రీవాస్తవ, గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు


న్యూఢిల్లీ, జూలై 22: దేశ జీడీపీ వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) 6.5-7 శాతం మధ్యే నమోదు కావచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లోని 8.2 శాతంతో పోల్చితే 1.7-1.2 శాతం తగ్గడం గమనార్హం. సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. అయితే మంగళవారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రకటించనున్న క్రమంలో దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని తెలిపే పక్కా కీలక సర్వేలో వృద్ధిరేటు అంచనాలు పడిపోవడం ఇప్పుడు మిశ్రమ ప్రభావాన్ని సంతరించుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికి అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (7.2 శాతం), ఇటు ఐఎంఎఫ్, ఏడీబీ (7 శాతం)లు విడుదల చేసిన అంచనాలకన్నా మోదీ సర్కారు అంచనా తక్కువగా ఉన్నదిమరి. కాగా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు.. భారత జీడీపీ వృద్ధి అవకాశాలను దెబ్బతీస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం ఈ సందర్భంగా పేర్కొన్నది. అయితే ఇన్నాళ్లూ ఆత్మనిర్భర్ భారత్ అంటూ ఊదరగొట్టిన బీజేపీ ప్రభుత్వానికి.. వాస్తవ పరిస్థితులు మింగుడుపడకుండా తయారయ్యాయన్న వాదనలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో దేశ వృద్ధిరేటును వాస్తవం కన్నా ఎక్కువచేసి చూపుతున్నారన్న పలువురు ప్రముఖ ఆర్థికవేత్తల అభిప్రాయాలకూ ఇప్పుడు బలం చేకూరుతున్నది. మొత్తానికి ఈసారి భారత జీడీపీ 7 శాతంలోపేనని మోదీ సర్కారు ముందస్తు సంకేతాలను ఈ తాజా సర్వేతో ఇచ్చేసింది.

ఆహార ద్రవ్యోల్బణాన్ని మినహాయించవచ్చు

వరుస ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూపోతున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు ఆర్థిక సర్వే ఓ కీలక సూచన చేసింది. వడ్డీరేట్లను నిర్ణయించేటప్పుడు ఆహార ద్రవ్యోల్బణాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం అనవసరమన్నది. గత ఏడాది ఏప్రిల్ నుంచి రెపో రేటును ఆర్బీఐ.. ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా గరిష్ఠ స్థాయి (6.5 శాతం) లోనే ఉంచుతున్న విషయం తెలిసిందే. 2016 నుంచి ద్రవ్యోల్బణ ఆధారిత ద్రవ్యవిధానాన్ని ఆర్బీఐ అవలంబిస్తూ వస్తున్నది. దీంతో బ్యాంక్ రుణాల వడ్డీరేట్లూ అత్యధిక స్థాయిలోనే ఉంటున్నాయి. ఫలితంగా రుణగ్రహీతలపై ఈఎంఐల భారం తడిసి మోపెడవుతున్నది. అలాగే ఆయా రంగాలకు నిధుల కొరత కూడా వేధిస్తున్నది. ఈ క్రమంలో ఇకపై ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని వడ్డీరేట్లపై నిర్ణయం తీసుకోవద్దని ఆర్బీఐకి కేంద్రం సూచించింది. ఇదిలావుంటే అధిక ఆహారోత్పత్తుల ధరలను ఎదుర్కొనేలా పేదలకు కూపన్లు లేదా నేరుగా నగదు బదిలీని కేంద్ర ప్రభుత్వం చేయాలని కూడా ఆర్థిక సర్వే సూచించింది. దీంతో వచ్చే నెల ఆర్బీఐ ద్రవ్య సమీక్షపై ప్రాధాన్యత ఏర్పడుతున్నది. ఇక వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున ఆహారోత్పత్తుల ధరలు దిగివస్తాయన్న ఆశాభావాన్ని కేంద్రం ఈ సందర్భంగా కనబర్చింది.

చైనా ఎఫ్‌డీఐలపై ఆశ

అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎగుమతులు పెరగాలన్నా.. స్థానికంగా తయారీ రంగం బలపడాలన్నా.. పొరుగు దేశం చైనా సహకారం అవసరమని ఆర్థిక సర్వేలో కేంద్రం పేర్కొనడం విశేషం. ఈ క్రమంలోనే చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)ను ఆకర్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అయితే సరిహద్దుల్లో చైనాతో కుస్తీ పడుతూ.. వ్యాపార రంగంలో దోస్తీ చేయాలన్న వింత వాదనపై ఇప్పుడు ఒకింత విస్మయం వ్యక్తమవుతున్నది. చైనా సంస్థలు భారత్‌లో పెట్టుబడుల ద్వారా పేద్దఎత్తునే ముందుకు వచ్చినా కొరతా పరిణామాలు సన్నగిల్లాయి ...



జీసీసీల రాకలో తెలంగాణ భేష్

దేశంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) సంఖ్య పెరుగుదలలో గత తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన విధానం భేష్ అని ఆర్థిక సర్వే కొనియాడింది. నేడు బహుళజాతి సంస్థలు భారత్‌లో తమ జీసీసీలను ఏర్పాటుచేసేందుకు ముందుకొస్తున్నాయంటే దాని వెనుక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ర్టాల కృషి ఎంతో ఉన్నదని ఆర్థిక సర్వే ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్.. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో చాలా సెంటర్ల ఏర్పాటుకు అనువైన పరిస్థితుల్ని కల్పించిన సంగతి విదితమే. దీంతో ఎన్నో ప్రముఖ సంస్థలు ఇక్కడ జీసీసీలను నెలకొల్పాయి. కాగా, 2012లో దేశంలో దాదాపు 720 జీసీసీలుండగా, 2023 నాటికి అవి 1,600లకు పెరిగాయి. ఐటీ, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఫైనాన్స్, టెలికం, ఏరోస్పేస్, ఆటోమోటివ్, హెల్త్‌కేర్, ఫార్మా, చమురు-గ్యాస్, టీబీవో, ఇంజినీరింగ్ ఉత్పత్తులకు ఇవి దన్నుగా నిలుస్తున్నాయి.

ఉద్యోగులకు శాపం ఏఐ

టెక్నాలజీ రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న కృత్రిమ మేధస్సు.. ఉద్యోగులకు శాపంగా మారింది. అన్ని రంగాల్లో ప్రతిభ కలిగిన ఉద్యోగులను ఈ టెక్నాలజీ మింగేస్తున్నదని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ఈ టెక్నాలజీతో భవిష్యత్తులో ఉద్యోగ కల్పనపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ తెలిపారు. కార్పొరేట్ రంగ సంస్థలు ఏఐ కార్మికుల స్థానభ్రంశం చేయడం కంటే కొత్తగా నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. మరోవైపు, ఐటీ రంగ సంస్థలు గత రెండేండ్లుగా ఉద్యోగ నియామకాలను తగ్గించాయని సర్వే వెల్లడించింది. ప్రస్తుతం సెంకడ్-తరానికి ప్రతిభ కలిగిన ఉద్యోగులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతున్నదని పేర్కొంది. మరోవైపు, 2030 నాటికి ప్రతియేటా వ్యవసాయేతర రంగాల్లో 78 లక్షలకుపైగా ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉన్నదని సర్వే అభిప్రాయపడింది. ఈ ఉద్యోగ కల్పనలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపింది.



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్టీల్ బ్యాంక్‌లోని పాత్రలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు (ఫైల్)

మెరిసిన సిద్దిపేట స్టీల్ బ్యాంక్

ఆర్థిక సర్వేలో ప్రత్యేక గుర్తింపు

> మొదటిపేజీ తరువాయి...

కార్యక్రమాలు జరిగిన ఈ స్టీల్ బ్యాంకులోని పాత్రలను కిరాయికి ఇస్తారు. తద్వారా ప్లాస్టిక్ నియంత్రణ మరింత కట్టుదిట్టంగానున్నది. ఈ స్టీల్ బ్యాంకులను ఆయా వార్డుల్లో స్వయం సహాయక బృందాలు నిర్వహిస్తున్నాయి. తద్వారా మహిళకు ఉపాధి లభించడంతోపాటు ప్లాస్టిక్ మహమ్మారిని నివారించడానికి ఓ మార్గం ఏర్పడినట్టు అయింది. ఇదే స్ఫూర్తితో సిద్దిపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయడంతోపాటు జాతీయ స్థాయిలోనూ బర్తన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసేయోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నది. కాలుష్య నియంత్రణకు సిద్దిపేట స్టీల్ బ్యాంక్ తీసుకుంటున్న చర్యలు ఎంతో ఆదర్శమని కేంద్రం ప్రశంసలు కురిపించింది.

ఒక చిన్న ఆలోచన ... ఈ ఆలోచనను రాష్ట్రంలో సాకారం చేసేందుకు ... సిద్దిపేట ప్రజల అద్భుత సహకారంతో ... ఆర్థిక సర్వేలో సిద్దిపేట స్టీల్ బ్యాంక్ భాగస్వామ్యం ... ప్రజా భాగస్వామ్యం వల్లనే ఇది సాధ్యమైంది, ఇందుకు సహకరించిన అధికారులకు, ప్రజలకు అభినందనలు

-తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

ఆర్థిక సర్వే ముఖ్యాంశాలు

- దేశీయ బొమ్మల పరిశ్రమ ఎగుమతులు పెరిగేందుకు చైనా బొమ్మల దిగుమతులపై కఠిన నిబంధనలు, కస్టమ్స్ సుంకాలను పెంచాలి.
- 2030కల్లా భారతీయ టెక్స్టైల్ పరిశ్రమ పరిమాణం 130 బిలియన్ డాలర్లను తాకాలంటే ఈ రంగంలో నైపుణ్యాభివృద్ధి, మరిన్ని నూతన ఆవిష్కరణలు అవసరం.
- తయారీ, వస్త్ర పరిశ్రమ, పర్యాటకం, రవాణా రంగాల్లో ఉత్పత్తి, ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహకాలతో నైపుణ్యాభివృద్ధిని అనుసంధానించాలి.
- కృత్రిమ మేధస్సు, రక్షణాత్మక పోరాటలు, సరఫరా ఆదాయంతో సేవా, తయారీ రంగాలు ప్రభావితమవుతున్న నేపథ్యంలో దేశీయ పర్యాటక రంగం ద్వారా వస్తున్న ఉద్యోగావకాశాల్ని ఒడిసి పట్టుకోవాలి.
- ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంతో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ విడిభాగాల పరిశ్రమల్లోకి రూ.67,690 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు.
- 2030కల్లా దేశీయ పునరుత్పాదక శక్తి రంగం 500 మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటే రూ.30.5 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం.
- భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో ఎగ్జానుతున్న సవాళ్లను అధిగమించాలంటే దేశీయ ఎగుమతిదారులు తమ సేవలను మరిన్ని ఇతర దేశాల్లోకి విస్తరించాలి.
- పట్టణీకరణతో ఇండ్లకు డిమాండ్ పెరుగుతున్నది. తద్వారా దేశీయ నిర్మాణ రంగం ఆశాజనకంగా నడుస్తున్నది. అయితే నిలిచిపోతున్న ప్రాజెక్టుల అంచనాలు పెరుగుతున్నాయి.
- పరిశ్రమ రూపుకల్పిన మార్గదర్శకాల్లో గ్రీన్ స్టీల్ కీలకపాత్ర. ఉక్కు పరిశ్రమ దిగుమతిపై తక్కువ పన్ను ...
- ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌లో పెరుగుతున్న రిటైల్ మదుపరుల భాగస్వామ్యం ఆందోళనకరం. జూద ప్రవృత్తిని పెంచేలా ఈ ట్రేడింగ్ ఉందని ...
- సోషల్ మీడియా, అనారోగ్య ఆహారం వంటి వాటిలో గణనీయంగా పెరుగుతున్న ప్రైవేట్ రంగ పెట్టుబడులు.. దీనివల్ల అనేక దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయి.
- భవిష్యత్తులో ఆదాయ అసమానతల్ని ఎదుర్కోవడంలో పన్ను విధానాలే కీలకం. ఉద్యోగ-ఆదాయాలపై ఏఐ వంటి వాటి ప్రభావం ఎక్కువవుతుంది.
- దేశ వాణిజ్య లోటు ముందుగా మరింత తగ్గుతుంది. అయా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతోపాటు దేశీయంగా తయారీ రంగ బలోపేతానికి అనుకూల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు కలిసొస్తాయి.
- డాటా సెంటర్, పెరుగుతున్న ఇంటర్నెట్ వినియోగం.. దేశంలో ఈ-కామర్స్ కార్యకలాపాల వృద్ధికి ప్రధాన ఆధారాలు.
- రవాణా ఖర్చులను తగ్గించడంలో పన్ను, సేవల పన్ను (జీఎస్టీ) ది ప్రధాన పాత్ర.
- ప్రపంచవ్యాప్తంగా తయారవుతున్న ఐఫోన్లలో భారత్ వాటా 14 శాతం. పెరుగుతున్న దేశీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు.
- గత రెండేండ్లుగా భారత్ నుంచి భారతీయ వాణిజ్య ఎగుమతులు మార్పులు. రిజర్వాయర్లలో పడిపోయిన నీటి నిల్వలు, పంట నష్టాలే కారణం.
- బియ్యం, గోధుమలు, ఉత్తర్వులు పప్పు దాన్యాలు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను ... పునరుద్ధరణ.
- భారతీయ స్టాక్ మార్కెట్ల పాత్ర ప్రధానం.
- ఈ ఏడాది దేశంలోకి మరిన్ని రెమిటెన్సులు. 124 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం.
- ఆర్థిక రంగ ముఖచిత్రం బాగున్నది. అయితే ఒడిదొడుకులపై అప్రమత్తత అవసరం.

ఓరుగల్లు కార్పెట్లు ఏపీకి..

పోచమ్మమైదాన్, జూలై 22: ఓరుగల్లు నేత కార్మికులు తయారు చేసిన కార్పెట్లకు ఆంధ్రప్రదేశ్‌లో డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నది. ప్రతి మాదిరి ... తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ (టెస్కో) ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఏపీ బెస్ట్ సెల్ అధికారి శ్రీనివాస్ పలు చేనేత సంఘాల నుంచి కార్పెట్లను కొనుగోలు చేశారు. కొత్తవాడ, ఆటోనగర్, ఉప్పుమల్లయ్య తోట, ఎల్బీనగర్‌లోని 15 సంఘాల నుంచి దాదాపు 20 వేల కార్పెట్లను ఖరీదు చేశారు. వీటి విలువ రూ.60 లక్షలకు పైనే.

అద్దెకు యూలూ బైకులు

హైదరాబాద్, జూలై 22: అద్దెకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించే బెంగళూరుకు చెందిన యూలూ.. తాజాగా హైదరాబాద్‌లో తన సేవలు ఆరంభించింది. ఈ సేవలను రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్ నవీన్ దాచూరి మాట్లాడుతూ.. ప్రస్తుతానికి స్విగ్గీ, జొమాటో, జెప్టోతోపాటు ఇతర డెలివరీ సంస్థలకు వాహనాలను లీజుకు ఇస్తున్నట్లు, భవిష్యత్తులో సాధారణ ప్రజలకు కూడా ఇచ్చే అవకాశం ఉన్నదన్నారు. గంటకు రూపాయి చొప్పున అద్దె వసూలు చేయనున్నారు.

లాభాల్లో దొడ్ల డెయిరీ

హైదరాబాద్, జూలై 22: దొడ్ల డెయిరీ ఆశాజనక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.65.02 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.34.97 కోట్లతో పోలిస్తే 86 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.918.53 కోట్లకు ఎగబాకింది.

ఫ్యూచరిస్టిక్ సెంటర్!

హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రాథమిక అంచనాకు వచ్చింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఇందుకోసం ఇన్ఫోఎడ్జ్ రూ.500 కోట్ల నిధులను సమకూర్చేందుకు ఏడైనా జాయింట్ సంస్థ ముందుకు వస్తే ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తామన్నట్లు మంత్రి చెప్పారు. సోమవారం సచివాలయంలో ఫ్యూచరిస్టిక్ సెంటర్‌పై పలువురు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ప్రజెంటేషన్‌ను మంత్రి తిలకించారు.

ట్రంప్‌ను ఓడించడమే లక్ష్యం

- డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ సాధించి, గెలుస్తా!
- కమలా హారిస్ ఆశాభావం

వాషింగ్టన్, జూలై 22: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా తనను అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిపాదించడం గొప్ప గౌరవం అని భారతీయ మూలాలున్న అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ తరఫున అధ్యక్ష నామినేషన్‌ను సాధించి, ఎన్నికల్లో గెలవాలన్నదే తన ఆశాభావం అని తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించడమే తన లక్ష్యమన్నారు. ట్రంప్‌ను ఓడించడంలో దేశాన్ని ఏకం చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని హారిస్ పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటున్నట్టు బైడెన్ ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్ పేరును ప్రతిపాదించారు. కాగా, అధ్యక్ష పోటీ నుంచి వైదొలుగుతున్నట్టు బైడెన్ ప్రకటించిన తర్వాత కమలా హారిస్ తొలి అధికారిక ప్రసంగం చేశారు. బైడెన్ గొప్ప నాయకుడని, ఆయన నాయకత్వానికి సాటిలేదని పేర్కొన్నారు.



కమలకు పలువురు డెమొక్రాట్ల నుంచి గట్టి పోటీ

బైడెన్ అధ్యక్ష ఎన్నికల నుంచి తప్పుకోవడంతో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా రేసులో కమలా హారిస్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. అయితే పార్టీ నామినేషన్ విషయంలో ఆమెకు పలువురు డెమొక్రాట్ల నుంచి పోటీ ఎదురయ్యే అవకాశం కనిపిస్తున్నది. అధ్యక్ష నామినేషన్ రేసులో కెంటుకీ, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా గవర్నర్లు ఆండీ బెషీర్, రాయ్ కూపర్, జోష్ షాపిరో, అరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీ పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇల్లినాయిస్, మిచిగాన్, కాలిఫోర్నియా గవర్నర్లు జేబీ ప్రిట్జకర్, గ్రెచెన్ విట్మర్, గవిన్ న్యూసోమ్ కూడా రేసులో ఉన్నారు.

ఆహారం కోసం సైనికులతో బలవంతంగా శృంగారం

సూడాన్‌లో మహిళల దైన్యస్థితి

ఖార్టూమ్, జూలై 22: యుద్ధంతో ఛిన్నాభిన్నమైన సూడాన్‌లో మహిళల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఆహారం కోసం వారు బలవంతంగా సైనికులతో శృంగారంలో పాల్గొనాల్సి వస్తున్నట్టు 'గార్డియన్' పత్రిక వెల్లడించింది. తమ కుటుంబాల పోషణ కోసం ఆహారాన్ని లేదా పరిమితంగా వచ్చే ఇతర వనరుల కోసం ... అదుపులో ఉన్న ఒమ్‌డర్మన్ నగరం నుంచి పారిపోయి వచ్చిన డజను మంది మహిళలు ఇంటర్వ్యూ ... నగరంలో ఆహారం నిల్వలున్న దాదాపు అన్ని ఫ్యాక్టరీలూ ... 'ఎంతో వృద్ధులైనా, పిల్లలతో ఉన్నవారైనా ఆహారం కోసం ... సైనికులతో ...' అంటూ ఓ మహిళ కన్నీటిపర్యంతమైనట్లు 'గార్డియన్' వివరించింది.

'కన్వర్' మార్గంలో నేమ్‌ప్లేట్ల ఏర్పాటుపై స్టే

న్యూఢిల్లీ, జూలై 22: కన్వర్ యాత్ర మార్గంలోని హోటళ్లు వాటి యజమానుల పేర్లను ప్రదర్శించాలన్న యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం మధ్యంతర స్టే విధించింది. 'ఆహారాన్ని అమ్మేవారు వారు అమ్మే ఆహార రకాలను ప్రదర్శించవచ్చు. కానీ తమ యజమానుల, సిబ్బంది పేర్లు ప్రదర్శించాలని బలవంతం చేయకూడదు' అని కోర్టు తెలిపింది. ఈ కేసు విచారణకు రాష్ట్ర ప్రభుత్వాల తరఫున ఎవరూ హాజరు కాలేదు. హోటళ్ల యజమానుల పేర్లు ప్రదర్శించడం కొన్ని వర్గాల మధ్య వైరుధ్యాన్ని తీవ్రం చేస్తుందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా, ఏపీసీఆర్ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం హోటళ్లు తమ యజమానుల పేర్లు ప్రదర్శించాల్సిన అవసరం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.

లఖింపూర్ కేసులో ఆశిష్ మిశ్రాకు బెయిల్

న్యూఢిల్లీ, జూలై 22: లఖింపూర్ ఖేరీ హింసాత్మక ఘటన కేసులో కేంద్ర మాజీ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ఆయన ఢిల్లీ లేదా లక్నోలో మాత్రమే ఉండాలని షరతు విధించింది. కేసు విచారణను వేగవంతం చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. 2021లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతులపైకి ఆశిష్ మిశ్రా కాన్వాయ్ దూసుకెళ్లడంతో నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఘటనలో మరో నలుగురు మృతిచెందారు. ఈ కేసులో గతేడాది జనవరి 25న కోర్టు మిశ్రాకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. 114 మంది సాక్షుల్లో కేవలం ఏడు మందిని ఇప్పటి వరకు విచారించడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. రోజుకు ఐదుగురు మందికి తక్కువ కాకుండా విచారణ చేయాలని ఆదేశించింది.

చాకొలెట్‌లో 4 కృత్రిమ దంతాలు

భోపాల్: చాకొలెట్‌లో నాలుగు కృత్రిమ దంతాలు కనిపించడంతో మాయా దేవి గుప్తా ఆశ్చర్యపోయారు. ఆమె మధ్య ప్రదేశ్‌లోని ఖర్గోన్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి, పదవీ విరమణ చేశారు. ఆనంతరం ఓ సంస్థలో స్వచ్ఛందంగా బోధిస్తూ పని చేస్తున్నారు. ఆ సంస్థలోనే ఓ బాలుని పుట్టిన రోజు సందర్భంగా తనకు ఓ చాకొలెట్ ఇచ్చారు. కొన్ని రోజుల తర్వాత ఆమె దానిని తిన్నారు. పోలర్ బ్రాండ్‌కు చెందిన ఆ చాకొలెట్‌లో 4 కృత్రిమ దంతాలు బయటపడ్డాయి. జిల్లా ఆహార భద్రత, ప్రమాణాల నియంత్రణ శాఖకు ఫిర్యాదు చేశారు. ఆ చాకొలెట్ శాంపిల్స్‌ను అధికారులు ... పరీక్షల కోసం పంపినట్టు అధికారులు తెలిపారు.

అరెస్టయిన నేతల వర్చువల్ ప్రచారానికి సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ: వివిధ కేసుల్లో అరెస్టయి, జైలులో ఉన్న రాజకీయ నేతలు ఎన్నికల్లో వర్చువల్‌గా ప్రచారం చేయడానికి అవకాశం కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన ఢిల్లీ హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని తెలిపింది. ఈ పిటిషన్‌ను న్యాయ శాస్త్ర విద్యార్థి అమర్‌జీత్ గుప్తా దాఖలు చేశారు.

వైద్యుల నిర్లక్ష్యం.. 20 ఏండ్ల తర్వాత పరిహారం

బెంగళూరు: శస్త్రచికిత్స సమయంలో ఆ మహిళ కడుపులో నిర్లక్ష్యంగా వదిలేసిన సర్జికల్ నీడిల్ వల్ల 20 ఏండ్లు తీవ్ర బాధ అనుభవించిన మహిళకు రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలంటూ కర్ణాటక వినియోగదారుల ఫోరం 20 ఏండ్ల తర్వాత ఆదేశించింది. బెంగళూరుకు చెందిన పద్మావతి 32 ఏండ్ల వయసులో హెర్నియా ఆపరేషన్ కోసం 2004 సెప్టెంబర్ 29న దీపక్ దవాఖానలో చేరింది. మరుసటి రోజు ఆమెకు అపెండిక్స్ కూడా తొలగించారు. ఆ తర్వాత రోజే ఆమె డిశ్చార్జి అయింది. అయితే కొన్నాళ్లకు ఆమెకు కడుపులో నొప్పి మొదలైంది. ఎన్నో దవాఖానలు తిరిగినా ఫలితం లేకపోవడంతో 2010లో మరో దవాఖానలో చూపించుకున్నది. స్కానింగ్ చేసిన వైద్యులు ఆమె పొత్తికడుపులో 3.2 సెంటీమీటర్ల సర్జికల్ నీడిల్‌ను ఉన్నట్టు గుర్తించి తొలగించారు. ఈ క్రమంలో ఆమె తనకు తొలుత ఆపరేషన్ చేసిన దీపక్ దవాఖాన వైద్యుల నిర్లక్ష్యంపై వినియోగదారుల కోర్టును ఆశ్రయించారు.

• సంగమేశ్వరాలయంలో చివరి పూజలు





నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల సమీపంలో సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలిసిన సంగమేశ్వరాలయంలో సోమవారం చివరి పూజలు నిర్వహించారు. అర్చకుడు రఘురామశర్మ వేపదార లింగానికి సప్తనదుల జలాలతో అభిషేకం చేశారు. గర్భగుడి ఎదుట నిత్యహారతి దీపాన్ని వెలిగించి సప్త నదులకు దీపహారతి సమర్పించారు. - కొల్లాపూర్

ఇరిగేషన్‌శాఖలో బదిలీల రగడ..

- సీనియర్లు జిల్లాలకు
- కేంద్ర కార్యాలయాలకు జూనియర్లు
- ఉన్నతాధికారుల తీరుపై ఇంజినీర్ల ఆగ్రహం

హైదరాబాద్, జూలై22 (నమస్తే తెలంగాణ): నీటిపారుదల శాఖలో బదిలీల అంశం ఇంజినీర్ల మధ్య రగడకు దారితీస్తున్నది. హైదరాబాద్ సర్కిల్‌లో చేపడుతున్న బదిలీలపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. జీవో 80 ప్రకారం కౌన్సెలింగ్ చేపట్టాలని, ఆప్షన్స్ పెట్టి ఉన్న ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకోవాలని స్పష్టంగా నొక్కిచెప్పింది. యూనిట్ పరిధిలో ఉన్న సర్కిల్స్‌కి, డివిజన్స్ జాబితాను విడుదల చేశారు. అందులో ఆయా కార్యాలయాల వారు తమ అభిప్రాయాలను, వర్క్ లోడ్, వారి కార్యాలయంలో అనుభవమున్న ఉద్యోగుల అవసరం తదితర వివరాలను నిబంధనల మేరకే సమర్పించారు. అదరిలో నివేదికను తుంగలో తొక్కారని ఇరిగేషన్ ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ యూనిట్‌లో ఉన్న కార్యాలయాల్లో అర్హతలు, అనుభవమున్న అధికారులను కాదని, జూనియర్లకు అవకాశం కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ సూపరింటెండింగ్ చక్రం తిప్పుతున్నారని ఆరోపిస్తున్నారు. సదరు ఉద్యోగి ఇప్పటికే అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయినా తీరు మార్చుకోవడంలేదని మండిపడుతున్నారు. ప్రభుత్వం బదిలీలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పదోన్నతులను సమీక్షించాలి

- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి తెలంగాణ విద్యుత్తు బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ వినతి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులను సమీక్షించాలని విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ సోమాజిగూడలోని విద్యుత్‌సౌధలో సోమవారం సీఎండీ రోనాల్డ్‌రోస్‌కు విజ్ఞప్తి చేశారు. రెండేండ్లుగా పదోన్నతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించాలని, అన్ని నిబంధనలు, కోర్టుల తీర్పులు ఇదే సూచిస్తున్నాయని చెప్పారు. సీనియార్టీలను గుర్తించని కారణంగా జూనియర్ లైన్‌మెన్ క్యాడర్‌లోనే 3,600 మందికి పదోన్నతి రావాల్సి ఉన్నదని తెలిపారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని సీఎండీ హామీ ఇచ్చినట్టు జేఏసీ నేతలు చెప్పారు. చైర్మన్ కుమారస్వామి, కన్వీనర్ వెంకన్నగౌడ్, కో చైర్మన్ సుధాకర్ రెడ్డి, కోకన్వీనర్ భానుప్రకాశ్, నాయకులు సంపత్‌రెడ్డి, హరిహర్, బ్రహ్మేంద్రరావు, శ్రీనివాస్, రాజేందర్, సదానందం, అశోక్‌కుమార్, విజయకుమార్, యాదగిరి, చంద్రయ్య, సోమల శివాజీ పాల్గొన్నారు. అలాగే విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులు కల్పించాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జేఏసీ రోనాల్డ్ రోస్‌కు వినతిపత్రం అందజేసింది. బీసీ ఈ జేఏసీ చైర్మన్ ప్రకాశ్, కన్వీనర్ శివాజీ, కో చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు.

పోస్టు స్మిత వ్యక్తిగతమా.. ప్రభుత్వ ఆలోచనా?

- రేవంత్‌రెడ్డి సర్కారు స్పష్టతనివ్వాలి
- ఎవరిని తీసుకోవాలో చెప్పే అధికారం ఆమెకెక్కడిది?
- ఉద్యోగంలో ఎన్నిసార్లు పరుగెత్తి పనిచేసినవ్?
- దివ్యాంగులకు స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి
- కోడ్ ఆఫ్ కండక్ట్ కింద ఆమెపై చర్యలు తీసుకోవాలి
- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాల లత



ఖైరతాబాద్, జూలై 22 : 'దివ్యాంగులు ఎయిర్‌లైన్స్‌లో పనికి రారు.. సివిల్ సర్వీసుల్లో అక్కరలేదు అని చెప్పే అధికారం ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు ఎక్కడిది? ఆమెకున్న అధికారం ఏమిటి? ఎవరిని సర్వీసులోకి తీసుకోవాలో చెప్పేందుకు ఆమె ఎవరు?' అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాల లత ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ దివ్యాంగులపై స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. ఓ ఐఏఎస్ అధికారి స్థాయిలో వ్యక్తిగతంగా ఈ వ్యాఖ్యలు చేశారా? లేక ప్రభుత్వ ఆలోచనగా చెప్పారా? అని నిలదీశారు. ఒకవేళ ప్రభుత్వం తరఫున చెప్పాలనుకుంటే కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పాటించారా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. కొందరు సివిల్ సర్వెంట్ ఉద్యోగులు తమ ఐడెంటిటీ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది కోడ్ ఆఫ్ కండక్ట్‌కు వ్యతిరేకమని చెప్పారు. ఆమె వ్యాఖ్యలు యావత్ దేశంలోని దివ్యాంగులను కించపరిచేలా ఉన్నాయని, దివ్యాంగ సమాజాన్ని అవమానపర్చే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు దివ్యాంగులు ఐఏఎస్, ఐపీఎస్ అయ్యేందుకు ఫిజికల్‌గా ఫిట్‌నెస్ కావాలా? లేక మెంటల్‌గానా అన్నది స్పష్టం చేయాలని, ఆమె ఉద్యోగంలో ఎన్నిసార్లు పరుగెత్తి పనిచేశారు?, ఎన్ని రోజులు ఫీల్డ్ వర్క్ చేశారో చెప్పాలని నిలదీశారు. సీఎం అయిన తర్వాత రేవంత్‌రెడ్డి మొట్టమొదటి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఓ దివ్యాంగురాలికి ఇచ్చారని, ఆమెకు అర్హత ఉందా? లేదా? చూసుకొని ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి

2016 దివ్యాంగుల చట్టం ప్రకారం దివ్యాంగుల గురించి ఇలా రాయడం నేరమని, ఆమెపై కండక్ట్ ఆఫ్ సివిల్ సర్వీస్ కింద చర్యలు తీసుకోవాలని బాల లత డిమాండ్ చేశారు. దివంగత మంత్రి జైపాల్‌రెడ్డి సౌత్ ఇండియా నుంచి బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డు తీసుకున్నారని గుర్తుచేశారు. జైపాల్‌రెడ్డి తన గురువు అని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఎవరూ దివ్యాంగ సర్టిఫికెట్‌తో ఉద్యోగాలు తెచ్చుకోలేదని, యూపీఎస్సీలో తనకు వచ్చిన మార్క్స్ షీట్స్ చూపిస్తానని చెప్పారు. ఐఏఎస్‌లు కావాలంటే అందగత్తెలు, ఐపీఎస్‌లు కావాలంటే జిమ్‌ట్రైనర్స్ సరిపోతారా? అని ప్రశ్నించారు. స్మితా సబర్వాల్ శారీరకంగా ఫిట్‌గా ఉన్నా ఆమెకు మానసిక స్థితి బాగా లేదని తెలుస్తున్నదని చెప్పారు. స్మితా సబర్వాల్ తన పోస్టుకు రాజీనామా చేసి వస్తే ఇద్దరం కలిసి మళ్లీ సివిల్స్ రాద్దామని, ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దామని, దివ్యాంగులతో కలిసి పరీక్ష రాయాలని సవాల్ చేశారు. 24 గంటల్లో ఆమె తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, దివ్యాంగుల సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. లేదంటే జైపాల్‌రెడ్డి స్మృతివనం వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోండి

- ఆమె బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- దివ్యాంగులు, వివిధ సంఘాల నాయకులు డిమాండ్
- డీజీపీకి వీహెచ్‌పీఎస్ నేతల వినతి
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు



నిరసన తెలుపుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్, అడివయ్య తదితరులు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి : దివ్యాంగులను కించపర్చేలా ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు చేశారని, ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతలు డీజీపీ జితేందర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వీహెచ్‌పీఎస్ చైర్మన్ అందె రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు గోశ్ జంగయ్య మాట్లాడుతూ 'దివ్యాంగులు విమానాలు నడుపగలరా? శస్త్ర చికిత్సలు సరైన పద్ధతిలో చేయగలరా? తగు సామర్థ్యాలు లేని వారిని ఆల్ ఇండియా సర్వీసుల్లోకి ఎలా తీసుకుంటారు' అని స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధపెట్టాయని తెలిపారు. అవమానించేలా మాట్లాడిన ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలసీకి వ్యతిరేకంగా మాట్లాడడమంటే నిబంధనలు ఉల్లంఘించడం కాదా? అని నిలదీశారు. ఆమెపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోర్ కమిటీ చైర్మన్ ఎల్ గోపాల్‌రావు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ ఖండన

స్మితా సబర్వాల్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని, దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. 'ప్రతిభ అనేది ఎవరి సొత్తు కాదు. వైకల్యాలు, శక్తి సామర్థ్యాలు మేధోశక్తిపై ప్రభావం చూపవు. ఓ ఐఏఎస్ అధికారి దివ్యాంగులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తన స్థాయిని దిగజార్చుకున్నట్టే. బ్రెయిలీ లిపిని అందించిన లూయిస్ బ్రెయిలీ మొదలు అనేక మంది సివిల్ సర్వెంట్లు, రాజకీయవేత్తలు, డాక్టర్లు వారి రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలను చాటుతూ ఉన్నతస్థాయి సేవ లందిస్తున్న వాస్తవం మనకండ్లముందున్నది' అని పేర్కొన్నారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకటేశ్, అడివయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన తెలిపారు. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో రిజర్వేషన్ అవసరం లేదని ప్రకటించడం ఆమె అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర సర్వీస్ నియమాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు తీర్పులున్నాయనే విషయం తెలియకుండా ఐఏఎస్ ఎలా అయ్యారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, ఎన్‌పీఆర్‌డీ నాయకులు మమత, వెంకటేశ్, ఎం.శోభన్, రమేశ్, జగదీశ్, గంగమ్మ, రాజు, పవన్, నర్సింగ్, శంకర్‌గౌడ్, శ్రీను, రఘు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

స్మిత సబర్వాల్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)కు కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ ఫిర్యాదు చేశారు. దేశంలోని కోట్లాదిమంది దివ్యాంగుల మనోభావాలను, భారత రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను భంగపరిచేలా స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి

దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి




హైదరాబాద్, జూలై22 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వీసెస్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరమా? అంటూ ఎక్స్ వేదికగా ఐఏఎస్ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు హేయమని, ఇది దివ్యాంగులను కించపరచడమేనని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి విమర్శించారు. వెంటనే ఆమె దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. దివ్యాంగులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను వద్దనే హక్కు ఆమెకు ఎక్కడిదని ప్రశ్నించారు. స్మితా సబర్వాల్‌పై దివ్యాంగుల హక్కుల రక్షణ చట్టం 2016 ప్రకారం కేసు నమోదు చేయాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌ఆర్‌ఆర్ పనుల్లో వేగం పెంచండి

కేంద్ర కార్యదర్శికి మంత్రి కోమటిరెడ్డి వినతి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) పనులు త్వరితగతిన చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్) కార్యదర్శి అనురాగ్ జైన్‌కు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో అనురాగ్ జైన్‌తో సమావేశమైన మంత్రి.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన అనురాగ్ జైన్.. వారంలో ఎస్ఎఫ్‌సీ ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన ఉన్నారు.



ప్రారంభానికి ముందే చెక్‌డ్యాంలో లీకేజీ

మద్దూర్ (కొత్తపల్లి), జూలై 22: నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం లింగాల్‌చేడ్ గ్రామ వాగులో రేవంత్ సర్కారు రూ.8.40 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనుల్లో కాంట్రాక్టర్ డొల్లతనం బయటపడింది. ఇటీవల కురిసిన వర్షాలతో అందులోకి నీళ్లు చేరగా లీకేజీ దర్శనమిచ్చింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్ సోమవారం చెక్‌డ్యాంను పరిశీలించారు. ఎక్స్‌ప్యాన్షన్ జాయింట్ వద్ద లీకేజీ ఉన్నదని గుర్తించారు. చెక్‌డ్యాంలో నీటిమట్టం తగ్గిన తర్వాత పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

ఉగ్ర గోదావరి.. కృష్ణమ్మ పరవళ్లు

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవాహం
- జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద
- రాబోయే రెండు రోజుల్లో మరింతగా పెరగనున్న వరద



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పిన్నపల్లిలో నీట మునిగిన పత్తి పంట

న్యూస్‌నెట్‌వర్క్/ హైదరాబాద్, జూలై22 (నమస్తే తెలంగాణ): కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి, కృష్ణా నదులు ఉప్పొంగుతున్నాయి. ప్రాణహిత నుంచి భారీగా వరద వచ్చి గోదావరిలో కలుస్తున్నది. లక్ష్మీబరాజ్ వద్ద 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. సోమవారం మధ్యాహ్నం వరకే 103.55 మీటర్ల మేర వరద ప్రవాహం నమోదు కావడంతో కాళేశ్వరం వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దిగువన ఇంద్రావతి, తాలిపేరు, కిన్నెరసాని నుంచి భారీగా వరద వస్తుండటంతో భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమేపీ పెరుగుతున్నది. నీటి ప్రవాహం 48 అడుగుల స్థాయికి చేరుకోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సోమవారం రాత్రి 10 గంటలకు గోదావరి ప్రవాహం 50.01 అడుగులకు చేరినట్టు అధికారులు తెలిపారు. వరద మరింత పెరిగే అవకాశముండటంతో ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు సైతం వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం భద్రాచలం వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. తొలుత కరకట్ట పనులను పర్యవేక్షించారు. తరువాత వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వరద సమీక్షలో ఆయన మాట్లాడారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఆర్డీవో దామోదర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు

కర్ణాటకలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతుండగా గేట్లన్నీ ఎత్తి దిగువ విడుదల చేస్తున్నారు. ఆయా ప్రాజెక్టులను దాటుకుని జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణమ్మ ప్రవహిస్తున్నది. ఆదివారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 1.11 లక్షల క్యూసెక్కుల వరద రాగా సోమవారం సాయంత్రానికి 1.69 లక్షల క్యూసెక్కులకు, శ్రీశైలం ప్రాజెక్టుకు 98 వేల క్యూసెక్కుల నుంచి 1.74 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం పెరిగింది. మరోవైపు తుంగభద్రకు భారీగా వరద వస్తుండటంతో 3 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. రాబోయే 24 గంటల్లో శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత వరద ప్రవాహం పెరిగే అవకాశముంది.

వివిధ ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఆదివారం నాటి నీటిమట్టం వివరాలు

	రిజర్వాయర్	ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో	ప్రస్తుతమట్టం అడుగుల్లో	పూర్తిస్థాయినిల్వ టీఎంసీల్లో	ప్రస్తుతనిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
కృష్ణా బేసిన్	ఆల్మట్టి	1705.00	1698.56	129.72	97.23	1,37,000	1,50,000
	నారాయణపూర్	1615.00	1610.96	37.64	32.14	1,45,000	1,44,250
	ఉజ్జయిని	1630.00	1604.86	117.24	51.71	8,631	192
	జూరాల	1045.00	1040.72	9.66	7.65	1,69,000	1,45,410
	తుంగభద్ర	1633.00	1627.21	105.79	87.42	1,04,972	13,059
	శ్రీశైలం	885.00	827.60	215.81	52.15	1,74,717	0
	నాగార్జునసాగర్	590.00	504.10	312.05	121.38	0	9,378
	పులిచింతల	175.00	101.11	45.77	0.87	281	0
గోదావరి బేసిన్	సింగూరు	1717.93	1704.63	29.91	13.63	391	391
	నిజాంసాగర్	1405.00	1387.72	17.80	03.22	620	0
	శ్రీరాంసాగర్	1091.00	1068.72	90.31	21.37	20,518	0
	కడెం	700.00	690.68	7.60	5.52	4,859	3,002
	ఎల్లంపల్లి	485.56	470.47	20.18	10.56	24,433	0
	మిడ్‌మానేరు	1043.31	1002.20	27.50	05.75	1682	62
	లోయర్‌మానేరు	920.00	887.70	24.07	05.40	956	204
కాళేశ్వరం ప్రాజెక్ట్	లక్ష్మీ (మేడిగడ్డ)	100	97.55	16.17	2.8	9,54,600	9,54,600
	సమ్మక్కబరాజ్	83	84.1	6.94	3.2	10,15,170	10,15,170
	సీతమ్మసాగర్	63	54.8	36.57	0.2	11,86,801	11,86,801

ముంచెత్తిన వరద

దహెగాం/నెన్నెల/వేమనపల్లి/కోటపల్లి/చింతలమానేపల్లి, జూలై 22: ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు నదులు, ప్రాజెక్టులు, వాగులు.. వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా.. పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. దహెగాం మండలంలో ప్రాణహిత, పెద్దవాగు బ్యాక్‌వాటర్‌తో రావులపల్లి, మొట్లగూడ, రాంపూర్, దిగడల్లో వెయ్యి ఎకరాల పత్తి నీట మునిగింది. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో చేలల్లో ఇసుక మేటలు వేశాయి. మొలకలు కొట్టుకుపోయి నష్టం వాటిల్లింది. సోమవారం మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ పంటలను పరిశీలించారు. కల్లెంపల్లి, ముక్కిడిగూడెం, జాజాలపేట, రాచర్ల సమీపంలో 400 ఎకరాల్లో పత్తి పంటలు మునిగిపోయాయి. కోటపల్లి మండలంపిన్నపల్లి, సూపాక, అలుగామ, జనగామ, పుల్లగామ, సిర్సా, అన్నారం, ఎదుల్లబంధం, అర్జునగుట్టలో 864 ఎకరాల పంటలకు నష్టం జరిగినట్టు కోటపల్లి ఏవో తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దిందా-కేతిని వాగు ప్రాణహితతో పాటు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దిందా నాలుగో రోజూ జలదిగ్బంధంలోనే ఉంది. గూడెం-అహేరి అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రాణహిత నిండుగా ప్రవహిస్తున్నది. ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

అధికారుల తప్పుంటే శిక్ష తప్పదు

- అప్రమత్తంగా ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు
- 'పెదవాగు' తక్షణ సహాయానికి రూ.8.50 కోట్లు
- అశ్వారావుపేట పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అశ్వారావుపేట టౌన్, జూలై 22: పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోవడం తీరని నష్టమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విచారం వ్యక్తంచేశారు. అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఇంతటి ప్రమాదం వాటిల్లేదికాదని అన్నారు. తక్షణ సహాయ చర్యల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.8.50 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు ఆకివీడు తెగి ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజలు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో మంత్రి పొంగులేటి సోమవారం పర్యటించారు. కొట్టుకుపోయిన పంటలను, ఇసుక మేటలు వేసిన పొలాలను, దెబ్బతిన్న ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మాట్లాడారు. ఈ ప్రాజెక్టు కింద 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా.. రాష్ట్రంలో 3,200 ఎకరాలు మాత్రమే సాగవుతున్నాయని, మిగిలిన 13 వేల ఎకరాలు ఆంధ్రాలోనే సాగవుతున్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టుపై ఏపీ శ్రద్ధ చూపకపోవడంతో తెలంగాణ ప్రభుత్వమే రూ.2.5 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. అధికారుల నిర్లక్ష్యంపై విచారణ చేపడతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో 400 ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని, ఇసుక మేటలను తొలగించేందుకు ఎకరానికి రూ.10 వేలు అందజేస్తామని చెప్పారు. పొంగులేటి రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నీటమునిగిన గుడిసెకు రూ.10 వేలు, ఆర్‌సీసీ స్లాబ్ ఇండ్లకు రూ.5 వేలు సాయంగా అందిస్తామని తెలిపారు.

స్మార్ట్ సిటీల్లో తెలంగాణకు అన్యాయం

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని, స్మార్ట్ సిటీల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీల అమలుకు నిధులు కేటాయించేలా రాజకీయాలకు అతీతంగా చొరవ చూపాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయి గురించి అడుగుతున్నామని, కేంద్రానికి సహకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగానే ఉన్నదని స్పష్టం చేశారు.

మూసీ అభివృద్ధికి 10 వేల కోట్లివ్వండి

- జల్ జీవన్ మిషన్‌కూ నిధులు విడుదల చేయండి
- ఓఎంసీలకు ముందుగానే గ్యాస్ సబ్సిడీ చెల్లించే అవకాశమివ్వండి
- పౌర సరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి
- కేంద్రానికి సీఎం రేవంత్ వినతులు



కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్‌పూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం చేపట్టే మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక కింద రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీనదిని దేశంలో మరెక్కడా లేనివిధంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్దీప్‌సింగ్ పూరీ, ప్రహ్లాద్‌జోషితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. మూసీలో కలిసే మురుగునీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు, గోదావరి జలాలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో నింపే ప్రాజెక్టులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. జల్‌జీవన్ మిషన్ కింద తెలంగాణకు నిధులు విడుదల చేయాలని కోరారు. తెలంగాణలో రూ.500కే గ్యాస్ సరఫరాకు సంబంధించిన సబ్సిడీని ముందుగానే ఓఎంసీ చెల్లించే సదుపాయాన్ని కల్పించాలని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పూరికి సీఎం విన్నవించారు. సమావేశంలో ఖమ్మం, జహీరాబాద్ ఎంపీలు రామసహాయం రఘురామిరెడ్డి, సురేశ్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సభకు రండి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ నేపథ్యంలో ఈ నెలాఖరున నిర్వహించతలపెట్టిన సభకు రావాలని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంకను ఆహ్వానించినట్టు సమాచారం. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ బృందం ఆహ్వానించినట్టు తెలిసింది.

విస్తరణ, పీసీసీ ఊసే లేదు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ పెద్దలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర నేతలు బిజీగా ఉండటంతో పాటు ఆషాఢ మాసం కారణంగా రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకంపై చర్చించలేదని సమాచారం. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాక శ్రావణమాసంలోనే నిర్ణయం తీసుకుందామని సీఎం ఆదిస్థానం ముందే చెప్పడంతో వాటిని ప్రస్తావించలేదని తెలిసింది. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై సీఎం తన అభిప్రాయాన్ని అధిష్ఠాన పెద్దలకు తెలియజేయడంతో నిర్ణయాన్ని వారికే వదిలేసినట్టు సమాచారం.

జిందగీ
ఊపిరి
నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 23 జులై 2024
www.ntnews.com



మీరు మామూలుగా ఉన్నప్పటికీ తల తిరిగినట్టుగా ఉండటం, లేదంటే పరిసరాలు తిరుగుతున్నట్టుగా అనుభూతి చెందడాన్ని వర్టిగో అంటారు. వర్టిగో సాధారణంగా మన లోపలి చెవిలో ఏదైనా సమస్య ఉన్నప్పుడు తలెత్తుతుంది. అంతేకాకుండా, ఇన్ఫెక్షన్లు, మైగ్రేన్స్, మెదడులో ట్యూమర్ లేదంటే, స్ట్రోక్ వచ్చినప్పుడు కూడా తలెత్తుతుంది. సమస్య కారణాన్ని బట్టి వైద్యులు చికిత్స అందిస్తారు. ఈ మధ్య కాలంలో చాలామంది వర్టిగోతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు వర్టిగో అంటే ఏంటి? ఎందుకు వస్తుంది? దీనికి గల కారణాలేంటి? ఈ సమస్యను ఎలా గుర్తించాలి? అందుబాటులో ఉన్న చికిత్స విధానాల గురించి నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

వర్టిగో.. డోన్ట్ వర్రీ



నిజానికి వర్టిగో అనే దుర్బల సర్వసాధారణం అనే చెప్పాలి. ఈ మధ్యకాలంలో చాలామంది ఈ సమస్యతో వైద్యుల దగ్గరికి వస్తున్నారు. వర్టిగో సమస్య తలెత్తినప్పుడు సాధారణంగా తల తిరిగినట్టుగా అనిపిస్తుంది, లేదంటే మన చుట్టూ ఉన్న పరిసరాలు తిరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. అయితే, ఈ సమస్య దానంతట అదిగా వస్తుంది. లేదంటే ఇతర అనారోగ్య సమస్యల కారణాల వల్ల కూడా తలెత్తే అవకాశం ఉంటుంది. వర్టిగో ప్రధానంగా పెరిఫెరల్ వర్టిగో, సెంట్రల్ వర్టిగో అని రెండు రకాలు.

పెరిఫెరల్ వర్టిగో

పెరిఫెరల్ వర్టిగో సమస్య చాలామందిలో సర్వసాధారణం. చెవిలో ఉండే ఇన్నర్ ఇయర్‌గాని లేదా వినికిడికి సంబంధించిన నరం ప్రభావితమైతే దానిని పెరిఫెరల్ వర్టిగో అంటారు. ప్రధానంగా 4 కారణాల వల్ల పెరిఫెరల్ వర్టిగో రావొచ్చు. అవి... బినైన్ పెరాక్సిస్మల్ పొజిషనల్ వర్టిగో (బీపీపీవీ), రెండోది లాబ్రింథైటిస్, మూడోది వెస్టిబ్యులర్ న్యూరైటిస్, నాలుగోది మినియర్స్ డిసీజ్.

బినైన్ పెరాక్సిస్మల్ పొజిషనల్ వర్టిగో (బీపీపీవీ): బీపీపీవీ అనేది పెద్ద ప్రమాదకారేమీ కాదు. దీనివల్ల పక్కకు తిరిగి పడుకున్నప్పుడు కళ్లు తిరిగినట్టుగా ఉంటుంది. అంటే పడుకునే పొజిషన్ మారినప్పుడు ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది.

లాబ్రింథైటిస్: చెవి లోపల ఉండే లాబ్రింథ్స్ దెబ్బతినడం వల్ల వర్టిగోతో పాటు వినికిడి సామర్థ్యం కూడా తగ్గుతుంది. ఇది ఏ వయసు వారికైనా రావచ్చు.

వెస్టిబ్యులర్ న్యూరైటిస్: చెవికి సంబంధించిన నరం దెబ్బతినడం వల్ల వెస్టిబ్యులర్ న్యూరైటిస్ వర్టిగో సమస్య వస్తుంది.

మినియర్స్ డిసీజ్: ఇది కూడా లోపలి చెవి దీర్ఘకాలికంగా దెబ్బతినడం వల్ల వస్తుంది. దీనివల్ల తల తిరగడంతోపాటు వినికిడి శక్తి తగ్గుతుంది. అంతేకాకుండా చెవిలో గుయ్యిమంటూ శబ్దం వస్తుంది. దీని కారణంగా కొన్నిసార్లు వాంతులు కూడా అవుతుంటాయి.

సెంట్రల్ వర్టిగో

మెదడు దెబ్బతినడం వల్ల సెంట్రల్ వర్టిగో సమస్య తలెత్తుతుంది. అంటే మెదడుకు ఏదైనా ఇన్ఫెక్షన్ సోకినప్పుడు గానీ లేదా రక్త ప్రసరణ వ్యవస్థ దెబ్బతినడం వల్ల, లేదంటే తలకు ఏదైనా దెబ్బ తగలడం వల్ల సెంట్రల్ వర్టిగో రావచ్చు. సాధారణంగా సెంట్రల్ వర్టిగో ఉన్నవారు నడవడానికి ఇబ్బంది పడుతుంటారు.

వర్టిగో లక్షణాలు

- తల తిరగడం లేదా కళ్లు తిరగడం
- వాంతులు వచ్చినట్లు అనిపించడం
- తల తేలికగా ఉండడం
- వినికిడి శక్తి తగ్గడం
- చెవుల్లో గుయ్యిమంటూ శబ్దం రావడం
- తీవ్రమైన తలనొప్పి
- చెవిలో ఏదో ఉన్న అనుభూతి

నిర్ధారణ పద్ధతులు

- ముందుగా రోగిని పరీక్షించి, కొన్ని రకాల ప్రశ్నలతో వ్యాధిని అంచనా వేయవచ్చు.
- క్లినికల్ ఎగ్జామినేషన్‌లో కొన్ని రకాల పరీక్షలు.. అంటే హెడ్ ఇంపల్స్ టెస్టుల ద్వారా కూడా వర్టిగోను నిర్ధారించవచ్చు.
- ఆడియోమెట్రీ పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు.
- సీటీ స్కాన్ చేయడం ద్వారా.
- ఎంఆర్ఐతో సైతం వర్టిగోను నిర్ధారించవచ్చు.

ప్రధాన కారణాలు

- పార్శ్వపునొప్పి కారణంగా వర్టిగో రావచ్చు.
- కొన్ని రకాల యాంటీబయాటిక్స్, వాపు తగ్గేందుకు వాడే మందులు, గుండె సంబంధిత మందులు తీసుకుంటే కూడా వర్టిగో వచ్చే అవకాశాలు ఉంటాయి.
- బ్రెయిన్ స్ట్రోక్ వల్ల.
- తలకు ఏదైనా గాయం అయినప్పుడు.
- చెవి నరానికి సంబంధించిన అకాస్టిక్ న్యూరోమా కారణంగా.
- రక్తపోటు (బీపీ) తగ్గితే కూడా వర్టిగో రావచ్చు.

వర్టిగో వల్ల అనర్థాలు

- వర్టిగో వల్ల రోగి తూలిపడి కిందపడే అవకాశాలు ఎక్కువ. దీని కారణంగా కింద పడినప్పుడు ఎముకలు విరిగిపోవచ్చు.
- కొన్నిసార్లు రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడవచ్చు.


చికిత్స విధానం

- డాక్టర్లు రోగితో కొంత సమయం కేటాయించి, వ్యాధి నేపథ్యం తెలుసుకోవాలి. ఆ వివరాల ఆధారంగా కొన్ని పద్ధతులతో చికిత్స చేయవచ్చు. ముఖ్యంగా పెరిఫెరల్ వర్టిగోకు రీపొజిషనింగ్ మాన్యువర్‌తో సమస్య నుంచి ఉపశమనం కలిగించవచ్చు.
- కొన్ని రకాల మందులతో కూడా వర్టిగో లక్షణాలను తగ్గించవచ్చు. వెస్టిబ్యులర్ రీహాబిలిటేషన్ థెరపీ ద్వారా పెరిఫెరల్ వర్టిగోను తగ్గించుకోవచ్చు. ఈ రోగులకు శస్త్రచికిత్స చాలా అరుదుగా అవసరమవుతుంది.

డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలి?

వర్టిగో లక్షణాలు ఎక్కువగా కనిపించినా, వర్టిగోతోపాటు ఛాతీలో నొప్పి గాని, గుండెలో దడ గాని, లేదా తలనొప్పి గాని, నడుస్తుంటే తూలడం, జ్వరంతోపాటు తల తిరుగుతున్నా, చూపులో తేడా వచ్చినా, ఒక చెయ్యి, కాలు బలహీనమైనా వెంటనే వైద్యులను సంప్రదించాలి. వర్టిగో అనేది ఆకస్మాత్తుగా రావచ్చు. దీనివల్ల ఆందోళన కలగవచ్చు. పైగా వర్టిగో ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించకుండానే వస్తుంది. ఈ సమస్య భయం కలిగించినప్పటికీ చాలాసార్లు ఎంతో సులువుగా తగ్గిపోతుంది. కానీ ఇది ఎక్కువసేపు ఉంటే, అందుకు ఇతర అనారోగ్య సమస్యలు కారణమై ఉండవచ్చు. అంతేకాకుండా వర్టిగో కారణంగా రోజువారీ జీవితం కొంత ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉంటాయి.

...✍ మహేశ్వర్‌రావు బండారి



డాక్టర్ జి.వి.సుబ్బయ్య చౌదరి
సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్
యశోద హాస్పిటల్, హైటెక్‌సిటీ


సర్వైకల్ టీకాలు

సుధామూర్తి సూచనలు

ఇటీవల రాజ్యసభలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మాజీ చైర్‌పర్సన్ సుధామూర్తి ఓ ప్రభావవంతమైన ప్రసంగం చేశారు. ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమెను రాజ్యసభకు నామినేట్ చేశారు. మహిళలను పట్టిపీడిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైన గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ గురించి సుధామూర్తి ప్రభుత్వాల విధానాలు ఎలా ఉండాలో పెద్దల సభ వేదికగా అమూల్యమైన సూచనలు చేశారు.



రాజ్యసభలో నా మొదటి ప్రసంగం సందర్భంగా నా హృదయానికి దగ్గరగా ఉండే అంశం గురించి ప్రస్తావించాలని అనుకుంటున్నాను. డాక్టర్ల కుటుంబం నుంచి వచ్చిన నేను, మహిళల ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనదని, అయితే అది నిర్లక్ష్యానికి గురయిందని గ్రహించాను. ఈ అంగాలే మహిళలకు సురక్షితమైన ఆరోగ్యరక్షణ వ్యవస్థను సృష్టించాల్సిన ప్రాధాన్యత గురించి నాకు నేర్పించాయి.



ప్రస్తుతం భారతదేశపు మహిళల్లో క్యాన్సర్ మరణాలకు కారణమవుతున్న వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రెండోది. కాబట్టి, మహిళలకు చిన్నతనంలోనే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టీకాను అందుబాటులో ఉంచడం అనేది ఈ విషయంలో మార్పునకు వేసే తొలి అడుగుగా భావించాలి.

ఈ వ్యాధి ప్రబలంగా ఉండటానికి ప్రధానంగా... అవగాహన లేకపోవడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల అందుబాటు తక్కువగా ఉండటం, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యరక్షణ మౌలిక వసతులు తగినన్ని లేకపోవడం లాంటివి కారణాలుగా నిలుస్తాయి. అయితే, దీనికి ప్రాథమిక ముఖ్య కారణం మాత్రం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఇన్ఫెక్షన్.

కాగా, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా జాగ్రత్త వహించే- ప్రివెంటివ్ కేర్ విషయంలో సామాజిక- ఆర్థిక అంతరాలు, సాంస్కృతిక అవరోధాలు ముప్పును మరింత పెంచుతున్నాయి. కాబట్టి, సర్వైకల్ క్యాన్సర్‌పై పోరాటంలో ప్రభుత్వం స్వయంగా టీకా కార్యక్రమం చేపట్టాలి.

తొమ్మిది నుంచి పద్నాలుగేండ్ల వయసు బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే టీకాలు ఇస్తున్నారు. కాబట్టి మన బాలికలకు ప్రయోజనం కలిగించే ఈ టీకాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చికిత్స కంటే వ్యాధి రాకుండా నివారించడం మంచిది కదా!

కొవిడ్-19 సమయంలో ప్రభుత్వం టీకాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. 9 నుంచి 14 ఏండ్ల అమ్మాయిలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టీకా కార్యక్రమం కూడా ప్రభుత్వమే చేపడితే బాగుంటుంది.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టీకాలు బాగా పనిచేస్తున్నాయి. పైగా అవంత ఖరీదైనవి కూడా కాదు. ఇప్పుడు 1,400 రూపాయలు ఉన్న టీకా ఖరీదును 700 నుంచి 800 రూపాయలకు తగ్గించగలగాలి. ఈ దిశగా ప్రభుత్వం టీకా తయారీదారులతో మాట్లాడి ఒప్పించాలి. ఇది మన బాలికల భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.



పుట్టుకతోనే వినికిడి లోపమా?



డాక్టర్‌గారూ! నేను ప్రస్తుతం ఏడు నెలల గర్భిణిని. ప్రతినెలా డాక్టర్‌ను సంప్రదిస్తున్నాను. అన్ని పరీక్షలూ చేయించుకుంటున్నాను. స్కానింగ్, బ్లడ్ రిపోర్ట్ అన్నీ బాగున్నాయని చెప్పారు. అయితే, మావారి తమ్ముడికి పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్నది. దాంతో అతనికి మాటలు కూడా రాలేదు. సైగల ద్వారా మాట్లాడుతాడు. మాకు పుట్టబోయే బిడ్డకూ అటువంటి రిస్క్ ఉంటుందా? అలా కాకుండా ఉండాలంటే ఏం చేయాలి? సలహా ఇవ్వండి.

• ఓ పాఠకురాలు.

మీరు చెప్పింది నిజమే! పుట్టే ప్రతి వెయ్యి మంది శిశువుల్లో ఒక్కరి నుంచి ముగ్గురికి పుట్టుకతోనే వినికిడి లోపం ఏర్పడే రిస్క్ ఉంటుంది. ప్రధానంగా మీ విషయంలో మీవారి తమ్ముడికి అలాంటి ఇబ్బంది ఉందని మీరే చెబుతున్నారు. తప్పకుండా.. మీరు ఈ విషయాన్ని మీ డాక్టర్‌కు, ముఖ్యంగా బేబీ పుట్టిన తర్వాత పరీక్షించే పీడియాట్రీషియన్‌కు చెప్పడం ముఖ్యం. వారు వెంటనే హియరింగ్ స్క్రీనింగ్ చేస్తారు. అంటే.. వినికిడి లోపం ఉన్నదా? లేదా? అనేది తెలుసుకునేందుకు చేసే పరీక్ష. ఇది తప్పకుండా చేయించాలి. ఈ సమయంలోనే ఏదైనా సమస్య ఉన్నట్టు గుర్తిస్తే.. వైద్యులు వెంటనే తగిన చికిత్స ప్రారంభిస్తారు. దాంతో బిడ్డ వినికిడి లోపాన్ని అధిగమించే అవకాశం ఉంటుంది. మీ విషయంలోనే కాకుండా, ప్రతి ఒక్కరూ బిడ్డ పుట్టిన వెంటనే సార్వత్రిక వినికిడి పరీక్ష (యూనివర్సల్ హియరింగ్ స్క్రీనింగ్) చేయించడం ముఖ్యం. ఎందుకంటే, ఎవరికైనా సరే మనం తొలినెలలోనే వినికిడి సమస్యను గుర్తించగలిగితే, వెంటనే చికిత్స ప్రారంభించి, వారు జీవితాంతం చెవిటి - మూగ కాకుండా చూసే అవకాశం ఉంటుంది. భాష అనేది వినికిడి పైనే ఆధారపడి ఉంటుంది. మనం వినలేకపోతే.. మాట్లాడలేం కూడా! కాబట్టి, పుట్టిన నెలలోపే బిడ్డకు వినికిడి సమస్యకు సంబంధించిన పరీక్ష చేయించాలి. రెండు నెలలలోపు సమస్యను నిర్ధారించి, మూడు నెలల వరకు సరైన చికిత్స అందించాలి. అయితే, చాలావరకు తల్లిదండ్రులు.. 'మా పిల్లవాడు ఉలిక్కిపడుతున్నాడు. మట్టి పాత్రలు/చప్పట్లకు ప్రతిస్పందిస్తున్నాడు. హియరింగ్ స్క్రీనింగ్ అవసరం లేదు!' అనుకుంటారు. అది కరెక్ట్ కాదు. బయటి చప్పుళ్లకు బిడ్డ ఉలిక్కిపడుతున్నా.. పూర్తిగా ఏ సమస్యా లేదని మనకు మనమే నిర్ణయించలేం. హియరింగ్ స్క్రీనింగ్ చేయించడం తెలివైన పని. ఒకవేళ ఏదైనా సమస్య ఉంటే.. దాన్ని కనిపెట్టగలిగితే, ఆ బిడ్డకు కొత్త జీవితం ఇచ్చినవాళ్లం అవుతాం. మీ విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయకండి. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఈ హియరింగ్ పరీక్షలు అందుబాటులో ఉండకపోవచ్చు. అందుకే, ప్రైవేట్‌గానైనా చేయించుకోవడం మంచిది.

పిల్లల పెంపకం



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

ఎంతోకాలం ఎదురుచూసినప్పటికీ సంతానం కలగకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది దంపతులను నిరాశ నిస్పృహలకు లోనుచేస్తుంది. అయితే, ఇటీవలి కాలంలో స్త్రీలలో సంతాన సఫలతకు సంబంధించిన చికిత్సలు, సాంకేతికతల్లో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తున్నది. దీంతో సంతాన యోగానికి అవకాశాలు పెరుగుతున్నాయని వైద్య రంగ నిపుణులు చెబుతున్నారు.

సాంకేతిక సాయం సంతాన యోగం



గొనాడోట్రాఫిన్స్: కొంతమంది స్త్రీలలో అండాలు క్రమం తప్పకుండా విడుదల కావు. లేదంటే పూర్తిగా అభివృద్ధి చెందకుండానే విడుదల కావొచ్చు. ఇలాంటి వారికి గొనాడోట్రాఫిన్స్ ప్రయోజనకరంగా ఉంటాయి. శరీరంలో కీలక గ్రంథి అయిన పీయూష గ్రంథిని గొనాడోట్రాఫిన్స్ ప్రేరేపిస్తే స్త్రీల అండం విడుదలయ్యే సమయాన్ని సరిచేయవచ్చు. దీంతో అండం పూర్తిగా పరిపక్వత చెందిన తర్వాత విడుదలయ్యే అవకాశాలు మెరుగుపడతాయి.

క్లోమిడ్: అండాల ఉత్పత్తి కాని మహిళల్లో క్లోమిడ్ కూడా పీయూష గ్రంథికి సహకరిస్తుంది. క్లోమిడ్‌తో చికిత్స చేసినప్పుడు అండాశయంలో ఉండే ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (ఎఫ్ఎస్‌హెచ్) స్పందించడం మెరుగుపడుతుంది. దీంతో పిల్లలు పుట్టడానికి అవకాశాలు పెరుగుతాయి.

లెట్రోజోల్: ఇక మెనోపాజ్ తర్వాత స్త్రీలలో రొమ్ము క్యాన్సర్ చికిత్సకు లెట్రోజోల్‌ను ఉపయోగిస్తారు. ఈ లెట్రోజోల్ స్త్రీలలో తలెత్తే పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ కారణంగా సంతాన సఫలతకు నోచుకోని వారికి ఉపయోగకరంగా ఉండొచ్చు అంటున్నారు వైద్యులు. లెట్రోజోల్ కూడా పీయూష గ్రంథి మీద ప్రభావం చూపుతుంది.

మూలకణ చికిత్స: స్త్రీలలో సంతాన సఫలతకు మూలకణాల (స్టెమ్‌సెల్స్) చికిత్స కూడా ఉపయోగకరంగా ఉంటుంది. మూలకణాలను ఎముక మూలుగ, లేదంటే కొవ్వు కణజాలం నుంచి సేకరిస్తారు. ఇది టెస్ట్‌ట్యూబ్ (ఐవీఎఫ్) చికిత్సకు అనువుగా ఉంటుంది.

పీజీఎస్, పీజీడీ: ప్రీఇంప్లాంటేషన్ జెనెటిక్ స్క్రీనింగ్ (పీజీఎస్), ప్రీఇంప్లాంటేషన్ జెనెటిక్ డయాగ్నోసిస్ (పీజీడీ) విధానాలు గర్భస్రావం ముప్పును తగ్గిస్తాయి. గర్భధారణ విజయవంతమయ్యేలా చేస్తాయి. అంతేకాకుండా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు ఏదైనా జన్యు పరమైన వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి పీజీఎస్, పీజీడీ చికిత్సలు వీలు కలిగిస్తాయి.



కృత్రిమ మేధ: కాగా, ఐవీఎఫ్ రంగంలో ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ) బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. దీంతో గర్భధారణకు (ప్రెగ్నెన్సీ) సంబంధించి మామూలు కంటికి కనిపించని వివరాలను గుర్తించవచ్చు. అవసరానికి అనుగుణంగా చికిత్స చేయవచ్చు.

టైమ్ లాప్సింగ్ ఇమేజింగ్ (టీఎల్ఐ): టైమ్ లాప్సింగ్ ఇమేజింగ్, కృత్రిమ మేధలను కలపడం ద్వారా గర్భధారణలో కీలకమైన బ్లాస్టోసిస్ట్ దశలో అండం ఫలదీకరణ చెందే క్రమంలో సహాయకారిగా ఉండే అవకాశం ఉంది. టైమ్ లాప్సింగ్ ఇమేజింగ్ ద్వారా పిండం అభివృద్ధి చెందే క్రమాన్ని ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చు.

క్రయోప్రిజర్వేషన్: ద్రవ నత్రజనిలో అతి శీతల పరిస్థితుల్లో నిల్వ ఉంచే క్రయోప్రిజర్వేషన్ పద్ధతి సాయంతో అండాలు, వీర్యకణాలు, పిండాలను భవిష్యత్తులో ఉపయోగించుకోవడానికి వీలవుతుంది.

ఇవేకాకుండా సంతాన సఫలత విషయంలో అసిస్టెడ్ హ్యాచింగ్, రోబోటిక్ సాంకేతికత, నానోటెక్నాలజీ కూడా ప్రముఖ పాత్ర పోషించనున్నాయి. మొత్తంమీద సంతానం కోసం వేచి చూస్తున్నవారికి ఇటీవలి కాలంలో వైద్య రంగంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగింది. అయినప్పటికీ ఈ విషయంలో మరిన్ని సాంకేతికతల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్యాస్ట్రిక్ తలనొప్పికి ఇంటిచిట్కాలు

కొంతమందిని తలనొప్పి తరచుగా బాధిస్తూ ఉంటుంది. ఒక్కోసారి మనిషిని పడుకోనీయదు, అలాగని లేస్తే కుదురుగా ఉండనీయదు. ఇది గ్యాస్ట్రిక్ తలనొప్పి కావొచ్చు అంటున్నారు వైద్యులు. గ్యాస్ట్రిక్ తలనొప్పి పొట్టకు సంబంధించిన సమస్య. కడుపులో గ్యాస్ ఏర్పడ్డప్పుడు అది క్రమంగా తలకు పాకుతుంది. అలా తలనొప్పి మొదలైపోతుంది. అజీర్ణం, జీర్ణశక్తి తక్కువగా ఉండటం, పొట్ట, పేగులకు సంబంధించిన సమస్యల వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది.



తలనొప్పితోపాటు... వికారం, వాంతులు, కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, గ్యాస్ ఏర్పడటం, అజీర్ణం, పొట్టలో ఆమ్లం అన్నవాహికలోకి రావడం, విరేచనాలు లేదంటే మలబద్ధకం మొదలైనవి కలిసి బాధిస్తే అది గ్యాస్ట్రిక్ తలనొప్పి. పాడైపోయిన ఆహారం, పరిమితికి మించి తినడం, మసాలా తిండ్లు, తగినన్ని నీళ్లు తాగకపోవడం, మహిళల్లో నెలసరి సమయంలో, గర్భంతో ఉన్నప్పుడు హార్మోన్ల సమతూకంలో తేడాల వల్ల ఈ సమస్య వస్తుంది. గ్యాస్ట్రిక్ తలనొప్పి నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని ఇంటిచిట్కాలు పాటిస్తే ఉపశమనం లభిస్తుంది. అవి పెప్పర్‌మింట్ టీ తాగడం, అరటి తులసి ఆకులు నమలడం, గోరువెచ్చటి నీళ్లలో నిమ్మరసం కలిపి తీసుకోవడం, సోంపు తినడం, జలజీర, మజ్జిగ తాగడం లాంటివి మంచి ఫలితాన్ని ఇస్తాయి. పెరుగు తినాలి. మెగ్నీషియం సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి.